సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 360

గురువారం 21-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



అరంగేట్రంలో అదరగొట్టేందుకు..

తొలిసారి ఐపీఎల్ బరిలో యువతారలు.. అందరి దృష్టి రచిన్ రవీంద్రపైనే - 14లో



నష్టాల్లో నుంచి లాభాల్లోకి..

90 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. నిఫ్టీ 22 పాయింట్లు అప్ - 15లో



కృత్రిమ మేధలో లీడర్ ఇండియా

ప్రపంచ దేశాల సమస్యలకు స్వదేశీ పరిష్కారాలు కనిపెట్టాలని భారత స్టార్టప్ కంపెనీల ప్రతినిధులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸



ఫిన్‌లాండ్.. హ్యాపీనెస్‌కు అడ్రస్

సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్‌లాండ్ వరుసగా ఏడోసారి తొలి స్థానం దక్కించుకుంది. భారత్ 126వ స్థానంలో నిలిచింది.

వివరాలు 6లో ▸



తప్పుడు పత్రాలతో 21 లక్షల సిమ్‌లు

దేశవ్యాప్తంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో 21 లక్షల సిమ్‌లు జారీ అయినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ గుర్తించింది.

వివరాలు 6లో ▸



హైదరాబాద్ విద్యార్థి కిడ్నాప్

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ మహ్మద్ అర్ఫద్‌ను దుండగులు కిడ్నాప్ చేశారు.

వివరాలు 12లో ▸


మేనిఫెస్టో.. ఓ పవిత్ర గ్రంథం

ఈసారీ జనరంజకమే

ఎన్నికల మేనిఫెస్టోపై వైఎస్సార్‌సీపీ ముమ్మర కసరత్తు

- 27న బస్సు యాత్ర ప్రారంభమయ్యేలోగా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల.. ఎన్నికల ప్రణాళిక రూపకల్పనపై ముఖ్యమంత్రి జగన్ కసరత్తు.. తుది దశకు చేరుకుందంటున్న పార్టీ వర్గాలు
- అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలను నెరవేర్చి మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం
- 58 నెలల్లో 99 శాతం హామీలు అమలు
- చెప్పిన వాటితోపాటు ఇవ్వని హామీలను అమలు చేసిన సీఎం జగన్
- నవరత్నాలతో డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో జమ.. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనం
- డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.4.49 లక్షల కోట్ల మేర పేదలకు లబ్ధి
- వాటి ద్వారా 87 శాతం కుటుంబాలకు ప్రయోజనం
- సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో మరింత పెరిగిన విశ్వసనీయత.. నాలుగు 'సిద్ధం' సభల్లోనూ ఇది ప్రస్ఫుటితమైందంటున్న రాజకీయ పరిశీలకులు

2లో



- చెప్పాడంటే చేస్తాడంతే అంటూ సీఎం జగన్ మేనిఫెస్టోపై విశ్వాసం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- 2014 ఎన్నికల్లో ఏకంగా 650 హామీలు గుప్పిస్తూ మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు
- అందులో పది శాతం కూడా అమలు చేయకుండా ప్రజలను వంచించిన వైనం
- అప్పటి మాదిరిగానే జనసేన–బీజేపీతో మరోసారి జత కట్టిన టీడీపీ
- చంద్రబాబు చెప్పిందేదీ చేయడనే భావన ప్రజల్లో బలీయంగా నాటుకు పోయిందంటున్న పరిశీలకులు
- అందువల్లే గతేడాది మే 28 నుంచి సూపర్ సిక్స్ అంటూ బాబు ఊదరగొడుతున్నా పట్టించుకోని ప్రజానీకం

తొలి విడత నోటిఫికేషన్ జారీ

- 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరగనున్న ఎన్నికలు
- 102 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఏప్రిల్ 19న పోలింగ్
- అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు సైతం నోటిఫికేషన్ జారీ

3లో





ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో వంగవీటి నరేంద్ర

వైఎస్సార్‌సీపీలో చేరిన వంగవీటి నరేంద్ర

- వంగవీటి కుటుంబానికి టీడీపీ బద్ధశత్రువు
- రాధా టీడీపీలో చేరి పెద్ద తప్పు చేశారు
- రంగాను కాపాడుకోవడానికి వైఎస్సార్ ఎంతో ప్రయత్నించారు
- ఇక మా ప్రయాణం సీఎం వైఎస్ జగన్ వెంటే..

మీడియాతో వంగవీటి నరేంద్ర

2లో

ఫ్యాక్ట్‌చెక్

బాబు బాగోతమే 'బెస్ట్'ట..!

- 'పచ్చ'పాతం రామోజీకి కనబడని విద్యాభివృద్ధి.. రాష్ట్రంలో ఇప్పుడున్న 45 వేల స్కూల్స్ అన్నీ బెస్టే
- 47 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులందరికీ ఉన్నతమైన ఇంగ్లిష్ విద్య.. గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక యూనివర్సిటీ
- ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీలో ర్యాంకులు

10లో

జూన్ 23న నీట్ పీజీ..



వైద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) పీజీ–2024ను ఈ ఏడాది జూన్ 23న నిర్వహించనున్నారు. జూలై 15న ఫలితాలు ప్రకటిస్తారు. ఈ మేరకు సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ మెడికల్ కమిషన్ విడుదల చేసింది.

- వివరాలు 12లో

కోడ్‌పై సీఎస్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీ



- అత్యవసర మినహాయింపుల ప్రతిపాదనలను తొలుత స్క్రీనింగ్ కమిటీకి పంపాలి
- వాటి పరిశీలన అనంతరం కమిటీ నుంచి తగిన సిఫార్సులు
- అవి సీఈవో ద్వారా కమిషన్‌కు
- కమిషన్ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్‌రెడ్డి

3లో

డబ్బులతో పవన్ రాజకీయాలు

వైఎస్సార్‌సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

- పవన్‌కు రాజకీయాలపై క్లారిటీ లేదు.. జనం డబ్బులకు అమ్ముడు పోతారని వ్యాఖ్యలు చేయటం సరికాదు
- ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లేయాలని కోరుతాం
- కాపు మహిళా నేతగా పిఠాపురంలో నాకు మంచి ఇమేజ్ ఉంది
- నన్ను తన పార్టీలోకి రమ్మనటం పవన్ అవివేకం
- ఆయన్ను కూడా నేను మా పార్టీలోకి రమ్మంటే బాగుంటుందా?

2లో



వైఎస్సార్‌సీపీలో చేరిన పిఠాపురం నేత శేషుకుమారి



బతిమాలితేనే పవన్‌కు టికెట్ ఇచ్చాం

నన్ను కాదని జనసేన గెలవడం ఎట్టి పరిస్థితిలోనూ కుదరదు

పవన్ గెలిచినా చంద్రబాబు చెప్పినట్లే నడుచుకోవాలి

పిఠాపురం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యాఖ్యలు

- వివరాలు 11లో

డీఎస్సీ ప్రక్రియ నిలిపివేయలేం

ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదు: హైకోర్టు ధర్మాసనం

- ఉపాధ్యాయుల నియామకం ప్రభుత్వ విధాన నిర్ణయం
- అందులో జోక్యం చేసుకోలేం
- తేల్చి చెప్పిన సీజే ధర్మాసనం
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చేపట్టిన డీఎస్సీ ప్రక్రియను నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. డీఎస్సీ విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఉపాధ్యాయుల నియామకం పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయమని స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో తాము ఇప్పటికిప్పుడు జోక్యం చేసుకోలేమంది. హడావుడిగా పిటిషన్ దాఖలు చేసి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలంటే ఎలా అంటూ పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఫిబ్రవరిలో జారీ చేసిన జీవోలను ఇప్పుడు సవాలు చేశారని గుర్తు చేసింది. మధ్యంతర ఉత్తర్వులు కావాలంటే ముందే కోర్టుకొచ్చి ఉండాల్సిందని తెలిపింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, వారి అర్హతలు తదితర విషయాలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మే 1కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం

మిగతా 3వ పేజీలో ▶



ఎన్నికల కమిషన్ చేతిలో డీఎస్సీ భవితవ్యం

- డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న 4.7 లక్షల మంది
- ఈసీ అనుమతి వచ్చేవరకు టెట్ ఫలితాలు నిలుపుదల.. డీఎస్సీ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఈసీ అనుమతి కోరనుంది
- గత 3 రోజుల్లో రూ.3.39 కోట్ల విలువైన వస్తువులు జప్తు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

3లో



నేడు తేలికపాటి వర్షాలు

జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో కోస్తాంధ్రలో పలుచోట్ల బుధవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. గురువారం కూడా కోస్తాంధ్రలో ఒకటి, రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలో పొడి వాతావరణమే కొనసాగనుంది.

12లో

16 ఏళ్ల డిమాండ్.. 16 రోజుల్లో పరిష్కారం

పోలీసుల దీర్ఘకాలిక డిమాండ్లు పరిష్కరించిన సీఎం జగన్

- ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల యూనిఫామ్‌లో మార్పులు
- సరెండర్ లీవులు మంజూరు.. అమరవీరుల పిల్లలకు 2 శాతం రిజర్వేషన్
- ఎస్ఐలకు గెజిటెడ్ హోదా.. ఆ శాఖకు మరింత గౌరవం.. సంక్షేమం

సాక్షి, అమరావతి: పోలీసులు ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమించే యోధులు... కానీ వారి ఆత్మగౌరవం, సంక్షేమం గురించి గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలే లేవు. అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పోలీసుల ఆత్మగౌరవాన్ని పెంచేలా కీలక నిర్ణయాలు తీసుకోవడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని మరింతగా ఇనుమడింపజేశారు. పోలీసుల సంక్షేమం కోసం కీలక విధాన నిర్ణయాలు తీసుకున్నారు. సర్వీసు నిబంధనలు, ఆర్థిక ప్రయోజనాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించే

మిగతా 12వ పేజీలో ▶



ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల నూతన యూనిఫామ్‌లు



వలంటీర్ల వల్ల మంచే జరుగుతోందిగా

- వారి వల్ల సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయి
- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- వలంటీర్ల విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టీకరణ
- వారిని ఎన్నికలకు దూరంగా ఉంచుతూ ఈసీ ఉత్తర్వులిచ్చిందని వెల్లడి
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వం, ఈసీకి ఆదేశం

3లో



గుంటూరులో ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ నివాసం ముందు కారుతో దాడి చేస్తున్న టీడీపీ మూకలు

ప్రత్తిపాడులో టీడీపీ గూండాయిజం

- నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంటిపై టీడీపీ అభ్యర్థి దాడి
- రౌడీ మూకలతో వచ్చి స్వయంగా దాడి చేసిన మాజీ ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు
- 200 మంది రౌడీలతో 20 కార్లలో కిరణ్‌కుమార్ ఇంటిపైకి దాడి
- అభ్యర్థిని, కార్యకర్తలను అసభ్య పదజాలంతో.. కులం పేరుతో దుర్భాషలు
- అడ్డగించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణరహితంగా దాడి
- కార్లతో తొక్కించేందుకు ప్రయత్నం.. ప్రతిఘటనతో పరారైన టీడీపీ రౌడీలు
- ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు
- ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు

11లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.


జగన్ పెద్ద కొడుకయ్యాడు..



ఒక్కగానొక్క కొడుకు. పెళ్లి కాగానే వాడి దారి వాడు చూసుకున్నాడు. నా భర్త మృతి చెంది ఒంటరిగా ఉన్న నాకు జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకై ఆసరాగా నిలిచారు. మాది పేద కుటుంబం. మేము గుంటూరు జిల్లా మంగళగిరి భార్గవపేటలో అద్దె ఇంటిలో నివశించేవాళ్లం. నా భర్త సింహాచలం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. కొడుకు పెళ్లి చేసుకొని వెళ్లిపోయాక ఒంటరిగా జీవిస్తున్నా. నాలుగేళ్ల క్రితం వరకు కూలి పనులకు వెళ్లేదానిని. వయసు మీద పడడంతో పనులు చేయలేక ఇంట్లోనే ఉంటున్నా. గత ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం లేకపోవడంతో కూలికి పోకపోతే ఆకలితో అలమటించాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ ఇంటి గుమ్మం వద్దే అందజేస్తున్నారు. దాంతోనే నా జీవనం సాగుతోంది. వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ.18,750 వంతున అందింది. ఈ మొత్తంతో ఒకరిపై ఆధార పడకుండా సంతోషంగా జీవిస్తున్నా. నా పేరుతో ప్రభుత్వం ఇంటి స్థలం కూడా మంజూరు చేసింది. ఆ స్థలంలో ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు నేను దాచుకున్న డబ్బులతో ఇల్లు నిర్మించుకుంటా. నన్ను ఆదుకున్న జగనన్నకు రుణపడి ఉంటా.

– బట్టు మల్లీశ్వరి, మంగళగిరి
(ఐవీ రెడ్డి, విలేకరి, మంగళగిరి)

ఒంటరి బతుక్కు సర్కారు అండ



నా భార్య మృతి చెందింది. ఉన్న ఒక్క కుమార్తెకు పెళ్లి చేయడంతో ఆమె అత్త వారింట్లో ఉంటోంది. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం వెలగాడ పంచాయతీ చంద్రయ్యపేటలో ఇన్నాళ్లు కూలి పనులు చేసుకుని బతికేవాడ్ని. ఈ మధ్య నాకు కళ్లు కనిపించకపోవడంతో ఆ పని కూడా చేయలేకపోతున్నా. గత ప్రభుత్వంలో నాకు ఎలాంటి సాయం అందలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక దివ్యాంగ పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.3 వేలు అందుతోంది. ఉచిత రేషన్ ఇంటికే అందుతోంది. వాటిని మా బంధువులకు ఇవ్వడంతో వారే నాకు భోజనం సమకూరుస్తున్నారు. నాకు అనారోగ్యం వస్తే నా ఇంటికి వైద్య సిబ్బంది వచ్చి నాకు అన్ని రకాల పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. దీని వల్ల నా జీవితానికి ఎలాంటి సమస్యా లేదు. నా బతుక్కి భరోసా కల్పిస్తున్న ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– దండా గణపతి, చంద్రయ్యపేట
(ఎస్.సూర్యనారాయణ, విలేకరి, జి.సిగడాం)

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో ఏళ్లుగా పూరిపాకలో ఉన్న మాకు ఈ ప్రభుత్వ హయాంలో పక్కా ఇల్లు సమకూరింది. మేము విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీలోని దిబ్బడిపాలెంలో నివసిస్తున్నాం. నేను, నా భర్త లక్ష్మణరావు రజక వృత్తి చేసుకుంటున్నాం. మాకు 8వ తరగతి చదువుతున్న కూతురు లక్ష్మి, పదో తరగతి చదువుతున్న కుమారుడు అప్పన్న ఉన్నారు. గతంలో మేము కమ్మలపాకలో నివసించడం వల్ల వర్షాకాలం వస్తే కారిపోయి కనీసం నిలబడడానికి కూడా ఇబ్బంది పడేవాళ్లం. వర్షాకాలంలో పిల్లల చదువుకు తీవ్ర ఆటంకంగా ఉండేది. ఎటువంటి ఆస్తులు లేక, సొంతంగా ఇల్లు నిర్మించుకునే స్తోమత లేక కమ్మల ఇంట్లోనే కాలక్షేపం చేశాం. టీడీపీ పాలనలో పక్కా ఇంటి కోసం మూడుసార్లు దరఖాస్తు చేసినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గిడిజాల సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా, మాకు వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేశారు. బిల్లులు కూడా సకాలంలో అందడంతో నిర్మాణం పూర్తి చేసుకొని కొత్త ఇంట్లో ఉంటున్నాం. మాకు ఏటా రూ.15 వేల వంతున అమ్మఒడి వచ్చింది. జగనన్న చేయూత కింద ఏటా రూ.10 వేలు వస్తోంది. చీకూ చింత లేకుండా హాయిగా జీవిస్తున్నాం.


– గుసిడి నాగమణి,
దిబ్బడిపాలెం, విశాఖపట్నం జిల్లా
(మహంతి శివాజీ, విలేకరి, ఆనందపురం)

తమిళులకు కేంద్ర మంత్రి శోభా క్షమాపణ

శివాజీనగర: బెంగళూరులోని రామేశ్వరం కెఫేలో పేలుడు ఘటనపై తాను గతంలో చేసిన వ్యాఖ్యల మీద కర్ణాటకకు చెందిన కేంద్రమంత్రి శోభా కరంద్లాజె క్షమాపణ కోరారు. తమిళనాడులోని క్రిష్ణగిరి అడవుల్లో శిక్షణ పొందిన వ్యక్తి ఈ పేలుడుకు పాల్పడినట్లు శోభా ఇటీవల ఆరోపించారు. హిందువులు, బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని కర్ణాటక సీఎం సిద్దరామయ్య మతతత్వవాదులను ప్రోత్సహించారని ఆమె దుయ్యబట్టారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తమిళనాడు సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో శోభ స్పందిస్తూ తన వ్యాఖ్యలపై క్షమాపణ కోరుతున్నానని, తమిళ సోదరీ సోదరమణులకు ఈ విషయం చెబుతున్నానని తెలిపారు.

ఈసారీ జనరంజకమే

27న బస్సు యాత్ర ప్రారంభమయ్యేలోగా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలకు శ్రేణులను 'సిద్ధం' సభలతో సన్నద్ధం చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ మేనిఫెస్టో రూపకల్పనపై చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరుకుందని పార్టీ వర్గాలు తెలిపాయి. 4 లోక్‌సభ స్థానాల పరిధిలో ఇప్పటికే సిద్ధం సభలు నిర్వహించిన నేపథ్యంలో మిగతా 21 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ప్రజలతో మమేకమవుతూ పార్టీ శ్రేణులను, అభిమానులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు ఈనెల 27న ఇడుపులపాయ నుంచి శ్రీకారం చుట్టనున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్ మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం చెప్పారు. చెప్పిన వాటితోపాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేయడంతో జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత మరింత పెరిగింది. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలతో ఇది ప్రస్ఫుటితమైంది. బస్సు యాత్ర ప్రారంభమయ్యేలోగా మేనిఫెస్టోను ప్రకటించనుండటంతో జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అన్న నమ్మకం ప్రజల హృదయాల్లో నాటుకుపోయింది.

పాలనకు దిక్సూచిగా..

ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి హామీలు గుప్పిస్తూ మేనిఫెస్టో విడుదల చేయడం.. గద్దెనెక్కాక ఐదేళ్ల పాటు సాగదీసి దిగిపోయే వేళ మళ్లీ ఓటర్లను ఆకట్టుకోవడానికి అరకొరగా హామీలు అమలు చేయడం రాజకీయ పార్టీలకు రివాజుగా మారింది. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మేనిఫెస్టోను వెబ్ సైట్ నుంచి కూడా మాయం చేసిన విషయం అందరికీ తెలిసిందే. గత ఎన్నికల్లో రెండే రెండు పేజీలతో కూడిన మేనిఫెస్టోను ప్రకటించిన వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే సీఎం కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మేనిఫెస్టో బోర్డులు ఏర్పాటు చేసి దానికి పవిత్రతను ఆపాదించారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలను అమలు చేశారు. ఐదేళ్లలో మొత్తమ్మీద 99 శాతం హామీలను నెరవేర్చారు. ఏపీ లో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2.70 లక్షల కోట్లు పారదర్శకంగా జమ చేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. నాన్‌డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపితే నవరత్నాలు ద్వారా రూ.4.49 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని పేదలకు గత 58 నెలల్లో సీఎం జగన్ చేకూర్చారు. దీన్ని సద్వినియోగం చేసుకుని పేదరికం నుంచి గట్టెక్కుతున్నారు. ఏపీలో పేదరికం 2015–16లో 11.77 శాతం ఉంటే 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం.

విప్లవాత్మక మార్పులు..

వికేంద్రీకరణతో సుపరిపాలన అందిస్తూనే విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసి ఇంగ్లీషు మీడియం బోధనను ప్రవేశపెట్టారు. విద్యాకానుక కింద పాఠశాలలు ప్రారంభమైన రోజే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగ్, యూనిఫామ్‌లు, బూట్లు విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందిస్తూ చిక్కీని కూడా అందచేస్తున్నారు. విద్యాదీవెన పథకం ద్వారా ఎంత ఫీజు ఉంటే అంతా రీయింబర్స్ చేస్తుండగా వసతి దీవెన కింద వసతి ఖర్చులు చెల్లిస్తున్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ శిక్షణ ఇచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉన్నతోద్యోగాలు పొందేలా దోహదం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉండగా గత 58 నెలల్లో ఏకంగా 2.13 లక్షల ఉద్యోగాలను సీఎం జగన్ భర్తీ చేశారు. ఆరోగ్యశ్రీ ఉచిత చికిత్స పరిధిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు నాడు–నేడు కింద ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి చేర్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా 16 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలను చేరువ చేశారు. తీర ప్రాంతాల్లో నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండ్ సెంటర్లు, రహదారులు, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం లాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తున్నారు. సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ఇంటి గుమ్మం వద్దే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. సీఎం జగన్ సుపరిపాలన, సంస్కరణలతో సాకారమైన మార్పులు ప్రతి చోటా కళ్లకు కట్టినట్లు కన్పిస్తుంది. ఆ మార్పులు కొనసాగుతూ ఏపీ ప్రగతిపథంలో దూసుకెళ్లేలా పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేలా మేనిఫెస్టోను సీఎం జగన్ రూపొందిస్తారని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

టీడీపీ 'సూపర్ సిక్స్'ను పట్టించుకోని ప్రజలు..

జనసేన, బీజేపీ పొత్తు కుదరక ముందు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో గతేడాది మే 28న ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జనసేన, బీజేపీతో పొత్తు కుదిరిన నేపథ్యంలో పూర్తి స్థాయి మేనిఫెస్టోను ప్రకటిస్తామని చంద్రబాబు పదే పదే చెబుతున్నా ఎవరూ ఆసక్తి చూపడం లేదు. చెప్పిన మాటపై చంద్రబాబు నిలబడడు.. మోసం చేస్తాడనే భావన ప్రజల్లో బలీయంగా నాటుకుపోవడమే అందుకు కారణమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో రైతు రుణాల మాఫీపై తొలి సంతకం చేస్తానని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇస్తూ తన ఫోటోతోపాటు పవన్, ప్రధాని మోదీ ఫోటోలు ముద్రించిన లేఖపై చంద్రబాబు సంతకం చేసి టీడీపీ కార్యకర్తల ద్వారా ప్రతి ఇంటికీ పంపారు. వాటితో కలిపి 650 హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అందులో 10 శాతం కూడా అమలు చేయకుండా మోసం చేశారు. ఇప్పుడు మళ్లీ అదే కూటమి జట్టు కట్టగా సూపర్ సిక్స్ అంటూ మినీ మేనిఫెస్టోపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలెవరూ విశ్వసించడం లేదు.

డబ్బులతో పవన్ రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- మేం ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లేయమని కోరతాం
- వైఎస్సార్‌సీపీలో చేరిన పిఠాపురం జనసేన నేత శేషుకుమారి



సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన శేషుకుమారి, ఆమె సోదరి సుజాత. చిత్రంలో ఎంపీ వంగా గీత

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలపై స్పష్టత లేదని వైఎస్సార్‌సీపీ పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి వంగా గీత విమర్శించారు. డబ్బులతో రాజకీయం చేయాలని పవన్ భావిస్తున్నారని దుయ్యబట్టారు. 'కాపు మహిళా నేతగా పిఠాపురంలో నాకు మంచి ఇమేజ్ ఉంది. నా బంధువులు, స్నేహితులు అక్కడ చాలా ఎక్కువ. నన్ను తన పార్టీలోకి రమ్మనటం పవన్ అవివేకం. ఆయన్ను కూడా నేను వైఎస్సార్‌సీపీలోకి రమ్మంటే బాగుంటుందా? ఓ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అర్థంపర్థం లేకుండా మాట్లాడటం సరికాదు. సీఎం జగన్ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది. రాజకీయ సిఫార్సులకు తావు లేకుండా డీబీటీ ద్వారా ప్రజలకు పథకాలను అందించారు. మధ్యవర్తులు లేకుండా అంత డబ్బు ఎప్పుడూ ప్రజల ఖాతాల్లోకి చేరలేదు. అందుకే సీఎం జగన్ ఏదైనా చెబితే చేస్తారని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని అందరికీ నమ్మకం ఉంది. గత ఐదేళ్లలో సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లేయాలని మేం కోరతాం. ఒకే ఒక్కడు వైఎస్ జగన్‌ను ఢీకొనలేక మిగతా పార్టీలన్నీ కలిసి పోటీ చేస్తున్నాయి. అయినా సరే గెలవడం అటుంచి వైఎస్సార్‌సీపీకి గట్టి పోటీ ఇస్తామనే నమ్మకం కూడా వారికి లేదు' అని వంగా గీత పేర్కొన్నారు. జనసేన పిఠాపురం మాజీ ఇన్‌ఛార్జి మాకినీడి శేషుకుమారి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డితో కలసి సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు.

పవన్‌ను జనం నమ్మట్లేదు: మాకినీడి శేషుకుమారి

పవన్ కల్యాణ్‌ని జనం నమ్మే పరిస్థితి లేదు. జనసేనకి అసలు విధివిధానాలే లేవు. పిఠాపురం ప్రజల మనోభావాలను పవన్ అర్థం చేసుకోలేరు. జనసేనలో అనేక సమస్యలున్నాయి. సీఎం జగన్‌తో పోల్చుకునే స్థాయి పవన్‌కు లేదు. పవన్ చెప్పే సిద్ధాంతాలన్నీ మైకుల ముందుకే పరిమితం. నోటికి ఏదొస్తే అది తనకు అన్వయించుకుని మాట్లాడటం పవన్ అలవాటు. ఆయనకు ఒక సిద్ధాంతం, అభిప్రాయం లేదు. ఆ సమయంలో ఏదీ తోస్తే అది చేసేస్తారు. ఒక రాజకీయ నేతకు ఉండాల్సిన లక్షణాల్లో ఒక్కటి కూడా పవన్‌కు లేవు. ఎందుకు పార్టీ పెట్టాడో ఆయనకే క్లారిటీ లేదు. వేదికపై చెప్పి వాటిని ఒకరోజైనా ఆచరణలో పెట్టరు. స్పీచ్ ముగియగానే వాటిని మరిచిపోతారు. పార్టీ అంటే ఒక వ్యవస్థ ఉంటుంది. జనసేనను ఒక రాజకీయ పార్టీగా చూడకూడదు. నేను గతంలో పిఠాపురం నుంచి పోటీ చేసి 28 వేల ఓట్లు సాధించా. నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తున్న పార్టీ వైఎస్సార్‌సీపీలో చేరుతున్నా.

వైఎస్సార్‌సీపీలో చేరిన వంగవీటి నరేంద్ర

- వంగవీటి కుటుంబానికి టీడీపీ బద్ధశత్రువు
- వంగవీటి రాధా టీడీపీలో చేరి పెద్ద తప్పు చేశారు
- వైఎస్సార్, వంగవీటి రంగా సొంత సోదరులుగా మెలిగేవారు
- రంగాను కాపాడుకోవడానికి వైఎస్సార్ ఎంతో ప్రయత్నించారు
- వైఎస్, వంగవీటి కుటుంబాలు వేరు కాదు..ఇక మా ప్రయాణం సీఎం వైఎస్ జగన్ వెంటే
- మీడియాతో వంగవీటి నరేంద్ర

సాక్షి, అమరావతి: రాధా–రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి, రాధా–రంగా మిత్రమండలి సభ్యులు షేక్ బాబు, ఇమ్రాన్ రజా, పి.నరేంద్ర, నాగశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగాను హత్య చేయించింది టీడీపీనే

వైఎస్సార్‌సీపీలో చేరిన అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయం మీడియా పాయింట్ వద్ద వంగవీటి నరేంద్ర మీడియాతో మాట్లాడుతూ.. పేదల బాగు కోసం వంగవీటి రంగా ఎన్నో పోరాటాలు చేసి గొప్ప నేతగా ఎదిగారని గుర్తు చేశారు. దీనిని చూసి ఓర్వలేని టీడీపీ దీక్షలో ఉన్న రంగాను దారుణంగా హత్య చేయిందన్నారు. దీనిపై నాటినుంచి రాధా–రంగా మిత్రమండలి సభ్యులు రగిలిపోతున్నారని పేర్కొన్నారు. రంగాను పొట్టన పెట్టుకున్న టీడీపీలో చేరి తన సోదరుడు వంగవీటి రాధా తప్పు చేశారన్నారు. కులోన్మాది చంద్రబాబు పంచన చేరి రాధా చారిత్రాత్మక తప్పిదం చేశారన్నారు. ఆయన టీడీపీలో చేరడం ఎవరికీ ఇష్టం లేదన్నారు. ఇలా చేయడం వల్ల వంగవీటి రంగా ఆత్మ క్షోభిస్తుందన్నారు. రంగాను చంద్రబాబు పొట్టన పెట్టుకున్న విషయాన్ని రాధా–రంగా మిత్రమండలి ఎలా మరిచిపోగలదని ప్రశ్నించారు. రంగాను హత్య చేసిన వారిని టీడీపీ ప్రభుత్వమే శిక్ష పడకుండా తప్పించిందని గుర్తు చేశారు. రంగాను హత్య చేసిన వారికి శిక్ష పడే వరకు తాము పోరాడుతూనే ఉంటామన్నారు.

వైఎస్సార్, వంగవీటి కుటుంబాలు ఒకటిగా ఉండేవి

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి రంగా కుటుంబాలు అప్పట్లో ఒకటిగానే ఉండేవని.. ఇద్దరూ సొంత సోదరులుగా మెలిగేవారని నరేంద్ర గుర్తు చేశారు. ఆ రెండు కుటుంబాలు వేరు కాదని.. వైఎస్సార్, రంగా వేరని ఇప్పటికీ ఎవరూ భావించరని పేర్కొన్నారు. రంగాను కాపాడుకోవాలని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయాలను వంగవీటి కుటుంబ సభ్యులైన తాము ఎలా మర్చిపోగలమని ప్రశ్నించారు. వైఎస్సార్ కుమారుడు వైఎస్ జగన్ తమ కుటుంబానికి సొంత సోదరుడితో సమానమని, వైఎస్, వంగవీటి కుటుంబాలకు 4 దశాబ్దాల అనుబంధం తమదన్నారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ కూటమి ఏర్పడింది ప్రజల కోసం కాదని.. వారి స్వార్థం కోసమేనని వ్యాఖ్యానించారు. టీడీపీతో పొత్తు పెట్టుకుని బీజేపీ తప్పు చేసిందన్నారు. స్వలాభం కోసమే టీడీపీ పనిచేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల కోసం పని చేస్తోందన్నారు. ఐదేళ్లలో పేదలకు సంక్షేమ పథకాలు జగన్ అందించారని, వైఎస్ జగన్‌నే ప్రజలు తిరిగి సీఎంగా ఎన్నుకుంటారని చెప్పారు. జగన్ ఆశయాలను నెరవేర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, జగన్ ఏమి చెబితే అది చేస్తానని పేర్కొన్నారు. ఇక రాజకీయాల్లో తమ ప్రయాణం సీఎం జగన్ వెంటేనని చెప్పారు.





ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు, ముస్లిం యువత



విద్యార్థులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు





టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు





మాజీ మంత్రి చెరుకువాడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న మత్స్యకార, శెట్టిబలిజ ప్రతినిధులు

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- భీమవరం, మొగల్తూరుల్లో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు
- ఆచంటలో మత్స్యకార కుటుంబాలు, శెట్టిబలిజ సంఘ నాయకులు
- ఉంగుటూరులో టీడీపీని వీడిన బీసీ నాయకులు
- ఏలూరులో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు, ముస్లిం యువత

భీమవరం/మొగల్తూరు/ఉంగుటూరు/పెనుగొండ/ఏలూరు (టూటౌన్)/ తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో పలు వార్డులకు చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు, విద్యార్థులు ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మొగల్తూరు మండలంలోని కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో టీడీపీ, జనసేనలకు చెందిన పాలపర్తి ప్రసాద్, కొలవర్తి మరియబాబు, బత్తుల ఏసు, పాలపర్తి చక్రవర్తి, కోలాటి సంజీవరావు, నేతల సుబ్బారావు, మండ సువర్ణ రాజు, అశోక్, ప్రసాద్ తదితరులున్నారు. ఆచంట నియోజకవర్గం పెనుగొండ మండలం దొంగరావిపాలెంకి చెందిన మత్స్యకార కుటుంబాలు తూర్పుపాలెంలో మాజీ మంత్రి చెరుకువాడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వాటిలో పల్లపోలు సుబ్రహ్మణ్యం, కొల్లాటి రాంబాబు, కర్రి రామాంజనేయులు, మల్లాడి శివ ప్రసాద్, సందాడి రాజు, ఓలేటి సంపత్‌రావు, లంకే నాగరాజు, సంగాని నాగార్జున కుటుంబాలున్నాయి. వీరితో పాటు పెనుగొండ నుంచి శెట్టిబలిజ సంఘ నాయకులు బండి వెంకట్రావు, పలువురు శెట్టిబలిజ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం శివారు రామన్నగూడెంలో 100 మంది బీసీ నాయకులు టీడీపీని వీడి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరులో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, 12వ డివిజన్‌కు చెందిన ముస్లిం యువత ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరూ స్థానిక ఒకటవ, రెండవ డివిజన్ కార్పొరేటర్లు ఆరేపల్లి రాధిక సత్తిబాబు, జున్నూరి నరసింహారావు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పల్లి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు, తణుకు 8వ వార్డు నుంచి వచ్చిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరారు.



టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

క్లుప్తంగా...

ఓటర్‌గా నమోదుకు అవకాశం



సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు నిండే యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. లోక్‌సభ, 4 రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలను ఏడు దశల్లో నిర్వహిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం.. తొలి దశకు నోటిఫికేషన్ జారీ చేసింది. మిగిలిన దశల్లో ఎన్నికలు జరిగే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల చివరి తేదీలు ఏప్రిల్ 1వ తేదీ తర్వాత ఉంటాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతకు ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

ఎన్నికల కోడ్‌పై సీఎస్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రవర్తన నియమావళి (కోడ్) అమల్లో ఉన్న నేపథ్యంలో అత్యవసరంగా మినహాయింపులు అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటైంది. కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ డా. కేఎస్ జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతిపాదనలకు చెందిన శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక సీఎస్‌లు, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక సీఎస్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మినహాయింపుల కోసం ఏ రాష్ట్ర ప్రభుత్వ శాఖ నేరుగా కేంద్ర ఎన్నికల సంఘానికి నేరుగా పంపించడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి ముగిసే వరకు వేచి ఉండేందుకు సంబంధించిన ప్రతిపాదనలను అసలు పరిశీలన చేయవద్దని కూడా కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అత్యవసరంగా నిర్ణయం తీసుకోవాల్సిన ప్రతిపాదనలను సీఎస్ అధ్యక్షతన గల స్క్రీనింగ్ కమిటీ అధ్యయనం చేసి, తగిన సిఫార్సులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పంపించాలి. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆ ప్రతిపాదనలను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయం మేరకు తదుపరి చర్యలు ఉంటాయి.

సి-విజిల్ ఫిర్యాదులతో అక్రమాలకు చెక్ పెట్టాలి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభ పెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించడం, ప్రత్యర్థి పార్టీలపై తప్పుడు ప్రచారం చేయడం వంటి వివిధ కోడ్ ఉల్లంఘనలపై సి-విజిల్ అనే యాప్ ద్వారా ప్రజలే నేరుగా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ దృష్టికి వచ్చిన ప్రతి తప్పును సి-విజిల్ యాప్ ద్వారా అత్యంత సులభంగా ఈసీ దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉందని తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఈసీ వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఐదేళ్ల తన పాలనపై సీఎం జగన్‌కు నమ్మకం లేదని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తరువాత కూడా కొత్తగా ఓట్లు నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 15 తేదీ వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

● తెలంగాణ

తెలంగాణ కొత్త గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, అధికారులు, ప్రజా సంఘాలు, సామాన్య ప్రజలకు రాజ్‌భవన్ అత్యంత నిబద్ధతతో నిర్విరామ సహకారం అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చెప్పారు. తాను అందరి వాణిని వింటానని, ప్రతి ఆందోళనను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియను ఎల్లవేళలా సమర్థిస్తూ, గౌరవించేలా, అత్యంత శ్రద్ధతో తన విధులను నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ రాష్ట్ర మూడో గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం ఉదయం రాజ్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ గవర్నర్లు సీహెచ్ విద్యాసాగర్‌రావు, రామ్మోహన్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ ప్రసంగించడంతో పాటు రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఓ సందేశాన్ని విడుదల చేశారు. కాగా, గవర్నర్ రాధాకృష్ణన్ బుధవారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

ఎన్నికల కమిషన్ చేతిలో డీఎస్సీ భవితవ్యం



సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి లభించిన తర్వాతే డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. అంతవరకు టెట్ పరీక్షల ఫలితాలను కూడా ప్రకటించవద్దని ఆదేశించినట్లు తెలిపారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీలో 6,100 పోస్టులకు 4.72 లక్షల మంది పోటీపడుతున్నట్లు తెలిపారు. డీఎస్సీ నిర్వహించాలని కొందరు, వాయిదా కోరుతూ మరికొందరు మెయిల్స్, ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేయడంతో ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. డీఎస్సీ పరీక్ష నిర్వహించడానికి అనుమతి కోరుతూ ఈసీకి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో లేఖ రాయనుందని, ఇందుకోసం సీఎస్ ఆధ్వర్యంలో ఒక స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం డీఎస్సీ నిర్వహించమంటే నిర్వహిస్తామని, లేదంటే వాయిదా వేస్తామని స్పష్టం చేశారు.

పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు

రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత మూడు రోజుల్లో రూ.3.39 కోట్ల విలువైన నగదు, వస్తువులు జప్తు చేశామన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై 385 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, 46 మందిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో 40 మంది వలంటీర్లు ఉన్నారని, వారిని విధుల నుంచి తొలగించామని చెప్పారు. మరో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న గోడ రాతలు, బ్యానర్లు, ఇతర వస్తువులు మొత్తం 1,99,000 తొలగించగా, ప్రైవేటు స్థలాల్లో 1,15,000 తొలగించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ప్రచారం కోసం ఆస్తులను వినియోగించిన వారిపై 94 కేసులు, ప్రభుత్వ వాహనాలను దుర్వినియోగం చేసినవారిపై 37 కేసులు నమోదు చేశామన్నారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రోజూ డిస్టిలరీల నుంచి మద్యం ఉత్పత్తి, గొడౌన్ల నుంచి మద్యం నిల్వల వివరాలు తెప్పించి, గతేడాది గణాంకాలతో పోల్చి చూస్తున్నామని, ఎక్కడా మద్యం అమ్మకాలు పెరగలేదన్నారు. ఇంతవరకు అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలు కనిపించలేదన్నారు.

ప్రధాని భద్రత కేంద్ర హోంశాఖ అంశం

ప్రధాని భద్రత కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, ఎస్పీజీ పరిధిలోనికి వస్తుందని, సీఈవో పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. ప్రధాని సభ భద్రతా వైఫల్యాలపై వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపామన్నారు. రాష్ట్రంలో ఎటువంటి హింసాత్మక ఘటనలు రీపోలింగ్ వంటివి లేకుండా ఎన్నికలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కోడ్ వచ్చిన తర్వాత గిద్దలూరు, ఆళ్లగడ్డ, మాచర్లల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై గురువారం స్వయంగా వచ్చి నివేదిక ఇవ్వాలని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల ఎస్పీలను ఆదేశించినట్లు తెలిపారు. వారి వివరణ ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక ఇస్తామన్నారు.

సీవిజిల్‌తో సత్వర పరిష్కారం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఓటరు సీవిజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఎన్నికల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే 100 నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటామని, అదే నేరుగా తమకు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారికి పంపి వివరణ తీసుకొని చర్యలు చేపట్టడానికి చాలా సమయం పడుతుందన్నారు. కోడ్ ఉల్లంఘన అంశాలు వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వాటిపై తక్షణం స్పందించడానికి 1,173 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు సీవిజిల్ యాప్ ద్వారా 1,307 ఫిర్యాదులు వస్తే అందులో 40 తప్ప అన్నీ పరిష్కరించినట్లు తెలిపారు.

డీఎస్సీ ప్రక్రియ నిలిపివేయలేం

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు కలిగిన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని, ఈ విషయంలో అన్ని స్కూళ్లను ఒకే రకంగా చూసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. పాఠశాలల్లో వివిధ ఉపాధ్యాయ పోస్టుల మార్గదర్శకాల జీవోలు 11, 12కు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాది ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపిస్తూ.. స్థానిక సంస్థల పాఠశాలల్లో ఇంగ్లిష్ నైపుణ్యం ఉన్న వారిని టీచర్లుగా నియమించడం లేదని, వారికి ఇంగ్లిష్ నైపుణ్య పరీక్ష నిర్వహించడం లేదని తెలిపారు. రెసిడెన్షియల్, మోడల్, గురుకుల పాఠశాలల్లో మాత్రమే ఇంగ్లీషు నైపుణ్య పరీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇలా వివక్ష చూపడానికి వీల్లేదన్నారు. అర్హులైన టీచర్లను నియమించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారమే నియామకాలు..
రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఉపాధ్యాయులుగా ఎంపికైన తరువాత రెండేళ్లు వారికి నైపుణ్య తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పిటిషనర్ గతంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంగ్లిష్ మీడియంను సవాలు చేశారని, ప్రభుత్వ విధానాలను తప్పుపట్టడాన్నే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనలకు అనుగుణంగా నియామకాలు చేస్తున్నామని తెలిపారు. ఈ దశలో ఇంద్రనీల్ జోక్యం చేసుకుంటూ, డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తయితే తమ వ్యాజ్యం నిరర్థకమవుతుందని, అందువల్ల ఆ ప్రక్రియ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది.

స్వేచ్ఛగా, శాంతియుతంగా ఎన్నికలు

- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- 50% కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్.. కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ
- నిరంతరం నిఘాకు 121 చెక్ పోస్టులు
- జనవరి నుండి రూ.176 కోట్ల విలువైన నగదు, మద్యం స్వాధీనం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్ రెడ్డి
- బందోబస్తుకు కేంద్ర, రాష్ట్ర బలగాలతో పాటు సమీప రాష్ట్రాల పోలీసులు: డీజీపీ

సాక్షి, అమరావతి: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో కలిసి సీఎస్ సమీక్షించారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ, ఐటీ, స్వీప్, శాంతి భద్రతలు, కమ్యూనికేషన్ ప్లాన్, కంప్లైంట్ రిడ్రస్సల్, ఓటరు హెల్ప్ లైన్, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు. ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.



రాష్ట్రంలోని 46,165 పోలింగ్ కేంద్రాలున్నాయని, కనీసం 50 శాతం కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. వెబ్ కాస్టింగ్ ఉన్న కేంద్రాలు నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం కంట్రోల్ రూమ్‌లతో అనుసంధానమై ఉంటాయని, వాటిలో పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షిస్తారని చెప్పారు. జనవరి నుండి ఇప్పటివరకు రూ.78 కోట్ల నగదు, రూ.41 కోట్ల విలువైన ఖరీదైన వస్తువులు, రూ.30 కోట్ల విలువైన వివిధ డ్రగ్స్ వంటివి మొత్తం రూ.176 కోట్ల విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన గత నాలుగు రోజుల్లోనే వివిధ రూ. 3.39 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తామన్నారు. అక్రమాల నియంత్రణకు రాష్ట్ర సరిహద్దులు, ఇతర ప్రాంతాల్లో 60 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు సహా 121 చెక్ పోస్టులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల బందోబస్తుకు 1.50 లక్షల మంది రాష్ట్ర పోలీసులు, 522 కంపెనీల స్టేట్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, 465 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి హోంగార్డు తదితర స్థాయి పోలీసులను నియమిస్తున్నట్లు తెలిపారు.

సిబ్బంది, వాహనాలు సిద్ధం: మీనా

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఎన్నికల సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో 4,09,41,182 మంది ఓటర్లున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ సిబ్బందికి 12,683 వాహనాలు, పోలింగ్ సిబ్బందికి 13,322 వాహనాలు అవసరమని చెప్పారు. 175 మంది అసెంబ్లీ, 25 మంది పార్లమెంట్ రిటర్నింగ్ అధికారులు, 829 మంది అసెంబ్లీ, 209 మంది పార్లమెంట్ ఎఆర్ఓలు, 5,067 మంది సెక్టోరల్ అధికారులు, 5,067 మంది సెక్టోరల్ పోలీస్ అధికారులు, 18,961 మంది మైక్రో అబ్జర్వర్లు, 55,269 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,48,814 మంది పోలింగ్ అధికారులు, 46,165 బూత్ స్థాయి అధికారులు, 416 మంది జిల్లా స్థాయి నోడల్ అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, తాగు నీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలను కల్పించామన్నారు. ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు నియోజకవర్గాల పరిధిలో మోడల్ కోడ్ బృందాలు చురుగ్గా పని చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో హోం, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యా శాఖల ముఖ్య కార్యదర్శులు హరీశ్ కుమార్ గుప్త, శశిభూషణ్ కుమార్, ప్రవీణ్ ప్రకాశ్, స్టేట్ టాక్స్ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్, విద్యా శాఖ కమిషనర్ సురేశ్ కుమార్, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, సీడీఎంఏ శ్రీకేశ్ బాలాజీ రావు, అదనపు సీఈవో హరీంద్ర ప్రసాద్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ రవి ప్రకాశ్ పాల్గొన్నారు.

తొలి విడత నోటిఫికేషన్ జారీ



సాక్షి, న్యూఢిల్లీ: తొలి విడత సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న తొలి విడత ఎన్నికలు జరుగనున్నాయి. వీటితోపాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలు, తమిళనాడులోని విలవన్‌కోడ్, త్రిపురలోని రామ్‌నగర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను సైతం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 28న నామినేషన్లను పరిశీలిస్తారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. బిహార్‌లో మాత్రం స్థానిక వేడుక నేపథ్యంలో నామినేషన్లకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు విధించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు విడతల్లో జరుగనున్న సంగతి తెలిసిందే. తొలి విడతలో అత్యధికంగా తమిళనాడులో 39 స్థానాలు, రాజస్తాన్‌లో 12, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, అసోం, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఐదు స్థానాల చొప్పున, బిహార్‌లో 4, పశ్చిమ బెంగాల్‌లో 3, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో రెండు స్థానాల చొప్పున, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, నాగా లాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్, జమ్మూకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లో ఒక్కో స్థానానికి ఏప్రిల్ 19న పోలింగ్ జరుగనుంది.

48 గంటల్లో సెట్‌టాప్ బాక్స్‌లను పునరుద్ధరిస్తాం

ఏపీఎస్ఎఫ్ఎల్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని సెట్‌టాప్ బాక్స్‌ల సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్నికల నియమావళికనుగుణంగా డేటాను మార్చాల్సి ఉండటంతో సేవలను తాత్కాలికంగా నిలిపివేశామని, 48 గంటల్లో సేవలను అందించే విధంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నట్లు తెలిపింది. ఈ సాంకేతిక సమస్య పరిష్కారమై ప్రసారాలను పునరుద్ధరించే వరకు సహకరించాల్సిందిగా ఎల్‌సీవోలు, ఎంఎస్‌వోలు, వినియోగదారులను కోరింది.

ఆందోళనలతో 'కూటమి' కుతకుత

నరసరావుపేట టికెట్ చదలవాడకు ఇవ్వలేదని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆత్మహత్యాయత్నం

- చంద్రబాబు మాట తప్పారని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం మండిపాటు
- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఉండి మాజీ ఎమ్మెల్యే శివరామరాజు ప్రకటన
- విశాఖ జనసేనలో వర్గపోరు.. మేకపోతుతో వినూత్న నిరసన

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్/డోన్/కాళ్ల/దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ)/వెంకటగిరి రూరల్ (తిరుపతి జిల్లా)/శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)/దేవరపల్లి: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిలో ఆగ్రహజ్వాలలు ఎగసిపడుతున్నాయి. సీనియర్ నాయకులు తమకు టికెట్ రాలేదని మండిపడుతున్నారు. తమ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కార్యకర్తలూ నిరసనలకు దిగుతున్నారు. ఆత్మహత్యలకూ వెనుకాడబోమని అధినాయకత్వాలను హెచ్చరిస్తున్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా టీడీపీ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబును ప్రకటించడానికి టీడీపీ అధిష్టానం మీనమేషాలు లెక్కిస్తోందని నిరసిస్తూ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి విలేకరుల సమక్షంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నరసరావుపేట మండలం పాలపాడులోని తన స్వగ్రహంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన అధిష్టానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మధ్యే పార్టీలో చేరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అరవిందబాబుకు టికెట్ ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఇంకా పార్టీలో చేరని జంగా కృష్ణమూర్తి, మరో ఎన్ఆర్ఐకి టికెట్ ఇప్పించేందుకు ఆయన పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. బీసీ ద్రోహి శ్రీకృష్ణదేవరాయలు అని మండిపడ్డారు. అనంతరం పక్కనే ఉన్న పురుగుమందు డబ్బాను అందుకుని తాగారు. కార్యకర్తలు ఆయనను నరసరావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఇదంతా చదలవాడ ఆడిస్తున్న డ్రామా అని ప్రత్యర్థివర్గాలు ఆరోపిస్తున్నాయి.



మేకపోతుతో నిరసన తెలుపుతున్న సాధిక్ వర్గీయులు



నరసరావుపేట మండలం పాలపాడులో పురుగు మందు తాగుతున్న మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డిని అడ్డుకుంటున్న కార్యకర్తలు

బలిచ్చే మేకపోతు మాకొద్దు

విశాఖ దక్షిణ జనసేన టికెట్ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఇవ్వొద్దంటూ కార్పొరేటర్ సాధిక్ వర్గీయులు పట్టుబడుతున్నారు. దీంతో సాధిక్ కార్యాలయం వద్ద వంశీకృష్ణ శ్రీనివాస్, సాధిక్ వర్గీయులు బుధవారం బాహాబాహీకి దిగారు. పరస్పరం దాడులకు సిద్ధమయ్యారు. దీంతో సాధిక్, వీరమహిళలు నడిరోడ్డుపై ఆందోళనకు దిగారు. ''బలిచ్చే మేకపోతు మాకొద్దు'' అంటూ ఓ మేకను తీసుకొచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

కేఈ, కోట్లది చీకటి ఒప్పందం

కేఈ, కోట్ల కుటుంబాలు చీకటి ఒప్పందం కుదుర్చుకొని తాము మాత్రమే డోన్ రాజకీయాలను శాసించాలనే విధంగా ప్రవర్తిస్తున్నాయని టీడీపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి మండిపడ్డారు. నంద్యాల జిల్లా ప్యాపిలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల క్రితం కోట్ల, కేఈ కుటుంబాలు డోన్ టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటే తాను పార్టీని బతికించానని, రెండున్నరేళ్ల క్రితమే తనను అభ్యర్థిగా ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడు మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ మోసం చేసింది : శివరామరాజు

పశ్చిమగోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో బుధవారం జైన్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా టీడీపీకి సేవ చేస్తే తనను అధిష్టానం మోసం చేసిందని విమర్శించారు.

కష్టపడిన వారికి గుర్తింపు లేదు

టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికి టికెట్ ఇచ్చే పరిస్థితి లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ విమర్శించారు. తిరుపతిజిల్లా వెంకటగిరి పట్టణంలోని తనచారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ కోసం సేవ చేస్తే చివరకు టికెట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. మస్తాన్ యాదవ్ టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీకి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మద్దిపాటిని మార్చకుంటే బరిలోకి రెబల్

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజును మార్చకుంటే పార్టీలో తిరుగుబాటు తప్పదని కార్యకర్తలు హెచ్చరించారు. బుధవారం నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్ హాల్‌లో మద్దిపాటి వ్యతిరేకవర్గం సమావేశమైంది. మద్దిపాటిని మార్చకుంటే రెబల్ అభ్యర్థిని బరిలో దింపుతామని అల్టిమేటం జారీ చేశారు.


బొజ్జలకు మద్దతు లేదు

బొజ్జల సుధీర్‌రెడ్డికి తాము మద్దతివ్వలేదని మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య స్పష్టం చేశారు. ఎస్సీవీ నాయుడు స్వగృహంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తమను కలిశారని, అయితే మద్దతిస్తున్నట్టు ఆయనకు తాము చెప్పలేదని పేర్కొన్నారు. తానూ చంద్రబాబును కలిసి ఎమ్మెల్యే టికెట్ కోరతానని స్పష్టం చేశారు.

వలంటీర్ల వల్ల మంచే జరుగుతోందిగా

- వారి వల్ల సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయి
- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి: వలంటీర్ల వల్ల మంచే జరుగుతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. వారి వల్ల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువవుతున్నాయని తెలిపింది. వారి విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమని స్పష్టం చేసింది. వారి విషయంలో స్పందించాల్సింది ఎన్నికల సంఘమేనని తేల్చి చెప్పింది. వలంటీర్లు ఎన్నికల్లో విధుల్లో పాల్గొనకుండా ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేసింది. వలంటీర్ల నియామకం, తదితరాల వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు నెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 2.57 లక్షల మంది కార్యకర్తలను గ్రామ, వార్డు వలంటీర్లుగా నియమించారని, దీనిని చట్ట, రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటకు చెందిన షేక్ అబూబాకర్ సిద్దిఖీ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ, అధికార పార్టీకి చెందిన కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించారని, వారి ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని అధికార పార్టీ చూస్తోందని అన్నారు. రాష్ట్ర ఖజానా నుంచే వీరికి గౌరవ వేతనం చెల్లిస్తోందని తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, వలంటీర్ల వల్ల మంచే జరుగుతోంది కదా, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు కదా అని వ్యాఖ్యానించింది. వలంటీర్లు పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఉన్నం మురళీధరరావు కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది.



“ బలమైన మెదళ్లు... ఆలోచనల గురించి మాట్లాడుతాయి.
సాధారణ మెదళ్లు ... సంఘటనల గురించి మాట్లాడుతాయి.
బలహీనమైన మెదళ్లు... జనాల గురించి మాట్లాడుతాయి.
– సోక్రటీస్

సాక్షి

గురువారం, 21 మార్చి 2024

ఇది ఏకగ్రీవ సి‘ఫార్సు’

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని ఉన్నత స్థాయి కమిటీ ఊహించినట్టుగానే జమిలి ఎన్నికలకు జైకొట్టింది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో, ఆ తర్వాత వంద రోజుల్లో మునిసిపాలిటీలు, పంచాయతీల ఎన్నికలు జరపాలని ఏకగ్రీవంగా సిఫార్సు చేస్తూ, సదరు కమిటీ గత వారం నివేదిక సమర్పించింది. సిఫార్సులు ఊహించినవే అయినప్పటికీ, నిర్ణీత కాలవ్యవధి ఏమీ లేకపోయినా 2024 సార్వత్రిక ఎన్నికలకు కొద్దిగా ముందుగా కమిటీ ‘ఒకే దేశం – ఒకే ఎన్నిక’ (ఓఎన్‌ఓఈ) ప్రతిపాదనను తెర మీదకు తేవడం అనుమానాలు రేపింది. రాజ్యాంగ సవరణ, ఒకే ఎన్నికల జాబితా – ఎన్నికల గుర్తింపు కార్డు, త్రిశంకు సభ – అవిశ్వాస తీర్మాన పరిస్థితులు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు – పోలింగ్ సిబ్బంది – పోలీసు బలగాల ఏర్పాట్ల లాంటి పలు అంశాలపై కమిటీ కీలక సిఫార్సులు ఇప్పుడు చర్చ రేపుతున్నాయి. మన ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలనూ, సమాఖ్య చట్రాన్నే మార్చేసే సత్తా ఈ ప్రతిపాదనకు ఉండడమే అందుకు కారణం.

కోవింద్ సారథ్యంలో 2023 సెప్టెంబర్‌లో ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధురి కమిటీలో భాగం కావడానికి నిరాకరించారు. మొత్తం 8 మంది సభ్యుల కమిటీ 65 సమావేశాలు జరిపి, అనుకున్నట్టుగానే ప్రభుత్వ వైఖరికి అనుకూలంగా నివేదిక ఇచ్చింది. జాతీయ, రాష్ట్ర పార్టీల అభిప్రాయాల్ని తెలుసుకున్నామనీ, న్యాయకోవిదుల మొదలు ఆర్థికవేత్తల దాకా పలువురి సూచనలు కోరామనీ కమిటీ తెలిపింది. అయితే, నివేదికను గమనిస్తే అవసరమైన లోతైన అధ్యయనం, విశ్లేషణ సాగినట్టు తోచదు. అన్ని వర్గాలనూ ఈ అధ్యయన ప్రక్రియలో భాగం చేసినట్టు అనిపించదు. తూతూ మంత్రపు తతంగం చివరకు 21 సంపుటాల్లో, 18,626 పేజీల్లో, మొత్తం 11 అధ్యాయాలు, అనేక అనుబంధాల బృహన్నివేదిక రూపం మాత్రం సంతరించుకుంది. రాష్ట్రపతికి మార్చి 14న కమిటీ తన నివేదికను అందించడంతో ప్రధాన ఘట్టం ముగిసింది. త్వరలోనే లా కమిషన్ సైతం తన నివేదికను ఇవ్వనుంది. ఇక, వచ్చే 2029 ఎన్నికల్లోగా దాన్ని ఎలా ఆచరణలోకి తేవాలన్నది కేంద్రం చేతిలో ఉంది. కమిటీ ఏకగ్రీవ సిఫార్సు గనక అది ముగిసిన కథ అనకుండా, వ్యతిరేకిస్తున్న వారి సముచితమైన భయాందోళనల్ని విని, సమాధానపరచడం అవసరం.

నిజానికి, ఒకేసారి లోక్‌సభ, శాసనసభలకు ఎన్నికలు జరగడం కనివిని ఎరుగనిదేమీ కాదు. చట్టం ఏమీ లేకపోయినా స్వతంత్ర భారతావనిలో ఎన్నికలు మొదలయ్యాక తొలి రోజుల్లో ఏకకాలంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. అయితే, అయిదేళ్ళ కాలవ్యవధి పూర్తికాక ముందే రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసే ధోరణి మొదలయ్యాక, 1967 తర్వాత నుంచి ఈ ఏకకాల విధానానికి తెర పడింది. తరువాత కూడా మధ్య మధ్యలో ఈ జమిలి ఎన్నికల ఆలోచన తొంగిచూసినా, వడివడిగా అడుగులు పడింది మాత్రం ఇప్పుడే. మోదీ సారథ్యంలోని బీజేపీ ఆది నుంచి జమిలి ఎన్నికల నిర్వహణ జపం చేస్తోంది. అందుకు తగ్గట్టే ఇప్పుడు కోవింద్ కమిటీ జమిలి ఎన్నికలకు సిఫార్సు చేసింది. జమిలి ఎన్నికలను 15 పార్టీలు వ్యతిరేకించాయని కమిటీ పేర్కొంది కానీ, వ్యతిరేకిస్తున్నవారిని ఒప్పించడానికీ, సద్విమర్శలను తీసుకొని సరిదిద్దుకోవడానికీ చేసిందేమిటో తెలియదు. అలాగే, ఒకే దశలో ఎన్నికలు చేయలేక 7 విడతల్లో, 40 రోజులపైగా ఎన్నికలు జరుపుతున్న పాలకులు ఒకేసారి ఎన్నికలు ఎలా చేయగలరన్నదీ సందేహమే!

ఒకరకంగా, ‘ఒకే దేశం – ఒకే ఎన్నిక’ వల్ల అటు ప్రభుత్వానికీ, ఇటు పార్టీలకూ ఎన్నికల ఖర్చు తగ్గుతుందనే మాట నిజమే. అలాగే, కాస్తంత వ్యవధి తేడాతో మునిసిపల్, పంచాయతీ సహా అన్ని ఎన్నికలూ ఒకేసారి జరగడం వల్ల పాలనకు తరచూ అంతరాయాలు ఏర్పడవు. అయితే, ఈ విధానం మన సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందనేదీ అంతే వాస్తవం. ఇక, ఈ పద్ధతిలో రాష్ట్ర అసెంబ్లీలకు నిర్ణీత కాలవ్యవధి కన్నా ముందే మంగళం పాడి, ఆనక ప్రతి ప్రభుత్వానికీ నిర్ణీత వ్యవధిని నిర్ణయించడం ప్రజాస్వామ్య సిద్ధాంతాలకే విరుద్ధం. ఒకవేళ గనక ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా అర్ధంతరంగా కూలిపోతే, ఆ తర్వాత ఎన్నికైన ప్రభుత్వం ఆ వర్తమాన లోక్‌సభా కాలం ఉన్నంత వరకే అధికారంలో కొనసాగాలనడం మరో తిరకాసు. అన్నిటి కన్నా పెద్ద భయం మరొకటుంది. ఏకకాలంలో కేంద్ర, రాష్ట్రాల ఎన్నికల వల్ల ప్రాంతీయ, స్థానిక అంశాలను మింగేసి, జాతీయ అంశాలే పైకొచ్చే ప్రమాదం ఉంది. ఎన్నికల వ్యూహంలో, వ్యయంలో జాతీయ పార్టీలతో రాష్ట్ర స్థాయి పార్టీలు దీటుగా నిలబడడమూ కష్టమే. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు, ముఖ్యంగా చిన్న పార్టీలు కనిపించకుండా పోతాయని సమాజ్‌వాదీ పార్టీ లాంటివి బాహాటంగానే చెబుతున్నాయి.

నిజానికి, ఏకకాలపు ఎన్నికల వల్ల ఓటర్లలో 77 శాతం మంది కేంద్రంలో, రాష్ట్రంలో – రెండు చోట్లా ఒకే పార్టీకి ఓటేస్తారని 2015 నాటి ఓ సర్వే తేల్చింది. రెండు ఎన్నికల మధ్య ఆరు నెలల విరామం ఉంటే, 61 శాతమే అలా ఓటేస్తారట. అంటే ఒక రకంగా ఈ జమిలి ఎన్నిక కేంద్రంలో చక్రం తిప్పుతున్న పార్టీలకే వాటంగా మారవచ్చు. అసలు ‘ఒకే దేశం – ఒకే ఎన్నిక’ అనే ఈ ఆలోచన వెనుక అసలు మతలబు... దేశంలో అధ్యక్ష తరహా పాలన తీసుకు రావాలన్న బీజేపీ ఆలోచన అని మరికొందరి వాదన. అందుకు రాజ్యాంగ సవరణలు సహా అనేకం అవసరం. దానికి తగ్గట్టే దీర్ఘకాలిక వ్యూహంతో బీజేపీ 400 పైచిలుకు సీట్లతో సంపూర్ణ మెజారిటీని కోరుతోందని విశ్లేషణ. అవతలి వారివి ‘అనవసర భయాందోళనలు’ అని కొట్టిపారేస్తే సరిపోదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకొనే ముందు మరింత విస్తృత స్థాయి సంప్రతింపులు జరపడం అవసరం. అంతేకానీ, డబ్బు ఆదా పేరిట ప్రజాస్వామ్య స్ఫూర్తినీ, సమాఖ్య స్వభావాన్నీ నీరు గార్చడం సమర్థనీయం కానే కాదు.

నేపాల్‌లో అధికార క్రీడ

విశ్లేషణ



మంజీవ్ సింగ్ పురీ

ఏడాదిన్నర కూడా కాకముందే నేపాల్‌లో మూడో ప్రభుత్వం ఏర్పాటైంది. విచిత్రమైన కూటములు జట్టుకట్టాయి, విడిపోయాయి, మళ్లీ ఒక్కటయ్యాయి. ఇందులో భారత్ అనుకూల, అననుకూల పార్టీలూ ఉన్నాయి. మూడు ప్రభుత్వాలకూ సారథిగా ప్రచండ ఉండటం విశేషం. కోవిడ్ –19 మహమ్మారి తర్వాత నేపాలీ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. తిరిగి పుంజుకునే సంకేతాలు ఎంతమాత్రమూ కనబడటం లేదు. ఇది ప్రజల్లో నిరుత్సాహానికి దారి తీస్తోంది. గతంలో ఉన్న రాచరికమే మంచిదని కొందరు భావిస్తున్నారు. కొన్ని వారాల క్రితం, ఖాట్మండులో రాచరికం అనుకూల ప్రదర్శన కూడా జరిగింది. ప్రస్తుత కూటమి అమరిక వల్ల, ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ తిరిగి సాధారణ ఎన్నికలకు రంగం సిద్ధం అయినట్టుగా కనబడుతోంది.

నేపాల్‌లో కేవలం 15 నెలల్లోనే మూడవ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆసక్తికరంగా, ఈ మూడు ప్రభుత్వాలకూ పుష్పకమల్ దహల్ అలియాస్ ప్రచండ సారథ్యం వహించారు. 2022 నవంబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పార్టీ మావోయిస్ట్ సెంటర్ 30 స్థానాలతో ప్రతినిధుల సభలో మూడవ స్థానంలో నిలిచింది. 275 మంది సభ్యుల సభలో 88 స్థానాలతో నేపాలీ కాంగ్రెస్ మొదటి స్థానంలో, 78 స్థానాలతో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్- లెనినిస్ట్) లేదా సీపీఎన్-యూఎమ్‌ఎల్ రెండవ స్థానంలో నిలిచాయి. చీలిపోయిన ప్రజా తీర్పు ముఖ్యమైన స్థానాన్ని ప్రచండ పొందేలా అనుమతించింది.

మొదటిదే అయినప్పటికీ స్వల్పకాలంలోనే ముగిసిన కూటమి సీపీఎన్-యూఎమ్‌ఎల్, మావోయిస్టులకూ మధ్య ఏర్పడినది. ప్రచండకు ప్రధానమంత్రి పదవిని అందించిన తర్వాత, ఆయన నేపాలీ కాంగ్రెస్ వైపునకు మళ్లడంతో ఒక నెలలోనే ఆ కూటమి విచ్ఛిన్నమైంది. చిత్రంగా, అదే ప్రచండనీ, అదే సీపీఎన్-యూఎమ్‌ఎల్‌నీ మళ్లీ ఒకచోట చేర్చిన ప్రస్తుత కూటమిలో, మరో రెండు వామపక్ష అనుకూల పార్టీలు కూడా ఉన్నాయి. ఉపేంద్ర యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌బాదీలు (సోషలిస్టులు), మాజీ ప్రధాని మాధవ్ కుమార్ నేపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మాజీ సీపీఎన్-యూఎమ్‌ఎల్ సభ్యుల పార్టీ ప్రస్తుత ప్రభుత్వానికి మద్దతునిస్తున్నాయి.

ఈ కూటమిలోనే రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పీ) ఉండటం కొందరికి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ పార్టీకి 21 సీట్లున్నాయి. యువత ఆకాంక్షలను సమర్థించే, పశ్చిమ దేశాలకు అనుకూలంగా ఉండే ఒక వేదికగా ఈ పార్టీని చెప్పుకోవచ్చు. ఈ పార్టీ గతంలో మొదటి మావోయిస్టు... సీపీఎన్-యూఎమ్‌ఎల్ కూటమిలో భాగంగా ఉండేది. అంతకుముందు అమెరికన్ జాతీయుడైన రవీ లామిఛానే దాని నాయకుడు. ప్రస్తుత సంకీర్ణంలోని నలుగురు ఉప ప్రధాన మంత్రులలో ఆయన ఒకరుగా ఉన్నారు.

కోవిడ్ -19 మహమ్మారి కాలంలో నేపాలీ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. కానీ ఇతర దేశాల మాదిరిగా, తిరిగి పుంజుకునే సంకేతాలు ఎంతమాత్రమూ కనబడటం లేదు. ఇది ప్రజల్లో నిరుత్సాహానికి దారి తీస్తోంది. రాజకీయ వర్గం ఫలితాలు చూపని కారణంగా కొంతమంది గతంలో ఉన్న రాచరికమే మంచిదని కూడా భావిస్తున్నారు. కొన్ని వారాల క్రితం, రాజధాని నగరం ఖాట్మండులో రాచరికం అనుకూల ప్రదర్శన కూడా జరిగింది.

ఆర్థిక సమస్యలపై నేపాలీ కాంగ్రెస్ చాలా మొండితనంతో ఉందని ప్రచండ ఆరోపించారు. ఆ కారణంగా రాజకీయంగా తన మార్పును సమర్థించుకున్నారు. అయితే, ఐదుసార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన నేపాలీ కాంగ్రెస్ నాయకుడు షేర్ బహదూర్ దేవుబా నిరంతరం వేచివున్న ప్రధానమంత్రి స్థానంలో పరిభ్రమించడం ప్రచండ నిజంగానే భరించలేకపోయి ఉంటారు.



ప్రచండ



కేపీ శర్మ ఓలి



షేర్ బహదూర్ దేవుబా

కానీ సాంప్రదాయకంగా నేపాలీ కాంగ్రెస్‌తో వ్యవహరించడం సులభతరమని భారతదేశం గ్రహించింది. నేపాల్‌ను హిందూ రాజ్యంగా పునఃస్థాపించాలనే నేపాలీ కాంగ్రెస్ నాయకత్వానికి మావోయిస్టు-నేపాలీ కాంగ్రెస్ కూటమి కొంత ఓదార్పునిచ్చింది. 2015 రాజ్యాంగం నేపాల్‌ను లౌకిక దేశంగా ప్రకటించింది. అయితే, సీపీఎన్-యూఎమ్‌ఎల్ నాయకుడు అయిన కేపీ శర్మ ఓలి గతంలో కూడా హిందూ రాజ్యం పట్ల గానీ, నేపాల్‌లో ‘సాంస్కృతిక’ రాచరికం పట్ల గానీ విముఖంగా లేరని గమనించాలి. అయోధ్యలో రామ మందిర శంకుస్థాపనను నేపాల్ ఉత్సాహంతో స్వీకరించింది. ఇది హిందూ రాజ్యానికి మద్దతును పెంచుతుంది.

ప్రచండ కూడా సానుకూల పాత్రను పోషిస్తున్నట్లు కనిపిస్తున్నారు. సంవత్సరాల తరబడి తాను విడిచిపెట్టేసినటువంటి, హిందూ రాచరికంతో గుర్తింపు పొందిన నేపాలీ అధికారిక జాతీయ దుస్తులైన దౌరా సురూవాల్‌ను ధరించారు. ఏమైనప్పటికీ, ప్రచండ పెంపకం వామపక్షంతో కూడుకున్నది. అది రాచరికానికి వ్యతిరేకమైనది. ఆయనకు ఇప్పుడు తనను తాను వెనక్కి తిప్పుకొనే, నేపాల్ గుర్తింపు రాజకీయాలను తిరిగి అక్కున చేర్చుకునే అవకాశం వచ్చింది. అంటే ప్రాథమికంగా భారతదేశం నుండి తనను తాను భిన్నంగా చూపుకోవడం. అందుకే ఆయన నేపాలీ కాంగ్రెస్‌తో విడిపోయినప్పుడు దానిని ‘ప్రతీఘాత శక్తి’ అని పేర్కొన్నారు.

నేపాల్‌లోని రాజకీయ చర్చల్లో దక్షిణ (భారతదేశానికి సూక్ష్మ నామం), ఉత్తర (చైనా సూక్ష్మ నామం) పాత్రలకు సంబంధించిన సూచనలు సర్వ సాధారణం. సుమారు గత రెండు దశాబ్దాలుగా పశ్చిమ దేశాలనూ (అమెరికా, యూరోపియన్ యూనియన్ మొదలైనవి), చర్చ్‌తో కూడుకున్న వారి ఎన్జీఓ భాగస్వాముల పాత్రనూ కూడా కొట్టిపారేయలేము. ఇవి మానవ హక్కులు, లౌకిక వాద ఆలోచనలను కలిగి ఉండి, తమవైన డైనమిక్స్‌ను కలిగి ఉన్నాయి. కొందరికి వామపక్ష కూటమిలో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ చేరిక ఉత్తరాది- పాశ్చాత్య కూటమి మధ్య సఖ్యతలా కనిపిస్తుంది.

చాలా మంది పరిశీలకులకు, తాజా అమరిక నేపాల్‌లో తదుపరి సాధారణ ఎన్నికలకు రంగం సిద్ధం చేసినట్టుగా కనబడుతోంది. కాకపోతే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉంది. అంత కాలం అవసరమైన ఓపికను ఓలీ ప్రదర్శిస్తారా అని చాలామంది అనుమానిస్తున్నారు. 2020లో, అధికార భాగస్వామ్య ఒప్పందం ఉన్నప్పటికీ ప్రచండకు ప్రధానమంత్రి పదవిని వదులుకోవడానికి ఆయన ఇష్టపడలేదు. ప్రచండ ఇప్పటికే ప్రజల్లో తన పట్టును కోల్పోయినందున, తన పాత కమ్యూనిస్ట్ సహచరులతో చేతులు కలపడమే ఏకైక మార్గం. సీపీఎన్-యూఎమ్‌ఎల్ మద్దతుదారుల నుండి మావోయిస్టులకు ఓటు బదిలీ అంత సులభం కానప్పటికీ, నేపాలీ కాంగ్రెస్ నుండి మావోయిస్టులకు బదిలీ చేయడం ఇంకా కఠినమైనది. కొత్త అమరిక చైనీయులు సంతోషించడానికి ఒక కారణాన్నిస్తుంది. అంతర్గత నేపాలీ రాజకీయ కోణం కూడా ఉన్నప్పటికీ, దాన్ని తీసుకురావడంలో వారి పాత్ర ఉంది.

భారతదేశం ఇప్పటివరకూ నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య, ఆర్థిక భాగస్వామి. పైగా దేశంలో ఆర్థిక తేజస్సుకు గేట్‌వే. నేపాల్‌కు దాని పెరుగుతున్న జలవిద్యుత్ ఉత్పత్తి అవసరాల నుండి ప్రయోజనాలను పొందేందుకు ఇది ఏకైక అర్థవంతమైన మార్గం. ఇటీవలి సంవత్సరాలలో సమీకృత చెక్ పోస్టుల నిర్మాణం, రైల్వే కనెక్టివిటీ అభివృద్ధి, విద్యుత్ సరఫరా లైన్‌లు, యూపీఐ లావాదేవీలకు వెళ్లడం వంటి వాటితో నేపాల్ కనెక్టివిటీకి భారత్ ఊతమిచ్చింది. వాస్తవానికి, నేపాల్‌కు చమురు సరఫరా చేయడానికి ఏర్పాటయ్యే పైప్‌లైన్, 900 మెగా వాట్ల అరుణ్-3 ప్రాజెక్ట్ నిర్మాణంతో సహా చాలా ప్రాజెక్టులు ఓలీ 2018-19లో ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించారు.

నేపాల్‌లో, ఇండియా కార్డ్‌ను ప్లే చేయడం వల్ల అది ప్రజల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థ చాలా ముఖ్యమైనది. అనారోగ్యకరమైన ఆర్థిక స్థితి ఏ ప్రస్తుత ప్రధానమంత్రికీ మంచిది కాదు. సులభతరమైన వ్యాపారాన్ని మెరుగుపరచడం కోసం తీసుకునే చర్యలు భారతదేశం, నేపాల్ రెండింటి ప్రయోజనాలకు ఉపయోగపడుతాయి.

వ్యాసకర్త నేపాల్‌లో భారత మాజీ రాయబారి
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఇంకానా?



వీసా అప్లికేషన్ అనేది అత్యంత అమానవీయమైన, విసుగుపుట్టించే ప్రక్రియ. ఇండియా లాంటి దేశాలవారిపై వివక్షాపూరితంగా ఉంటున్నాయి. ఎలాగైనా మీ దేశాల్లో స్థిరపడటానికి జనాలు పడిచచ్చే రోజులు పోయాయి. మేము ప్రయాణిస్తాం, పని చేస్తాం, సెలవులు గడుపుతాం, డబ్బులు ఖర్చు చేస్తాం. మీ దేశపు ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేస్తాం. అయినా సరే మీరు మమ్మల్ని చూస్తున్న విధానం మీ దేశం ఎంత దారుణంగా ఉందో చూపుతోంది.

– హన్సల్ మెహతా, దర్శకుడు

గొప్ప క్షణం



ఆయన (విరాట్ కోహ్లి) వల్లే క్రికెట్ చూడటం మొదలుపెట్టాను. ఆయనలా కావాలని కలలు కంటూ పెరిగాను. రాత్రి నా జీవితంలో గొప్ప క్షణం. ‘హాయ్ శ్రేయాంకా! బౌలింగ్ బాగా చేశావు’ అన్నారు. ఆయనకు నిజంగా నా పేరు తెలుసు!

– శ్రేయాంకా పాటిల్, క్రికెటర్

ఇప్పుడేమంటారో?



కార్నెల్‌లో (యూనివర్సిటీ) 1985లో నేను సీనియర్‌గా ఉన్నప్పుడు రోడ్స్ స్కాలర్‌షిప్ కోసం అప్లై చేశాను. ‘ఏఐ(కృత్రిమ మేధ)ని ఒక వినోదాత్మక కాల్పనిక పాత్రగా సృష్టిద్దామనుకుంటున్నా’నని చెప్పాను. నన్ను ఇంటర్వ్యూ చేసిన హ్యూమానిటీస్ ప్రొఫెసర్ల స్తబ్ధత నాకు ఇంకా గుర్తుంది. వాళ్లకు ఆ ఆలోచన నచ్చనే లేదు.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

శుభాకాంక్షలు



ప్రపంచ వ్యాప్తంగా నౌరోజ్ (పార్సీల నూతన సంవత్సరం) జరుపుకొంటున్న అందరికీ హార్దిక శుభాకాంక్షలు. మీకు ఏడాది పొడవునా సమృద్ధిగా చిగిర్చే వసంతాలు, శాంతి, భద్రత కలగాలి.

– షేక్ మొహమ్మద్, దుబాయ్ పాలకుడు

దేవుడా!



నీకున్న ఏకైక సోదరుడు ఫోన్ చేసి, ‘నా శరీరాన్ని బాగు చేయడానికి నాకు చేయాల్సిన అన్ని చికిత్సలు చేశామని డాక్టర్లు చెప్పారు. ఇంక చేయడానికేమీ లేదు. నాకు ఈ భూమ్మీద ఇంక మూడు నెలలే ఉంది’ అని చెబితే నిజంగా ఏం చెప్పాలో తెలీదు.

– మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

వైజ్ఞానిక వేగుచుక్కలు

వైద్య విద్యలో వివక్ష

ఆధునిక భారతదేశంలో వైద్య శాస్త్రంతోపాటు అన్ని విజ్ఞాన శాస్త్రాలు ఎలా వికసించాయో అధ్యయనం చేయాలంటే నేపథ్యంగా సంభవించిన కీలక సంఘటనలను సూక్ష్మంగా పరిశీలించాలి. అప్పట్లో బ్రిటిష్ పాలనలో భారతదేశం ఉంది కనుక, అక్కడి చారిత్రక వాతావరణం, వారి విధానాలు మన దేశాన్ని కూడా ప్రభావితం చేశాయి. తొలుత వైద్యానికి సంబంధించి ఆ సమాజం ఎలా ఉందో, ఎలా ప్రతిస్పందించిందో చూడాలి.



మద్రాసు మెడికల్ కళాశాల

1869లో ఎడిన్‌బరో యూనివర్సిటీ మెడికల్ స్కూల్‌కు ఐదుగురు మహిళలు తొలిసారి ప్రవేశం కోసం దరఖాస్తు చేశారు. వారే సోఫియా జెక్స్ బ్లాక్, ఎడిత్ పెచాయ్, మెటిల్డా చాప్లిన్, హెలెన్ ఎవాన్స్, ఇసబెల్ థోర్న్. పురుష విద్యార్థుల కన్నా రెట్టింపు రుసుం విద్యార్థినులు చెల్లించి ప్రవేశం పొందారు. ఈ ఐదుగురిలో ఎడిత్ పెచాయ్ రసాయన శాస్త్రంలో అత్యంత ప్రతిభ కనబరిచి హోప్ స్కాలర్‌షిప్ పొందే స్థాయి గడించారు. ఎడిన్‌బరో విశ్వవిద్యాలయం మెడికల్ స్కూల్లో స్త్రీలు, యువతులు ప్రవేశం పొందడమే చట్ట విరుద్ధం అని అప్పట్లో పత్రికలూ వాదించాయి. ఫలితంగా ఉత్తమంగా ప్రతిభ కనపరిచిన మహిళా విద్యార్థికి కాకుండా రెండవ స్థానంలో నిలిచిన పురుష విద్యార్థికి ఆ హోప్ స్కాలర్‌షిప్ బహూకరించారు. ఆ ఐదుగురు తొలి మహిళా విద్యార్థులు దీనికి నిరసనగా ఐర్లాండ్, బెర్న్, డబ్లిన్, స్విట్జర్లాండ్ విశ్వవిద్యాలయాలకు వెళ్లి అక్కడ వైద్య పట్టాలు పొందారు.

ఈ సంఘటన తర్వాత 1874లో డా॥ ఎలిజబెత్ గ్యారెట్ ఆండర్సన్ చొరవ తీసుకొని ‘లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమెన్’ ప్రారంభించారు. ఫలితంగా వైద్య శాస్త్రం అభ్యసించడానికి, పిమ్మట ప్రాక్టీస్ ప్రారంభించడానికి తగిన అవకాశాలు ఇంగ్లాండ్ మహిళలకు లభించడం మొదలైంది. అయితే వారి చదువు పూర్తయిన తర్వాత ఆసుపత్రుల్లో కీలక స్థానాలు కాకుండా చిన్న చిన్న హెల్త్ సెంటర్లలో లేదా సబార్డినేట్ ఆసుపత్రుల్లో మాత్రమే వారికి ఉద్యోగావకాశాలుండేవి. ఆ రకంగా ప్రొఫెషనల్‌గా కూడా మహిళా వైద్యులు పురుష ప్రపంచం కారణంగా తీవ్ర వివక్షకు, దోపిడీకి గురయ్యారు.

బ్రిటన్‌లో పురుషులే వైద్యం చేయాలనే అంధ సంప్రదాయముంటే; వారి వలస దేశమైన ఇండియాలో మహిళా రోగి (మగ) డాక్టర్ కంట పడకూడదనే అర్థం లేని పరదా ఆచారం రూపంలో బలపడి ఉంది. చావడానికైనా సిద్ధమే కానీ ఘోషా తీసి తమ రోగం నయం చేసుకోవడానికి ఆనాటి మన సమాజపు మహిళలు సుముఖంగా లేరు. కాన్పు సమయంలో స్త్రీలు బతికి బట్ట కట్టడం అనేది మరుజన్మ వంటిదనడానికి ఇదే కారణం! మన దేశంలోని అధ్వాన్నమైన ఆరోగ్య పరిస్థితులూ, ఎక్కువ సంఖ్యలో పసికందుల మరణాలూ ఆనాటి బ్రిటిష్ పాలకులకు ఆందోళన కలిగించాయి.

ఈ నేపథ్యంలో లక్నోకు 100 మైళ్ళ దూరంలో ఉండే ‘పన్నా’ సంస్థానపు రాణి అనారోగ్యం కారణంగా రాజు తీసుకున్న నిర్ణయమూ, ఆయన రాణి చేసిన చొరవల కారణంగా భారతదేశంలో వైద్య వసతులు పెరిగాయి. అందువల్లనే 1835లో వైద్య విద్యా సంస్థ ‘మద్రాస్ మెడికల్ కాలేజ్’ ఏర్పడింది. అయితే ఇది సంభవించడానికి ముందు మరెన్నో కీలకమైన మలుపులు కూడా ఉన్నాయి.

– డా॥ నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

‘పొత్తు’గడలతో ఓట్లు రాలేనా?

అభిప్రాయం



డా॥ జి. నవీన్

కేవలం రాజకీయ ఎత్తుగడలతోనే 40 ఏళ్ల కెరీర్‌ను గడిపిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు పొత్తులను, చిలక పలుకులను ఆశ్రయించారు. తన వందిమాగధులయిన బాకా మీడియా సంస్థలు విశ్వసనీయతను కోల్పోయిన విషయాన్ని గమనించినట్టున్నారు. అందుకే ఇప్పుడు కొత్తగా పేరెన్నికగన్న ప్రశాంత్ కిషోర్ ద్వారా దుష్ప్రచారానికి తెర లేపారు.

ప్రశాంత్ కిషోర్ లాంటి ఎన్నికల వ్యూహకర్తలు పుట్టక మునుపు నుంచి ప్రజల నాడి తెలిసిన జన నేతలు ఎన్నికలు గెలుస్తున్నారు. 1994లో ఎన్టీఆర్, అదే విధంగా 2004లో వైఎస్సార్ విజయదుందుభి మోగించింది స్వబలం ఆధారంగానే. క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రశాంత్ కిషోర్ చేపట్టిన వ్యూహకర్త కార్యక్రమాలు అప్పటికే గెలుపు గుర్రాలయినవారికి ఉపయోగపడ్డాయి తప్ప ఈయనవల్ల, ఓడిపోయే నాయకులు గెలుపు చేజిక్కించుకొన్న సందర్భం అయితే లేదు. ఇంతటి ప్రశాంత్ కిషోర్ ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కి వ్యూహరచన చేపట్టి బొక్కబోర్లా పడిన సందర్భం మరిచిపోరాదు.

పొత్తుల విషయానికి వస్తే చంద్రబాబు చరిత్ర చర్వితచర్వణమే. 1999 నుంచి చూస్తే ఆయన పోటీ చేసిన అయిదు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో గెలిచింది రెండు మాత్రమే. ఆ రెండింటిలో కూడా పొత్తులే ఆయన్ని గట్టెక్కించాయి. 1999లో కార్గిల్ యుద్ధ నేపథ్యంలో బీజేపీ ఖాతాలోని దేశభక్తి ఓటు ఈయనకి ఉపయోగపడితే, 2014లో మోదీ గాలి, పవన్ కల్యాణ్ నటనా శౌర్యం తోడై విడిపోయిన రాష్ట్రానికి పండిపోయిన అనుభవజ్ఞుడు అవసరమనే తప్పుడు వాదనను ముందుకు తెచ్చి గద్దెనెక్కారు. పొత్తు లేకుండా ఆయన పోటీ చేసిన ఎన్నికలు కేవలం 2019 మాత్రమే. ఈ 25 ఏళ్ల ఘన చరిత్ర మనకు చెబుతున్న పాఠం ఏమిటంటే... పొత్తులు అన్ని వేళలా పని చేయవు. కాలం గడిచే కొద్దీ స్వప్రయోజనాలకోసం ఇష్టానుసారం భిన్న ధ్రువాలలాంటి శక్తులతో చేతులు కలుపుతూ పోతే రెంటికి చెడ్డ రేవడి కావడం తథ్యం.

బీజేపీని అలౌకిక పార్టీగా తూర్పార బట్టి అయిదు ఏళ్ళు కూడా నిండక మునుపే మళ్లీ దానితోనే పొత్తుపెట్టుకున్నారు. అయితే మునుపటి (1999, 2014) ఫలితాలు మళ్ళీ సాధిస్తారా అనేది ప్రశ్న. ఈ సారి వీరి ప్రయాణం నల్లేరు మీద బండి నడక కాదనే చెప్పాలి. ఎందుకంటే గతానికీ, ఇప్పటికీ తేడా ఏమంటే ఇప్పుడు టీడీపీ – జనసేన – బీజేపీ త్రయం, ఒక పూర్తి కాలం పనిచేసి జనాదరణ పొందిన జగన్ ప్రభుత్వాన్ని ఎదుర్కొంటుంది. ఇదే పరిస్థితి 2009లో చంద్రబాబుకి వచ్చింది. అప్పటి వైఎస్సార్ పార్టీ ప్రభుత్వం సంక్షేమం ద్వారా ప్రజల్లో బలంగా పాతుకుపోయింది. అందుకే చంద్రబాబు మహాకూటమి ఏమీ చేయలేకపోయింది. అయితే కొంతమంది దీనికి ‘ప్రజారాజ్యం’ పార్టీ కారణం అని అనుకున్నా నిజానికి చిరంజీవికి పడిన ఓటు కోస్తా జిల్లాల్లోని పీడిత వర్గాల ఓటు. తాము ఇలవేలుపుగా భావించే రంగా హత్యానంతరం సాంప్రదాయకంగా టీడీపీని వ్యతిరేకిస్తూ వచ్చిన కాపు ఓటు. అది దృష్టిలో పెట్టుకొనే చంద్రబాబు 2014 కల్లా పవన్ కల్యాణ్ అంటే పెనుప్రేమ చూపించే కాపు వర్గాన్ని బుట్టలో వేసుకోడానికి జనసేనను అక్కున చేర్చుకున్నారు. తద్వారా ఒక అసహజ పొత్తుకు ప్రాణం పోశారు.



‘సిద్ధం’ సభల్లో జనసందోహం

2014 ఎన్నికల అనంతరం పవన్ కల్యాణ్ తనను నమ్ముకున్న వర్గాలకు కాని, వ్యక్తులకు కాని ఏ మాత్రం సాయపడలేకపోయారు. ఇటు రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం ద్వారా కానీ, అటు కేంద్ర ప్రభుత్వం ద్వారా కానీ రాష్ట్రానికి ఒక్క మేలు కూడా చేయలేకపోయారు పవన్ కల్యాణ్. పైపెచ్చు ఆయనే బీజేపీ మన రాష్ట్రానికి ‘పాచి పోయిన లడ్డూలు’ ఇచ్చింది అని 2019 ఎన్నికలకు ముందు కోడై కూశారు. అలాంటిది మళ్ళీ ఏ విధంగా ఇప్పుడు ఈ త్రయం ఒకటిగా సభలు నిర్వహిస్తారో వారికే తెలియాలి.


ఒకవైపు నేరుగా నగదు బదిలీతో జగన్ పేదలకు వినూత్న సాయం అందజేసి దానిని పెట్టుబడిగా భావిస్తుంటే... ఓటు బదిలీని పెట్టుబడిగా పరిగణిస్తూ టీడీపీ – బీజేపీ – జనసేన త్రయం ఇప్పుడు బరిలోకి దిగుతున్నది. 2019లో జనసేన... బీఎస్పీ, కమ్యూనిస్ట్ పార్టీలతో పొత్తు పెట్టుకొని పోటీ చేసి సుమారు 5–6 శాతం ఓటు దక్కించుకున్నది. బీజేపీ అయితే సొంతంగా పోటీ చేసి ‘నోటా’ కంటే తక్కువ ఓటు శాతాన్ని తెచ్చుకొంది. దీనిని కొలమానంగా తీసుకొంటే టీడీపీకి పడిన 39 శాతానికి వీరి ఓట్లు జత అయినా కూడా జగన్ దరిదాపులకు చేరలేరు.

స్థూలంగా విషయమేమిటంటే పొత్తుల జిత్తులూ, వ్యూహకర్తల విషపు పలుకులూ ప్రజలను ఏమార్చబోవు.

వ్యాసకర్త సామాజిక ఆర్థికాంశాల విశ్లేషకుడు (యూఎస్‌ఏ)

మౌనం సర్వార్థ సాధకం

మౌనం అంటే ఏమిటి? ఏమీ మాట్లాడకుండా ఉంటే మౌనమైపోతుందా? బయటకి పెదవులు కదపకుండా, లోపల మనసుతో మనం మాట్లాడుతూనే ఉంటాము. అది నిజమైన మౌనం కాదు. కాని, బాహ్య మైన మౌనం కూడా అవసరమే. తమ మాటకి విలువ లేనపుడు మనిషి మౌనం వహించటమే మంచిది. మాట, మౌనం రెండూ మనిషికి ముఖ్యమైనవే. మనిషిని ఉన్నతంగా నిలిపేవే. తక్కువ మాట్లాడు, ఎక్కువ పని చేయి అన్నది ఒక లోకోక్తి.



జ్యోతిర్మయం

ఎక్కడ తక్కువ మాట్లాడాలి అన్నది కూడా అవసరమే! గురువు, పెద్దల దగ్గర ఎక్కువ మాట్లాడకూడదు. వారందించే జ్ఞాన సంపదను మౌనంగా గ్రహించాలి. మౌనం మనని మనకు దగ్గర చేస్తుంది. రోజూ నియమంగా కొంత సమయం మౌనంగా ఉండటం అలవాటు చేసుకుంటే మానసిక ఆనందం, దేహారోగ్యం, ఆలోచనలపై నియంత్రణ సిద్ధిస్తాయి. మౌనం ఒక తపస్సు. ఆధ్యాత్మిక సాధనలో మౌనానికే ప్రాధాన్యత.

ఒక్కొక్కసారి మాటలలో చెప్పలేని అభిప్రాయం మౌనం బాగా వ్యక్తం చేస్తుంది. సీతారాముల వనవాస సమయంలో దండకారణ్యంలో, భర్తను దైవంగా భావించే ఋషుల సతులు తమ మహిమతో వారి భర్తలకు శ్రీరాముని రూపాన్నిచ్చి, వీరిలో నీ అసలు రాముడెవరో తెలుపమన్నారు. సీతమ్మ మౌనంగా చూస్తూ ఉండిపోయింది. వారు ఒక్కో రాముని ఆమె ముందు నిలబెట్టి ఇతడేనా అని అడుగుతుంటే సీతమ్మ తల అడ్డంగా తిప్పేది. చివరకు అసలు రాముని నిలబెట్టగా ఆమె చిరునవ్వుతో తల వంచుకుని మౌనం వహించింది. అక్కడ సీతా దేవి మౌనమే పూర్తి సమాధానం.

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మెహెర్ బాబా తన ఆధ్యాత్మిక ప్రయాణంలో నలభై నాలుగు సంవత్సరాలు మౌన దీక్షలో ఉన్నారు. బయటకు మౌనంగా ఉండటమే కాక లోపల కూడా నిశ్శబ్దంగా ఉండాలి. ఆ మౌనం మనసు పొరల దాకా చేరుకోవాలి. ఆలోచనలను మనసు నుండి పూర్తిగా పరిహరించటం ద్వారా దీన్ని సాధించవచ్చు. ఎలాంటి కదలిక లేని నిశ్చల స్థితి మనో మౌనం. ఇది చాలా గొప్పది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.ద్వాదశి తె.5.25 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఆశ్లేష రా.2.22 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.2.16 నుండి 4.00 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.07 నుండి 10.55 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృత ఘడియలు:** రా.12.45 నుండి 2.26 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.08, **సూర్యాస్తమయం:** 6.06.

క్లుప్తంగా...

కనుల పండువగా శ్రీవారి తెప్పోత్సవం

- తొలిరోజు తెప్పపై శ్రీసీతారామలక్ష్మణుల విహారం



తిరుమల పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తున్న స్వామివారు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు బుధవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీసీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరిగింది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. తొలిరోజు శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి వారు పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు తిరిగి కనువిందు చేశారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం కన్నుమూత



కేవీ రత్నం(ఫైల్)

నెల్లూరు (టౌన్): రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం(83) నెల్లూరులోని హరనాథపురంలోని నివాసంలో బుధవారం తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. రత్నం విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా ఆయన తీర్చిదిద్దారు. రత్నం విద్యాసంస్థల్లో చదివిన పలువురు దేశవ్యాప్తంగా పలు రంగాల్లో సేవలు అందిస్తున్నారు.

16 నుంచి 'ఒంటిమిట్ట'లో బ్రహ్మోత్సవాలు

- 22న శ్రీసీతారాముల కల్యాణం
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో

తిరుపతి(అలిపిరి): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 16 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 16న అంకురార్పణ, 17న శ్రీరామనవమి నాడు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయని చెప్పారు. 22న జరిగే సీతారాముల కల్యాణం ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. ఇందు కోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో కూల్ పెయింట్, చలువ పందిళ్లు నిర్మించాలని ఆదేశించారు. ఊరేగింపునకు వినియోగించే వాహనాలు, రథానికి మరమ్మతులు చేయించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. సీతారాముల తలంబ్రాల ప్యాకింగ్‌కు 300 మంది, కల్యాణం రోజున భక్తులకు అన్నప్రసాదాలు, తలంబ్రాల పంపిణీకి సుమారు రెండు వేల మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేయాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రణాళికలను తయారు చేయాలని చెప్పారు. సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదు

- గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్

సాక్షి, అమరావతి: చంద్రబాబు పుక్కిట హామీలను, మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఏపీ గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. టీడీపీ ఎన్ని డ్రామాలు చేసినా గిరిజనులంతా సీఎం వైఎస్ జగన్‌తోనే ఉన్నారని తెలిపారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. తనపై తనకే నమ్మకం లేక బీజేపీ, జనసేతో పొత్తు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల్లో 800కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి, ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్న విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని తెలిపారు. సీఎం జగన్ తలపెట్టిన బస్సుయాత్ర విజయవంతానికి గిరిజనులంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

అరటిలో ఏపీ మేటి

- నాలుగేళ్లలో 1.80 లక్షల టన్నుల ఎగుమతి
- ఈ ఏడాది లక్ష టన్నుల లక్ష్యం.. ఇప్పటికే 50 వేల టన్నులు పూర్తి
- టీడీపీ హయాంలో కేవలం 23వేల టన్నులు ఎగుమతి
- జగన్ సర్కారులో విప్లవాత్మక మార్పులు
- 2019-20 నుంచి ఊపందుకున్న ఎగుమతులు
- అరటి కనీస మద్దతు ధర క్వింటా రూ.800
- ప్రస్తుతం రూ.1,450 నుంచి రూ.1950 మధ్య పలుకుతున్న ధర



సాక్షి, అమరావతి: ఆంధ్ర అరటికి ప్రపంచ దేశాల్లో డిమాండ్ పెరుగుతోంది. గ్రోత్ ఇంజన్ క్రాప్స్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన అరటి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా సాగులోనే కాదు.. ఉత్పత్తి, ఉత్పాదకత, ఎగుమతుల్లో కూడా అద్భుత ప్రగతిని సాధించింది. గడిచిన నాలుగేళ్లలో 1.80 లక్షల టన్నులు ఎగుమతి కాగా, ఈ ఏడాది లక్ష టన్నుల్ని ఎగుమతి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే 50 వేల టన్నులు ఎగుమతి అయ్యాయి. మరోవైపు.. మిడిల్ ఈస్ట్ దేశాలకే ఇప్పటివరకు ఎగుమతయ్యే అరటి ఈసారి మొట్టమొదటిసారిగా రష్యాకు కూడా ఎగుమతి అయ్యింది. ఇకపోతే అరటికి కనీస మద్దతు ధర క్వింటా రూ.800 కాగా, ప్రస్తుతం రూ.1,450 నుంచి రూ.1,950 మధ్య పలుకుతోంది.

రికార్డు స్థాయిలో దిగుబడులు..

విదేశాల్లో డిమాండ్ ఉన్న ఎరువు, కర్పూర, చక్కరకేళి, అమృతపాణి, బుడిద చక్కరకేళి, తేళ్ల చక్కరకేళి, సుగంధాలు, రస్తాలి వంటి రకాలు ఏపీలోనే సాగవుతున్నాయి. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పండే గ్రాండ్ నైన్ (జీ-9 పొట్టి పచ్చ అరటి రకం), టిష్యూ కల్చర్ రకాలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో 2018-19 నాటికి 1.90 లక్షల ఎకరాల్లో సాగవుతూ 50 లక్షల టన్నుల దిగుబడులు వచ్చే అరటి సాగు ప్రస్తుతం 2.65 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. టిష్యూ కల్చర్ ప్లాంట్ మెటీరియల్, ఫ్రూట్ కేర్ కార్యకలాపాలు, బిందు సేద్యం వంటి అధునాతన సాంకేతిక పద్ధతుల వలన ఉత్పాదకత హెక్టార్‌కు 60 టన్నులకు పైగా వస్తోంది. ప్రతికూల పరిస్థితుల్లో సైతం 2023-24లో 62 లక్షల టన్నుల దిగుబడులు వస్తున్నాయని అంచనా వేశారు.

ఫలించిన సీడీపీ ప్రాజెక్టు..

ఇక రాష్ట్రంలో అరటి ఎక్కువగా సాగవుతున్న వైఎస్సార్, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రూ.269.95 కోట్లతో చేపట్టిన క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (సీడీపీ) సత్ఫలితాలిస్తోంది. విత్తు నుంచి కోత (ప్రీ ప్రొడక్షన్-ప్రొడక్షన్) వరకు రూ.116.50 కోట్లు, కోత అనంతరం నిర్వహణ-విలువ ఆధారిత (పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, వాల్యూ ఎడిషన్) కోసం రూ.74.75 కోట్లు, ఎగుమతులకు అవసరమైన లాజిస్టిక్స్, మార్కెటింగ్, బ్రాండింగ్ కల్పనకు రూ.78.70 కోట్లు ఖర్చుచేస్తున్నారు. నాణ్యమైన టిష్యూ కల్చర్ మొక్కల నుంచి మైక్రో ఇరిగేషన్, సమగ్ర సస్యరక్షణ (ఐఎస్ఎం), సమగ్ర ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం (ఐపీఎం), ఫ్రూట్ కేర్ యాక్టివిటీ వరకు ఒక్కో రైతుకు గరిష్టంగా హెక్టార్‌కు రూ.40 వేల వరకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. తోట బడుల ద్వారా 15వేల మందికి సాగులో మెళకువలపై శిక్షణనిచ్చారు. సాగుచేసే ప్రతీ రైతుకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ సర్టిఫికేషన్ (జీఏపీ) ఇస్తున్నారు.



ఏటా పెరుగుతున్న ఎగుమతులు..

పీపీపీ ప్రాజెక్టు కింద చేపట్టిన ఫ్రూట్ కేర్ యాక్టివిటీస్ కారణంగా మిడిల్ ఈస్ట్ దేశాలైన యూఏఈ, బెహ్రాన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, కతార్, ఇరాన్ వంటి దేశాలకు అరటి ఎగుమతి అవుతోంది.

- 2016-17 వరకు అరటి పంట రాష్ట్రం కూడా దాటే పరిస్థితి ఉండేది కాదు. ఆ ఏడాది తొలిసారి 246 టన్నులు ఎగుమతి చేస్తే 2017-18లో 4,300 టన్నులు, 2018-19లో 18,500 టన్నులు ఎగుమతి చేశారు.
- వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాది (2019-20)లోనే రికార్డు స్థాయిలో 35వేల టన్నుల అరటిని విదేశాలకు ఎగుమతి చేశారు.
- ఆ తర్వాత వరుసగా 2020-21లో 48వేల టన్నులు, 2021-22లో 48,200 టన్నులు, 2022-23లో 49,500 టన్నులు ఎగుమతి అయ్యాయి.
- ఇక ఈ ఏడాది 75 వేల టన్నులను ఎగుమతి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటికే 50 వేల టన్నుల అరటి ఎగుమతైంది.
- ఈ సీజన్ ముగిసే నాటికి లక్ష టన్నులు దాటే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



విదేశాలకు ఎగుమతి చేసేందుకు అరటిని సిద్ధం చేస్తోన్న కార్మికులు

కమనీయం.. ఖాద్రీశుడి కల్యాణం

- రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలు
- పోటెత్తిన భక్త జనసందోహం



కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో అంగరంగ వైభవంగా జరిగింది. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం అర్చక పండితులు శ్రీవారి కల్యాణం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సకల దేవతల ఆశీర్వచనాలతో స్వామివారు ఉభయ దేవేరులైన శ్రీదేవి, భూదేవిలను వివాహమాడారు. 15 రోజుల పాటు సాగే ఈ బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అత్యంత ముఖ్యమైనది. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల భక్తులతోపాటు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

చిరుత పులి మృతి

ఆదోని సెంట్రల్: కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని సలకలకొండ-దిబ్బనకల్ గ్రామాల సమీపంలో ఓ చిరుత పులి మరణించింది. దీనిపై మాజీ సర్పంచ్ మల్లికార్జున ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని వెంటనే గ్రామానికి చేరుకుని చిరుత పులి కళేబరాన్ని పరిశీలించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఈ ప్రాంతంలో చిరుత పులుల సంచారం ఎక్కువగా ఉందని ఫిర్యాదు చేశారు.

ఇద్దరిని బలిగొన్న వివాహేతర బంధం

- సహజీవనం చేస్తున్న మహిళను, ఆమె ప్రియుడ్ని కత్తితో నరికిన వ్యక్తి
- మహిళ తల్లిపైనా దాడి
- ఇద్దరి మృతి.. ఒకరి పరిస్థితి విషమం
- కాకినాడ జిల్లా చేబ్రోలులో ఘటన




ఘటనా స్థలంలో మృతదేహాలు

పిఠాపురం: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బుధవారం జంట హత్యలు కలకలం రేపాయి. వివాహేతర సంబంధం కారణంగా ఒక వ్యక్తి కత్తితో దాడి చేయడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పిఠాపురం సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. చేబ్రోలుకు చెందిన పెండ్యాల లోవమ్మ కొన్నేళ్లుగా తన భర్తను వదిలేసి స్థానికుడైన లోకా నాగబాబుతో సహజీవనం చేస్తోంది. కొద్దిరోజులుగా పోసిన శ్రీనువాసుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న నాగబాబు .వారిద్దరినీ హెచ్చరించాడు. అయినప్పటికీ వారు లెక్క చేయకపోవడంతో వారిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం శ్రీనువాసు లోవమ్మతో కలిసి చేబ్రోలు శివారు లక్ష్మీపురం పొలిమేరల్లో ఉన్న తన పొలానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న నాగబాబు వారిపై కత్తితో దాడి చేశాడు. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడి నుంచి అదే ఆయుధంతో వచ్చిన నాగబాబు లోవమ్మ ఇంటి వద్ద ఉన్న ఆమె తల్లి రామలక్ష్మిపై దాడి చేసి ఆయుధంతో సహా గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తీవ్ర గాయాలైన రామలక్ష్మిని పోలీసులు పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామలక్ష్మి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, ఎస్సై బాలాజీ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొగ్గు దిగుమతి ఆపొద్దు

- థర్మల్ కేంద్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశం
- వేసవిలో భారీగా పెరగనున్న విద్యుత్ వినియోగం
- జూన్ వరకూ దిగుమతి చేసుకున్న బొగ్గులో స్వదేశీ బొగ్గు మిక్సింగ్
- రాష్ట్రంలో ఆరు రోజుల ఉత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా బొగ్గుకు డిమాండ్ భారీగా పెరగనున్నందున విదేశీ బొగ్గు దిగుమతులను ఆపొద్దని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ వరకూ విదేశీ బొగ్గు దిగుమతులను కొనసాగించాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. ఈ ఏడాది వేసవి తీవ్రత మరింత ఎక్కువ ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వచ్చే మే నెలలో విద్యుత్ డిమాండ్ గరిష్టంగా రోజుకు 250 గిగావాట్లు ఉంటుందని విద్యుత్ శాఖ అంచనా వేస్తోంది. ఇంత భారీ డిమాండ్‌ను తట్టుకోవాలంటే విద్యుత్ ఉత్పత్తి కూడా ఆ స్థాయిలోనే ఉండాలి. నిజానికి బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను దశల వారీగా మూసేయాలని కేంద్రం కొంతకాలం క్రితం సూచించింది. కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో అది అంత మంచి నిర్ణయం కాదని కేంద్రం భావిస్తోంది. థర్మల్ కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో నడపాలంటే బొగ్గు చాలా అవసరం. దీంతో అన్ని థర్మల్ కేంద్రాల్లో సరిపడా బొగ్గు నిల్వలు ఉండాలని గతేడాది అక్టోబర్‌లో అన్ని రాష్ట్రాల ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలను ఆదేశించింది. దిగుమతి చేసుకున్న బొగ్గులో స్వదేశీ బొగ్గును కలిపి వాడుకోవాలని కేంద్రం చెప్పింది.



కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్లాంట్

ఏపీకి ఇబ్బంది లేదు

ప్రపంచవ్యాప్తంగా బొగ్గు కొరత ఏర్పడి అనేక రాష్ట్రాల్లో విద్యుత్ కోతలు విధిస్తున్నప్పటికీ మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం, ఇంధన శాఖ ముందస్తు వ్యూహాల కారణంగా సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ప్రభుత్వ ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో వీటీపీఎస్‌కి రోజుకు 28,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. ప్రస్తుతం 1,34,563 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. ఆర్టీపీపీకి 21 వేల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా..90,003 మెట్రిక్ టన్నులు ఉంది. కృష్ణపట్నం ప్లాంట్‌కు 29 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా..1,14,858 మెట్రిక్ టన్నులు ఉంది. హిందూజాలో రోజుకు 19,200 మెట్రిక్ టన్నులు వాడుతుండగా, 1,17,375 మెట్రిక్ టన్నుల నిల్వ ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో బొగ్గు నిల్వలు రెండు రోజుల నుంచి ఆరు రోజులకు సరిపోతాయి. నిల్వలు తరిగిపోయి థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బంది తలెత్తకుండా సింగరేణి కాలరీస్, మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి బొగ్గు సరఫరా సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాయి.

హత్యపై అబద్ధాల డప్పు

- టీడీపీ సానుభూతిపరుడి హత్య వ్యక్తిగత విభేదాలతోనే..
- పోలీసుల ప్రాథమిక విచారణలోనూ అదే వెల్లడి
- హతుడు మునెయ్యపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి పొందేందుకు పచ్చ నేతల విష ప్రచారం

గిద్దలూరు రూరల్: ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం పరమేశ్వరనగర్‌లో టీడీపీ సానుభూతిపరుడిపై కొందరు గొడ్డలితో దాడి చేయడం.. బాధితుడు చికిత్స పొందుతూ మరణించడంపై ఆ పార్టీ నేతలు విష ప్రచారానికి తెరలేపారు. వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఎల్లో మీడియాలో చిలువలుపలువలుగా కథనాలు ప్రచురించారు. ఈ ఘటనతో రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేకున్నా టీడీపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తూ.. వైఎస్సార్‌సీపీకి రక్తపు మరకలు అంటించేందుకు ప్రణాళికా బద్ధంగా పావులు కదిపారన్నది సుస్పష్టం. పోలీసులు సకాలంలో స్పందించి ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వారిపైనా ఎల్లో మీడియాలో బురదజల్లే ప్రయత్నం చేయడం టీడీపీ నేతల కుట్రకు పరాకాష్టగా మారింది.

నిస్సిగ్గుగా అబద్ధాల 'దాడి'

పరమేశ్వర నగర్‌కు చెందిన పాముల మునెయ్య, గుండాల అల్లూరయ్య సమీప బంధువులు. కొన్ని నెలల కిందటి వరకు ఇద్దరూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్నారు. వీరిద్దరి మధ్య సుమారు ఆరేళ్లుగా వ్యక్తిగత విభేదాలున్న విషయాన్ని స్వయంగా గ్రామస్తులే చెబుతున్నారు. అంతేకాదు గ్రామంలోని మహిళలతో మునెయ్య వ్యవహరిస్తున్న తీరుపై అల్లూరయ్యతో పాటు గ్రామంలోని మరికొందరు ఇటీవల కాలంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలల కిందట మునెయ్య టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాడు. అల్లూరయ్యకు వైఎస్సార్‌సీపీలో సభ్యత్వం లేకున్నా ఇటీవల సిద్ధం సభకు గ్రామస్తులందరితో కలిసి వెళ్లాడు. ఇటీవల మునెయ్య స్నేహితుడు రామాంజనేయులు అటవీ భూముల్లో జామాయిల్ కర్రను అక్రమంగా నరికి తెచ్చుకోవడంతో ఫారెస్ట్ అధికారులు జరిమానా విధించారు. ఆ ఫిర్యాదు చేసింది అల్లూరయ్య అనే అనుమానంతో మునెయ్య మద్యం తాగి గ్రామంలో పెద్ద ఎత్తున దుర్భాషలాడాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. మునెయ్య లైంగిక వేధింపులు, అతని వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన తగాదాలు, అల్లూరయ్యతో కొన్నేళ్లుగా ఉన్న వ్యక్తిగత విభేదాలు వెరసి హత్యాయత్నానికి దారితీశాయి. ఈ దాడిలో దురదృష్టవశాత్తూ మునెయ్య మరణించాడు. మునెయ్యపై దాడి చేసిన నలుగురు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై వేగంగా దర్యాప్తు సాగుతోందని, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని గిద్దలూరు సీఐ వైవీ సోమయ్య చెప్పారు.

పక్షుల నియంత్రణకు స్ప్రే డ్రోన్



విమానాల రాకపోకలకు పక్షులు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. దీంతో తూర్పు నౌకాదళంలోని వైమానిక బృందం వినూత్న విధానాల్ని అమల్లోకి తీసుకొచ్చింది. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం, నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగా పక్కపక్కనే ఉన్నాయి. వీటి పక్కనే మడ అడవులు విస్తరించి ఉన్నాయి. అక్కడ నుంచి పక్షులు రాకపోకలు పెరుగుతుండటంతో.. విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నేవల్ ఫ్లైట్స్ కూడా ఎగిరేందుకు అంతరాయం కలుగుతున్న తరుణంలో ఈ సమస్యని పరిష్కరించేందుకు నేవల్ ఏవియేషన్ అధికారులు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. స్ప్రే డ్రోన్స్‌ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐఎన్ఎస్ డేగా నుంచి వీటి ఆపరేషన్స్ నిర్వహించి.. పక్షులు ఎగరనీయకుండా నియంత్రించనున్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలో ఉన్న చెట్లపై నీటిని స్ప్రే చేస్తే.. రన్‌వే సమీపంలోకి పక్షులు రాకుండా నిలువరించగలమనీ.. తద్వారా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడదని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి. - సాక్షి, విశాఖపట్నం

వార్షిక కౌలు జీవో అమలును నిలిపేయండి

- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు
- రాజధాని రైతులకు కౌలు చెల్లించాలని సీఆర్‌డీఏ చట్టంలో లేదు
- విచారణ 2 వారాలకు వాయిదా



సాక్షి, అమరావతి : రాజధాని కోసం భూములిచ్చిన అమరావతి రైతులకు వార్షిక కౌలును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలన్న సీఆర్‌డీఏ చట్ట నిబంధనను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అమరావతి రైతులకు వార్షిక కౌలు చెల్లింపు నిమిత్తం రూ.240 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం గతేడాది మే 5న జారీ చేసిన జీవో 286 అమలును నిలిపేయాలని కోరుతూ విశాఖపట్నానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ యునైటెడ్ ఫ్రంట్ నార్త్ ఆంధ్రా జిల్లాల అధ్యక్షుడు పాక సత్యనారాయణ ఈ పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. ఏపీ క్యాపిటల్ సిటీ ల్యాండ్ పూలింగ్ స్కీం (ఫార్ములేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్) రూల్స్ 2015, ఏపీ ల్యాండ్ డెవలప్‌మెంట్ రూల్స్ 2017ను శాసనసభ ఆమోదం లేకుండానే అప్పటి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ఈ నిబంధనలను రాజధాని కోసం భూములిచ్చిన రైతులను ఆదుకునేందుకు తెచ్చారని తెలిపారు. అయితే వీటిని శాసనసభ ముందు ప్రవేశపెట్టనందున ఇవి చట్ట విరుద్ధమవుతాయన్నారు. వాస్తవానికి సీఆర్‌డీఏ 2014 చట్టంలో ఎక్కడా రైతులకు వార్షిక కౌలు చెల్లించాలని లేదని, అందువల్ల రాష్ట్ర ఖజానా నుంచి వార్షిక కౌలు చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై లేదని వివరించారు. సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 53(1)(డీ) ప్రకారం మొత్తం భూమిలో 5 శాతం భూమిని పేదల నివాసం కోసం గత ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా కేటాయించలేదన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, సీఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేస్తూ చట్టం తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు రక్షణ కల్పించిందని గుర్తు చేసింది. అయితే ఆ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత ఉపసంహరించుకుందని వీఆర్ రెడ్డి తెలిపారు. అలా అయితే ఉపసంహరణ వల్ల చట్ట నిబంధనలు ఏ విధంగా ప్రభావితం అవుతాయో తెలియజేయాలని వీఆర్ రెడ్డికి ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. రైతుల తరఫున ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసేందుకు ధర్మాసనం అంగీకరించింది.


గ్రూప్-1 మెయిన్స్ అప్పీల్‌పై విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ అప్పీల్‌పై గురువారం విచారణ జరిగే అవకాశం ఉంది. వాస్తవానికి ఈ అప్పీల్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉండగా.. అప్పీల్‌ను విచారించే ధర్మాసనంలోని న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ గుహనాథన్ నరేందర్ రెండో రోజు కూడా సెలవు పెట్టారు. దీంతో ఈ అప్పీల్ గురించి న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ నూనె హరినాథ్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఏపీపీఎస్సీ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యనారాయణ ప్రసాద్ ప్రస్తావించారు. అత్యవసర విచారణకు అభ్యర్థించారు. దీంతో ధర్మాసనం విచారణ జరిపింది. సత్యనారాయణ ప్రసాద్ స్పందిస్తూ.. పిటిషనర్లు వాదించని అంశాలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకున్నారని, వేటిని పరిగణనలోకి తీసుకోవాలో వాటిని పిటిషనర్లు వాదించలేదని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై గురువారం విచారణ జరుగుతుందని స్పష్టం చేసి ఆ మేర విచారణను వాయిదా వేసింది. కేసుల విచారణ జాబితాలో ఇది మొదటి కేసుగా ఉంది.

వసంతపు వెలుగులు

సరిగ్గా సగ భాగం చీకట్లో, మరో సగం ఉదయపు కాంతుల్లో నిండుగా వెలిగిపోతూ కనిపిస్తున్న భూమిని చూస్తున్నారుగా! వసంత విషువత్తు (స్ప్రింగ్ ఈక్వినాక్స్) సందర్భంగా బుధవారం అంతరిక్షం నుంచి భూ గ్రహం ఇలా కన్పించింది. అచ్చెరువొందించే ఈ ఫొటోను యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ ద ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ మెటరోలాజికల్ శాటిలైట్స్ (ఈయూఎంఈటీఎస్ఏటీ) విడుదల చేసింది. సంవత్సరంలో రెండు రోజులు భూమిపై రాత్రింబవళ్ల నిడివి సమానంగా ఉంటుంది. ఆ రోజుల్లో సూర్యుడు భూమధ్యరేఖపై నేరుగా ఉండటమే ఇందుకు కారణం. వీటినే విషువత్తులుగా పిలుస్తారు. భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమించే క్రమంలో ఇవి ఏర్పడతాయి. మొదటిదైన వసంత విషువత్తు ఏటా మార్చి 20కి అటూ ఇటుగా వస్తుంది. ఆ రోజుతో ఉత్తరార్ధ గోళం అధికారికంగా శీతాకాలం నుంచి వసంత కాలంలోకి ప్రవేశిస్తుంది. అక్కడినుంచి ఆ ప్రాంతంలో పగటికాలం, ఉష్ణోగ్రతలు పెరుగుతూ రాత్రుళ్ల నిడివి తగ్గుతూ వస్తాయి. రెండోదైన శరద్విషువత్తు (ఆటమల్ ఈక్వినాక్స్) సెప్టెంబర్ 22కు ఇటూ ఇటుగా వస్తుంది. విషువత్తులకు జ్యోతిశ్శాస్త్రంలో చాలా ప్రాధాన్యముంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



అతివకు అందలం!

శ్రామికశక్తిలో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యం ● మహిళల నియామకంలో హైదరాబాద్, పుణే, చెన్నై టాప్

ముంబై: దేశంలో ఉద్యోగాలు, ఇతర క్రియాశీలక పనుల్లో మహిళల భాగస్వామ్యం నానాటికీ పెరుగుతోంది. మహిళా సాధికారత దిశగా ఇదొక ముందడుగు అని చెప్పొచ్చు. ఇండియాలో 140 కోట్లకుపైగా జనాభా ఉండగా, వీరిలో 69.2 కోట్ల మంది మహిళామణులే. వీరిలో దాదాపు 37 శాతం మంది ఉద్యోగాలు, క్రియాశీలక పనుల్లో కొనసాగుతున్నారని తాజా అధ్యయనంలో తేలింది. 'కెరీర్‌నెట్స్' అనే సంస్థ 'ఇండియాలో మహిళా ఉద్యోగుల స్థితిగతులు' పేరిట తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. ఉద్యోగాలు చేస్తున్న మహిళల విషయంలో హైదరాబాద్, పుణే, చెన్నై అగ్రస్థానాల్లో ఉన్నాయని వెల్లడించింది. 2022తో పోలిస్తే 2023లో శ్రామికశక్తిలో అతివల ప్రాతినిధ్యం 2 నుంచి 5 శాతం పెరిగినట్లు తెలియజేసింది. జూనియర్ ప్రొఫెషన్ ఉద్యోగాలు, ఎగ్జిక్యూటివ్ బోర్డుల్లో వారి భాగస్వామ్యం పెరిగినట్లు పేర్కొంది. నివేదికలో ఇంకా ఏం పేర్కొన్నారంటే..

- 2023లో కాలేజీల నుంచి వచ్చి కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారిలో 40 శాతం మంది మహిళలే ఉన్నారు.
- ఒకటి నుంచి ఏడేళ్ల అనుభవం ఉన్న మహిళలకు కొత్తగా జరుగుతున్న నియామకాల్లో 20 నుంచి 25 శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయి.
- దేశ రాజధాని ఢిల్లీ మినహా ఇతర నగరాల్లో మహిళల నియామకం పెరిగింది. ఢిల్లీలో మాత్రం తగ్గిపోయింది.
- ఉద్యోగాల్లో మహిళల నియామకం రేటు హైదరాబాద్‌లో 34 శాతం, పుణేలో 33 శాతం, చెన్నైలో 29 శాతంగా నమోదైంది. ఢిల్లీలో ఇది కేవలం 20 శాతంగా ఉంది.



సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు అత్యవసర బ్రెయిన్ సర్జరీ

ఆపరేషన్ విజయవంతం: వైద్యులు



న్యూఢిల్లీ: ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ (66)కు మెదడు శస్త్రచికిత్స జరిగింది. పుర్రె లోపల రక్తస్రావంతో మార్చి 17వ తేదీన ఆయన అత్యవసరంగా ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆస్పత్రిలో చేరారు. డాక్టర్ వినీత్ సూరి నేతృత్వంలోని న్యూరో బృందం విజయవంతంగా శస్త్రచికిత్స చేసినట్లు ఆస్పత్రి బుధవారం ప్రకటించింది. సద్గురు కొన్ని వారాలుగా తీవ్ర తలనొప్పితో బాధపడుతున్నారు. మార్చి 15న సూరిని సంప్రదించగా వెంటనే ఎంఆర్ఐ చేశారు. దాంతో రక్తస్రావం విషయం బయటపడింది. మార్చి 17న పాక్షికంగా స్పృహ కోల్పోవడం, ఎడమ కాలు మొద్దుబారడం వంటి సమస్యలు తలెత్తాయి. దాంతో హుటాహుటిన ఆస్పత్రిలో చేర్చి అదే రోజు సర్జరీ చేశారు. సద్గురు కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు.

సద్గురు సరదా పోస్టు

సర్జరీపై సద్గురు ఇన్‌స్టాగ్రాంలో సరదా పోస్ట్ పెట్టారు. ''అపోలో న్యూరోసర్జన్లు నా పుర్రెకు రంధ్రం పెట్టి లోపల ఏదైనా ఉంటుందేమోనని వెతికారు. వాళ్లకేదీ దొరకలేదు. అంతా ఖాళీ. శ్రమ వృథా అయిందనుకుని ప్యాచప్ చేసి రంధ్రం మూసేశారు. ప్యాచప్ పుర్రె, డ్యామేజీ బ్రెయిన్‌తో ఢిల్లీ ఆస్పత్రిలో ఉన్నా'' అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సద్గురుకు ఫోన్ చేసి యోగక్షేమాలు కనుక్కున్నారు.

కృత్రిమ మేధలో లీడర్ ఇండియా

- ఏఐ, సెమీ కండక్టర్లు, క్వాంటమ్ మిషన్లతో ఉపాధి, పెట్టుబడి అవకాశాలు
- ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం
- 'స్టార్టప్ మహాకుంభ్'లో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సామర్థ్యాల్లో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర చెప్పారు. ప్రపంచదేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు స్వదేశీ పరిష్కార మార్గాలు కనిపెట్టాలని భారత యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీలో స్టార్టప్ మహాకుంభ్‌లో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం గతంలోనే ప్రారంభించిన ఏఐ, సెమీ కండక్టర్లు, నేషనల్ క్వాంటమ్ మిషన్ల ద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఉపాధి, విదేశీ ఇన్వెస్టర్లకు పెట్టుబడి అవకాశాలు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. ఏఐ టెక్నాలజీ అనే నూతన శకంలో మనం ఉన్నామని, ఈ రంగంలో భారత్‌దే పైచేయి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ అవకాశం ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోవద్దని సూచించారు. యువతకు, ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులకు ఏఐ టెక్నాలజీ అవధుల్లేని అవకాశాలు అందిస్తోందని పేర్కొన్నారు. కృత్రిమ మేధలో ఇండియానే లీడర్ అవుతుందంటూ గత ఏడాది అమెరికా సెనేట్‌లో తాను తేల్చిచెప్పానని మోదీ గుర్తుచేశారు. ఎన్నికల ప్రచారం కోసం ఏఐ టెక్నాలజీని వాడుకుంటున్నానని, తెలుగు, తమిళం తోపాటు ఎన్నో భాషల్లో తన స్టేట్‌మెంట్లను ప్రజలతో పంచుకుంటున్నానని ఉద్ఘాటించారు.

మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదే

సార్వత్రిక ఎన్నికల తర్వాత తమ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టబోతోందని ప్రధాని మోదీ వెల్లడించారు. రూ.వేల కోట్లతో కొత్తగా 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలకు మధ్యంతర బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. స్టార్టప్ కంపెనీలకు నిధుల సాయం అందించడానికి ఒక ఉత్తమ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. 2014లో మన దేశంలో కనీసం 100 స్టార్టప్‌లు కూడా లేవని, ఇప్పుడు వాటి సంఖ్య 1.25 లక్షలు దాటిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కంపెనీలతో 12 లక్షల మంది యువత అనుసంధానమై ఉన్నారని వివరించారు. స్టార్టప్‌లు పెద్ద సంఖ్యలో పేటెంట్లు సాధిస్తున్నాయని కొనియాడారు. మనకు 110కుపైగా యూనికార్న్ కంపెనీలు ఉన్నాయని తెలిపారు. విద్యాభ్యాసం అంటే ప్రభుత్వం ఉద్యోగం సంపాదించడం అనే ధోరణి గతంలో ఉండేదని, ప్రభుత్వ ఉద్యోగం వస్తే జీవితంలో స్థిరపడినట్లేనని భావించేవారని గుర్తుచేశారు. అలాంటి ఆలోచనా ధోరణి ఇప్పుడు మారిందని, స్టార్టప్ విప్లవం మొదలైందని అన్నారు. నేటి మన యువత ఉద్యోగాలు కోరుకొనేవారుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారిగా ఎదుగుతున్నారని ప్రశంసించారు. దేశంలో 45 శాతానికిపైగా స్టార్టప్‌లకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. ప్రపంచంలో మూడోఅతి పెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదేనని పేర్కొన్నారు. వికసిత్ భారత్‌తోపాటు ప్రపంచ మెరుగైన భవిష్యత్తుకు నవీన ఆవిష్కరణల సంస్కృతి చాలా కీలకమని స్పష్టం చేశారు.




బుధవారం ఢిల్లీలో స్టార్టప్ మహాకుంభ్‌లో పాల్గొన్న వారికి ప్రధాని మోదీ అభివాదం

రాహుల్‌పై వ్యంగ్యాస్త్రాలు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. రాజకీయాల్లో కొందరిని పదేపదే కొత్తగా ప్రారంభించాల్సి వస్తోందని అన్నారు. ఒక రంగంలో స్టార్టప్ కంపెనీ విఫలమైతే మరో రంగంలో ప్రారంభించవచ్చని చెప్పారు. రాజకీయాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. చాలామంది స్టార్టప్‌లు ప్రారంభిస్తున్నారని, రాజకీయాల్లో స్టార్టప్‌ల సంఖ్య మరింత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

ఎలక్షన్ బీట్

యూపీలో క్లీన్ స్వీప్ చేస్తాం: అమిత్ షా



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ బీజేపీ 2014 కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన న్యూస్ 18 సదస్సులో మాట్లాడారు. వారసత్వ రాజకీయాలు చేసే పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. యూపీలో 80 సీట్లకు గాను 2014లో బీజేపీ 71 గెలుచుకుంది. ఎన్డీఏ భాగస్వామి అప్నాదళ్ రెండు స్థానాలు దక్కించుకుంది. ఒడిశాలో పొత్తులపై అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ)తో చర్చలు జరుగుతున్నాయని, తుది నిర్ణయాన్ని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా తీసుకుంటారని షా తెలిపారు. ఒంటరిగా పోరాడాలనుకుంటే ఆ రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకే ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. పంజాబ్‌లో అకాలీదళ్‌తో పొత్తు విషయంపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. బెంగాల్‌లో తమ పార్టీ 25 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తుందని, పంజాబ్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ అధిక సీట్లు సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సుప్రీంకోర్టు సెప్టెంబర్ వరకు గడువిచ్చిందని, అంతకుముందే వాటిని నిర్వహిస్తామని అమిత్ షా చెప్పారు.


కాంగ్రెస్‌లో చేరిన పప్పూ యాదవ్



సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో ప్రముఖ నేత, జన్ అధికార్ పార్టీ అధినేత రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన పార్టీని అధికారికంగా కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మీడియా ఇంఛార్జి పవన్ ఖేడా, బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్ ప్రకాశ్ ఆధ్వర్యంలో పప్పు యాదవ్, ఆయన కుమారుడు సార్థక్ రంజన్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయన బిహార్‌లోని పూర్ణియా నుంచి కాంగ్రెస్ నుంచి బరిలో దిగే అవకాశముంది. బీఎస్పీ నుంచి సస్పెండైన ఎంపీ డానిష్ అలీ, జార్ఖండ్ బీజేపీ ఎమ్మెల్యే జై ప్రకాశ్ భాయ్ పటేల్, జమ్మూకశ్మీర్ మాజీ ఎంపీ లాల్‌సింగ్ సైలు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

టికెట్ నిరాకరిస్తే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో!

తాడోపేడో తేల్చుకోనున్న వరుణ్ గాంధీ



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ ఎంపీ స్థానం నుంచి ఈసారి పార్టీ తరఫున టికెట్ దక్కపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో దిగాలని బీజేపీ యువ నేత వరుణ్ గాంధీ భావిస్తున్నట్లు వార్తలొచ్చాయి. తరచూ సొంత పార్టీ, ప్రభుత్వ విధానాలనే తప్పుబట్టే వరుణ్ గాంధీకి ఈసారి కమలదళం టికెట్ ఇవ్వకపోవచ్చని ఊహాగానాలు వినిపించాయి. టికెట్ దక్కపోయినా పోటీ చేయడం ఖాయమని వరుణ్ ఇప్పటికే నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుణ్ పిలిభిత్ స్థానం నుంచి పోటీచేసి ఘన విజయం సాధించారు. ఏప్రిల్ 19వ తేదీన ఈ స్థానానికి పోలింగ్ జరగనుంది. అయితే ఇప్పటికే పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ ఇప్పటిదాకా పిలిభిత్ స్థానంలో ఎవరిని నిలబెట్టేది నిర్ణయించలేదు. ఇటీవల జరిగిన బీజేపీ కోర్‌కమిటీ భేటీలో వరుణ్‌కు ఈసారి టికెట్ ఇవ్వకూడదంటూ కొందరు రాష్ట్ర నేతలు ఖరాకండీగా చెప్పినట్లు సమాచారం. వరుణ్‌కు సమాజ్‌వాదీ పార్టీ టికెటిస్తుందని వార్తలు గుప్పుమన్నాయి. దీనిపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను మీడియా ప్రశ్నించగా త్వరలోనే నిర్ణయిస్తామన్నారు.

21 మందితో డీఎంకే జాబితా



చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే లోక్‌సభ ఎన్నికలకు 21 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. మిగతా 18 సీట్లను భాగస్వాములైన కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకేకి కేటాయించింది. 21 మందిలో 11 మంది కొత్తవారు. సిట్టింగ్ ఎంపీలు కనిమొళి, టీఆర్ బాలు, ఎ.రాజా, తంగపాండియన్, దయానిధి మారన్, ఎస్.జగత్రక్షకన్, కళానిధి వీరాసామి, కతిర్ ఆనంద్, సీఎన్ అన్నాదురైలకు టికెట్లు దక్కాయి. జాబితాతో పాటు ఎన్నికల మేనిఫెస్టోను కూడా డీఎంకే విడుదల చేసింది. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పౌరసత్వ (సవరణ) చట్టం రద్దు, జాతీయ రహదారులపై టోల్ గేట్ల రద్దు, పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర హోదాను రద్దు చేయడానికి కేంద్రాన్ని అనుమతించే ఆర్టికల్ 356 రద్దు, గవర్నర్ల నియామకంలో రాష్ట్రాలతో సంప్రదింపుల వంటి అంశాలను మేనిఫెస్టోలో పొందుపరిచింది. ''ఇది రాష్ట్ర ప్రజల అభిప్రాయాలతో రూపొందిన ప్రజల మేనిఫెస్టో. మా ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రాబోతోందన్న ధీమాతోనే జాతీయాంశాలకు మేనిఫెస్టోలో చోటు కల్పించాం'' అని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. పదేళ్లలో దేశాన్ని బీజేపీ భ్రష్టుపట్టించిందని, ఎన్నికల వాగ్దానాలేవీ అమలు చేయలేదని విమర్శించారు.

మళ్లీ రాజకీయాల్లోకి తమిళిసై



సాక్షి, చెన్నై: తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం మళ్లీ బీజేపీలో చేరారు. చెన్నైలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, అన్నామలై, ఎల్.మురుగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆమెకు తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సభ్యత్వ కార్డును అందజేశారు. గవర్నర్‌గా చేసి మళ్లీ రాజకీయాల్లోకి రావడమేంటని విపక్ష పార్టీలు, అధికార డీఎంకే చేస్తున్న విమర్శలపై అన్నామలై స్పందించారు. '' రాజ్యాంగబద్ధ విశిష్ట పదవుల్లో కొనసాగి కూడా తర్వాత సాధారణ కార్యకర్తలా పనిచేసే సదవకాశం ఒక్క బీజేపీలోనే ఉంటుంది. ఇతర రాజకీయ పార్టీల్లో పనిచేసి తర్వాత గవర్నర్ అయిన వారు మళ్లీ సాధారణ జీవితం కోరుకోరు. వాళ్లకు అత్యున్నత పదవుల్లో కొనసాగడమే ఇష్టం. కానీ బీజేపీ నేతలు అందుకు పూర్తి భిన్నం' అని ఆయన అన్నారు.

ఉచిత వాగ్దానాలపై పిల్

న్యూఢిల్లీ: ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత వాగ్దానాలను తప్పుబడుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. 'ఓటర్ల నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు పార్టీలు చేస్తున్న ఈ ఉచిత తాయిలాల ప్రకటనలు, వాగ్దానాలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. వీటిపై నిషేధం విధించేలా కేంద్ర ఎన్నికల సంఘం తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వండి' అంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ పిల్‌ను దాఖలుచేశారు. ఈయన తరఫున సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా బుధవారం సుప్రీంకోర్టులో వాదించారు. ' ఉచిత వాగ్దానాలిచ్చే రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి, ఆయా పార్టీల ఎన్నికల గుర్తులను స్తంభింపజేయాలి' అని కోరారు. ' ఇది చాలా ముఖ్యమైన అంశం. ఈ పిటిషన్‌ను వీలైనంత త్వరగా విచారిస్తాం. ఏ తేదీన విచారించాలన్న దానిపై గురువారం బోర్డ్‌లో చర్చిస్తాం' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజే ఉచితాలపై పిల్ దాఖలవడం గమనార్హం. ''ప్రజాధనంతో నిర్హేతుకమైన ఉచిత పథకాలు ప్రకటించడంతో ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో ప్రభావితమయ్యే అవకాశం చాలా ఎక్కువ. పోటీ పార్టీల విజయావకాశాలనూ ఇవి దెబ్బతీస్తాయి. పారదర్శకమైన ఎన్నికల క్రతువుకు ఇది విఘాతం. ఉచితాలు ప్రజాస్వామ్య విలువల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు'' అని పిటిషనర్ పేర్కొన్నారు. '' ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న ఈ ఉచితాలు ఒక రకంగా ఓటర్లకు లంచాలు ఇవ్వడం లాంటిదే. అధికార పార్టీ మళ్లీ అధికారంలో కొనసాగడానికి ఇది ఒక మార్గంలా పనికొస్తోంది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఇలాంటి ధోరణులకు చెక్ పెట్టాల్సిందే. ఇందులోభాగంగా ఎన్నికల గుర్తుల(రిజర్వేషన్, అలాట్‌మెంట్) ఉత్తర్వు, 1968లోని సంబంధిత పేరాలో అదనపు షరతులను ఈసీ జతచేయాలి. ఎన్నికలకు ముందు ప్రజాధనంతో నిర్హేతుక ఉచితాల వాగ్దానాలు చేయొద్దని పార్టీలకు షరతు విధించాలి' అని పిటిషనర్ కోర్టును కోరారు.

మూసేవాలా తల్లి ఐవీఎఫ్ చికిత్సపై నివేదిక ఇవ్వండి

పంజాబ్ ప్రభుత్వాన్ని కోరిన కేంద్రం

న్యూఢిల్లీ: దివంగత పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా తల్లి చరణ్ కౌర్‌కు 58 ఏళ్ల వయసులో ప్రసవానికి కారణమైన ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) చికిత్సపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని పంజాబ్ ప్రభుత్వాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోరింది. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ సేవలు పొందే మహిళ వయసు 21- 50 మధ్య ఉండాలి. మూసేవాలా హత్యకు గురైన రెండేళ్లకు ఆయన తల్లి చరణ్ కౌర్ మార్చి 17న మగబిడ్డను ప్రసవించారు.

ఐసిస్ ఇండియా చీఫ్ అరెస్టు

గువాహటి: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్ భారత చీఫ్ హరీస్ ఫరూకీ అలియాస్ హరీష్ అజ్మల్ ఫరూకీ పోలీసులకు చిక్కాడు. అతనితో పాటు సహచరుడు అనురాగ్‌సింగ్ అలియాస్ రెహాన్‌ను కూడా అసోంలోని దుబ్రీ జిల్లాలో బుధవారం అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఫరూకీ స్వస్థలం డెహ్రాడూన్ కాగా రెహాన్‌ది పానిపత్. విచారణ నిమిత్తం వారిని ఎన్ఐఏకు అప్పగించనున్నారు.

తప్పుడు సిమ్‌లు 21 లక్షలు!

గుర్తించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తప్పుడు ధృవీకరణ పత్రాలతో 21 లక్షల సిమ్ కార్డులు జారీ అయినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డీఓటీ) అనుమానం వ్యక్తం చేసింది. రీ-వెరిఫికేషన్ చేసి బోగస్ సిమ్‌లుగా తేలిన వాటిని వెంటనే రద్దుచేయాలని భారతీ ఎయిర్‌టెల్, ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ టెలికం సంస్థలకు డీఓటీ హెచ్చరికలు జారీచేసింది. సంచార్ సాథీ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 114 కోట్ల మొబైల్ కనెక్షన్లను డీవోటీకి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఏఐ, డీఐయూ) విశ్లేషించింది. దీంతో దేశవ్యాప్తంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో 21 లక్షల సిమ్ కార్డులు యాక్టివేట్ అయి ఉన్నట్లు డీఓటీ విశ్లేషణలో తేలింది. మనుగడలో లేని, తప్పుడు, ఫోర్జరీ, నకిలీ ధృవీకరణ పత్రాలతో ఈ సిమ్‌కార్డులను సంపాదించి యాక్టివేట్ చేసి ఉంటారని ఏఐ, డీఐయూ విశ్లేషణలో వెల్లడైంది. దేశంలో తొమ్మిది సిమ్ కార్డుల కంటే ఎక్కువ తీసుకున్న వారు ఏకంగా 1.92 కోట్ల మంది ఉన్నట్లు ఈ విశ్లేషణలో వెల్లడైంది. 21 లక్షల సిమ్ కార్డుల్లో కొన్ని అనుమానాస్పద ఫోన్ నంబర్ల జాబితాను విడుదల ఆయా టెలికం కంపెనీలకు డీఓటీ పంపించింది. వాటి ధృవీకరణ పత్రాలను సరిచూసి రీవెరిఫికేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రీవెరిఫికేషన్‌లో ఆ సిమ్‌లు తప్పుడు పత్రాల ద్వారా తీసుకున్నట్లు గుర్తిస్తే ఆ నంబర్లను తక్షణం రద్దు చేయాలని సూచించింది. ఇప్పటి వరకు 1.8 లక్షల మొబైల్ హ్యాండ్‌సెట్‌లను పనిచేయకుండా చేశామని డీఓటీ అధికారులు చెప్పారు. అనుమానాస్పద నంబర్లపై దర్యాప్తును సర్వీసు ప్రొవైడర్లు వేగవంతం చేయాలని డీవోటీ తుది గడువు విధించింది.

సైబర్ నేరాలకు దుర్వినియోగం!

తప్పుడు పత్రాలతో పొందిన సిమ్‌లను ఆయా వ్యక్తులు సైబర్ నేరాలకు వాడుతున్నట్లు డీఓటీ అనుమానం వ్యక్తంచేసింది. ఒక ప్రాంతంలో తీసుకున్న బోగస్ సిమ్‌ను సుదూర ప్రాంతాల్లో వాడున్నట్లు గుర్తించారు. తప్పుడు పత్రాలతో సేకరించిన సిమ్‌ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతూ కోట్లు కొల్లగొట్టే ప్రమాదముంది. సిమ్‌లను సైబర్ నేరాలకు వాడుతున్నట్లు తేలితే వాటిని రద్దు చేయడంతో పాటు ఫోన్‌నూ పనికిరాకుండా చేస్తామని హెచ్చరించింది.

అంతా నిబంధనల మేరకే

ఈసీల నియామకంపై సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ: ఇద్దరు నూతన కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం నిబంధనల మేరకే జరిగిందని కేంద్రం పేర్కొంది. ఈ ప్రక్రియ హడావుడిగా జరిగిందన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఈసీల ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేకపోవడాన్ని సమర్థించుకుంది. ఎంపిక కమిటీలో న్యాయవ్యవస్థ ప్రాతినిధ్యమే ఈసీ స్వతంత్ర ప్రతిపత్తికి ప్రాతిపదిక కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈసీల ఎంపిక కమిటీ నుంచి సీజేఐని మినహాయించడాన్ని సవాలు చేస్తూ కోర్టులో ఈ కేసులో తదుపరి విచారణ గురువారం జరగనుంది.

కరంద్లాజేపై తక్షణ చర్యలు తీసుకోండి

డీఎంకే ఫిర్యాదుకు స్పందించిన ఈసీ

న్యూఢిల్లీ/శివాజీనగర: కేంద్ర మంత్రి, బీజేపీ నేత శోభా కరంద్లాజే కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారన్న డీఎంకే ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాల్సిందిగా కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను ఈసీ బుధవారం ఆదేశించింది. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో పేలుడుకు తమిళనాడుకు చెందిన వ్యక్తి కారణమని శోభ అన్నారు. ఆ క్రమంలో తమిళనాడు ప్రజలు ఉగ్రవాదులనేలా వ్యాఖ్యలు చేశారంటూ డీఎంకే ఈసీకి ఫిర్యాదు చేసింది.

ఫిన్‌లాండ్.. హ్యాపీనెస్‌కు అడ్రస్

- అత్యంత సంతోషకరమైన దేశాల్లో అగ్రస్థానం
- రెండు, మూడు స్థానాల్లో డెన్మార్క్, ఐస్‌లాండ్
- 126వ స్థానంలో భారత్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్‌లాండ్ వరుసగా ఏడో సంవత్సరం సైతం తొలి స్థానం దక్కించుకుంది. నార్డిక్ దేశాలైన డెన్మార్క్, ఐస్‌లాండ్, స్వీడన్ వరుసగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా 143 దేశాల్లో అధ్యయనం చేసి, రూపొందించిన ఈ జాబితాలో భారతదేశం 126 స్థానంలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఇండియా స్థానం మారలేదు. ప్రపంచ సంతోష సూచికలో చైనా(60), నేపాల్(93), పాకిస్తాన్(108), మయన్మార్(118) ఇండియా కంటే మెరుగైన స్థానంలో ఉండడం గమనార్హం. ఐక్యరాజ్యసమితి సౌజన్యంతో రూపొందించిన వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్‌ను 'ప్రపంచ సంతోషకర దినోత్సవం' సందర్భంగా బుధవారం విడుదల చేశారు. తాలిబన్ల నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న అఫ్గానిస్తాన్ 143వ ర్యాంకుతో చిట్టచివరి స్థానంలో నిలిచింది. ఈసారి అమెరికా, జర్మనీకి టాప్-20లో స్థానం దక్కకపోవడం గమనార్హం. ఇలా జరగడం గత పన్నెండు సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. అమెరికాకు 23, జర్మనీకి 24వ ర్యాంకు దక్కింది. 12వ ర్యాంకుతో కోస్టారికా, 13వ ర్యాంకుతో కువైట్ మొట్ట మొదటిసారిగా టాప్-20 లోకి చేరాయి.

- దేశ ప్రజల ఆత్మ సంతృప్తి, సామాజిక మద్దతు, ఆరోగ్యకరమైన జీవిత కాలం, స్వేచ్ఛ, దాతృత్వం, తలసరి జీడీపీ, అవినీతి వంటి అంశాల ఆధారంగా వరల్డ్ హ్యాపీయెస్ట్ కంట్రీస్ జాబితా రూపొందిస్తారు.
- ప్రపంచంలో జనాభాపరంగా అతిపెద్ద దేశాలకు ఈసారి టాప్-10లో చోటు దక్కలేదు.
- ఫిన్‌లాండ్ అత్యంత సంతోషకరంగా దేశంగా మారడానికి కారణం ఏమిటన్నది ఆసక్తకరం. ఫిన్‌లాండ్ ప్రజలు ప్రకృతితో చక్కటి అనుబంధం కలిగి ఉంటారని యూనివర్సిటీ ఆఫ్ హెల్సింకీలో పనిచేసే హ్యాపీనెస్ పరిశోధకురాలు జెన్నిఫర్ డీ పావోలా చెప్పారు. దేశంలో అవినీతి చాలా తక్కువగా ఉండడం, మెరుగైన విద్య, వైద్య సేవలు అందుతుండడం, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం ఉండడం వంటివి దేశంలో సంతోషానికి కారణమని విశ్లేషించారు.



టాప్-10	
1	ఫిన్‌లాండ్
2	డెన్మార్క్
3	ఐస్‌లాండ్
4	స్వీడన్
5	ఇజ్రాయెల్
6	నెదర్లాండ్స్
7	నార్వే
8	లక్సెంబర్గ్
9	స్విట్జర్లాండ్
10	ఆస్ట్రేలియా

డిఫాల్ట్ బెయిల్ పొందడం నిందితుడి హక్కు

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేసులో విచారణ ప్రారంభించకుండా నిందితుడిని కస్టడీలో సుదీర్ఘకాలం ఎలా కొనసాగిస్తారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడం నిందితుడి స్వేచ్ఛను హరించడమే అవుతుందని తేల్చిచెప్పింది. అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తూ నిందితులకు డిఫాల్ట్ బెయిల్ లభించకుండా చేయడం సమంజసం కాదని పేర్కొంది. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అనుచరుడైన ప్రేమ్ ప్రకాశ్ నివాసంలో 2022 ఆగస్టులో ఈడీ సోదాలు చేసింది. రెండు ఏకే-47 తుపాకులు, 60 బల్లెట్లు లభించాయి. దీంతో అతడిపై ఆయుధాల చట్టంతోపాటు మనీ లాండరింగ్ నేరం కింద ఈడీ కేసులు నమోదు చేసింది. అప్పటి నుంచి నిందితుడు ఈడీ కస్టడీలోనే ఉంటున్నాడు. అతడికి బెయిల్ లభించకుండా ఈడీ ఇప్పటి దాకా కోర్టులో నాలుగు అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేసింది. తనకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ ప్రేమ్‌ప్రకాశ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. డిఫాల్ట్ బెయిల్ పొందడం నిందితుడి హక్కు అని స్పష్టం చేసింది. అతడిని ఎందుకు కస్టడీలో కొనసాగిస్తున్నారనో చెప్పాలని ఈడీని ప్రశ్నించింది. విచారణను ఏప్రిల్ 29కు వాయిదా వేసింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 21 । మార్చి । 2024



ఆకట్టుకున్న కూచిపూడి..
శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి వార్ల వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. -8లో



నాడు–నేడు పనుల పరిశీలన
హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని వేలేరు, వీరవల్లి జెడ్పీ హైస్కూళ్లలో నాడు–నేడు పనులను బుధవారం ఆ ప్రాజెక్టు అడిషనల్ కోఆర్డినేటర్ రామలనాయక్ తనిఖీ చేశారు.



వైఎస్సార్ సీపీ అభ్యర్థుల పాదయాత్ర
ఆటోనగర్: విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్‌తో కలిసి రామలింగేశ్వర నగర్‌లో బుధవారం పాదయాత్ర చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
విజయవాడ	6.23	4.53
జగ్గయ్యపేట	6.25	4.58
మచిలీపట్నం	6.22	4.51
గుడివాడ	6.23	4.53

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి మండపం సమర్పణ



నాగాయలంక (అవనిగడ్డ): గ్రామంలో పురాతన శ్రీవల్లీ శ్రీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి దాతలు రూ.3.18 లక్షల విలువైన వెండి మండపాన్ని సమర్పించారు. స్థానిక ఆంధ్రా బ్యాంకు విశ్రాంత ఉద్యోగి వడ్లమూడి సీతారామయ్య దంపతులు ఈ మండపాన్ని బుధవారం ఆలయ అర్చకుడు కనగాల కుటుంబరావుకు అందజేశారు. తొలుత వెండి మండపాన్ని ఎడ్లబండిపై అలంకరించి గ్రామంలోని ప్రసన్న గణపతి దేవస్థానంలో దర్శనం చేసుకుని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న దాతలు కుటుంబ సభ్యులతో కలసి విశేష పూజలు చేయించిన అనంతరం మండపాన్ని అర్చకుడికి ద్వారా ఆలయానికి సమర్పించారు.

టెన్త్ పరీక్షలకు 626 మంది గైర్హాజరు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి మూడో రోజు బుధవారం 626 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 178 కేంద్రాల్లో మూడో రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 28,654 మంది విద్యార్థులకు 28.028 మంది హాజరయ్యారు. జిల్లాలో ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు 33 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. జిల్లా పరీక్ష పరిశీలకుడు శ్రీనివాసులరెడ్డి నిర్మల హైస్కూల్‌లోని రెండు కేంద్రాలను, పటమటలోని మరో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. డీఈఓ యు.వి.సుబ్బారావు రాజీవ్‌నగర్‌లోని ఆర్‌జీవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలను, వాంబేకాలనీలోని మరో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఈ సందర్భంగా అధికారులు ప్రకటించారు.

వేదాద్రి ఆలయానికి రూ.16.78 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యోగానంద లక్ష్మీనరసింహ స్వామికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.16.78 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ హేమలతాదేవి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. 125 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కానుకల లెక్కింపులో గ్రూపు టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ బాబు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, సేవా సమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ల్లో సీపీ తనిఖీలు



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ – గుంటూరు జిల్లాల సరిహద్దుల్లోని ప్రకాశం బ్యారేజీ, గుంటుపల్లి చెక్‌పోస్ట్‌లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం తనిఖీచేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని చెక్‌పోస్ట్‌ల సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేయాలన్నారు. నగదు, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలతో పట్టుబడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం తగదని సూచించారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఏ– కాలనీలో సీఐఎస్ఎఫ్ పోలీసులకు ఏర్పాటు చేసిన వసతిని పరిశీలించారు.

పోషకాహారం.. సంపూర్ణం

- సంపూర్ణ పోషకాహార నిలయాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రూ.250 కోట్లకు పైగా లబ్ధి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న మార్పులకు శ్రీకారం
- నాడు–నేడు కింద రూ.17.28 కోట్లతో మరమ్మతులు, కొత్త భవనాలు
- ప్రీ స్కూలు ఎడ్యుకేషన్ విధానం అమలు



ఇబ్రహీంపట్నం దుర్గాకాలనీలో నూతనంగా నిర్మించి ప్రారంభించిన అంగన్‌వాడీ భవనం

జి.కొండూరు(మైలవరం): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాలకు సంపూర్ణ పోషకాహార నిలయాలుగా మారాయి. మనబడి నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధిపై దృష్టిసారించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ చేపట్టింది. సొంత భవనాలు లేని చోట కొత్తగా భవనాలను నిర్మించడంతో పాటు సరైన వసతులు లేని కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టి, వసతులు కల్పించే చర్యలు చేపట్టింది. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలు అంటే సంపూర్ణ పోషకాహార, ఆరోగ్య నిలయాలుగా గుర్తింపు పొందాయి.

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు లబ్ధి

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని, అందుకు అంగన్‌వాడీ కేంద్రాలే వేదికని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తోంది. ఈ కేంద్రాలలో సరికొత్త మెనూతో రుచికరమైన వంటకాలతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తోంది. ప్రతి నెలా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహార కిట్లను అందజేస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో ఎన్టీఆర్ జిల్లాలో 1,475 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రూ.250 కోట్లకు పైగా లబ్ధి చేకూరింది.

బలోపేతం దిశగా అడుగులు

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు అనేక వినూత్న కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగానే కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పోషక విలువలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలను అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణంలోనే సాగుచేసేందుకు చర్యలు చేపట్టారు. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాల నిర్వహణ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజలకు విశ్వసనీయతను పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నెలనెలా అందజేస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలపై ఆసక్తి చూపని ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలతో అంగన్‌వాడీ కేంద్రాలను ఆరోగ్య నిలయాలుగా భావిస్తున్నారు.



జి.కొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు (ఫైల్)

ప్రీ స్కూలు ఎడ్యుకేషన్ అమలు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూలు ఎడ్యుకేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మూడు నుంచి ఆరేళ్ల లోపు వయసు పిల్లలకు ప్రీ స్కూలు ఎడ్యుకేషన్ కిట్‌లను అందజేసింది. పీపీ–1, పీపీ–2 మెటీరియల్‌ను అందజేసి వాటి ప్రకారం చిన్నారులకు పాఠాలు బోధిస్తున్నారు. చిన్నారుల్లో శరీర దారుఢ్యం పెంచేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను సైతం అందిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ప్రీ స్కూలు కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లా ఏర్పడిన తరువాత..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 1,475 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సొంత భవనాలు లేని 83 కేంద్రాలకు రూ.13.28 కోట్లతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. 463 కేంద్రాల్లో రూ.4 కోట్లతో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేశారు. 8,402 మంది గర్భిణులకు రూ.15.84 కోట్లు, 9,500 మంది బాలింతలకు రూ.17.82 కోట్లు, మూడేళ్లలోపు 48,645 మంది చిన్నారులకు రూ.44 కోట్లు, 19,448 మంది ప్రీ స్కూలు చిన్నారులకు రూ.15.93 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

నమ్మకం పెరిగింది



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం పెరిగింది. క్రమం తప్పకుండా నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నారు. గర్భిణిగా, బాలింతగా ఉన్న సమయాల్లో తీసుకోవాల్సిన పోషకాహారంపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మంచి పోషకాహారాన్ని నెలనెలా క్రమం తప్పకుండా అందిస్తున్నారు. మా ఆరోగ్యంపై ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– ఇరుగుల శిరీష, గర్భిణి, మునగపాడు, జి.కొండూరు మండలం

నెలకు పోషకాహారం పంపిణీ ఇలా..



గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా రాగిపిండి రెండు కిలోలు, జొన్న, సజ్జ పిండి కిలో, అటుకులు కిలో, బెల్లం 250 గ్రాములు, వేరుశనగ చిక్కీ 250 గ్రాములు, ఎండు ఖర్జూరం 250 గ్రాములు, చిన్నారులకు కోడిగుడ్లు 25, పాలు 2.5 లీటర్లు, బాలామృతం 2.5 కిలోల చొప్పున అందుతున్నాయి.

దుర్గగుడి ఆదాయం పెంచడమే లక్ష్యం



సమీక్ష సమావేశంలో ఈఓ, అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): స్థానిక శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులు, బడ్జెట్‌పై బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. మహామండపం నాల్గో అంతస్తులోని ఈఓ కె.ఎస్.రామరావు చాంబర్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈఓలు ఎన్.రమేష్‌బాబు, శ్రీనివాసరావు, పలువురు సూపరింటెండెంట్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలు, దేవస్థాన ఆదాయం పెంపుపై ఈఓ ఆలయ అధికారులతో చర్చించారు. గతంలో ఉన్న దేవస్థాన ఆదాయ వివరాలను విభాగాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాల్లో ఆదాయం పెంపునకు ఉన్న అవకాశాలను ఆలయ ఏఈఓలు, సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు.

ఉభయదాతల సంఖ్య పెరగాలి: ఈఓ

దేవస్థాన ఆధ్వర్యంలో ఉన్న సత్రాలు, కాటేజీలకు అవసరమైన అన్ని మరమ్మతులు చేపట్టి వాటి ద్వారా దేవస్థానానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఈఓ సూచించారు. అమ్మవారికి నిత్యం జరిగే ఆర్జిత సేవల్లో ఉభయదాతల సంఖ్య మరింత పెరిగేలా చూడాలని, ప్రత్యక్ష సేవల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని, అదే స్థాయిలో పరోక్ష సేవలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందు కోసం సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలన్నారు. ఆలయంలో జరిగే అన్ని పూజలు భక్తులకు నేరుగా చేరేలా వెబ్‌సైట్‌ను రూపకల్పన చేయాలన్నారు.

అనధికార వీఐపీలను తగ్గించాలి

అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి ఒక్కరు టికెట్లను కొనేలాచూడాలని ఏఈఓలు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లకు ఈఓ రామరావు సూచించారు. అంతరాలయ దర్శనం చేసుకునే భక్తులు తప్పని సరిగా టికెట్లు కొనుగోలు చేయాల్సిందేనన్నారు. ప్రొటోకాల్ ఉన్న వారికి మాత్రమే దర్శనం కల్పించాలని, వారి వెంట వచ్చే అనధికార వీఐపీలకు టికెట్లు తప్పనిసరని చెప్పాలని సూచించారు. నాలుగు రోజులుగా రూ.500 టికెట్ల విక్రయాలు పెరిగాయని, రానున్న రోజుల్లో మిగిలిన టికెట్ల విక్రయాలు కూడా పెరిగేలా చూడాలన్నారు. పెరుగుతున్న వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.

సమగ్ర సమాచారం అందించేలా మీడియా సెంటర్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



డీపీఆర్వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): సాధారణ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాలకు అందజేసి ప్రజలకు చేరేలా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మీడియా సెంటర్ ఏర్పాటుకు జరుగుతున్న పనులను పరిశీలించేందుకు నగరంలోని ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో ఉన్న డీఐపీఆర్ఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా సెంటర్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు సకాలంలో అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికలు నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్య మాల సహకారం ఎంతో అవసరమన్నారు. అందువల్ల మీడియా ప్రతినిధులకు ఎన్నికల సమాచారాన్ని సకాలంలో అందించడంలో సమాచార శాఖ అధికారులు సఫలీకృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో నియోజకవర్గాల మ్యాపులను, ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఎన్నికల అధికారుల వివరాలను ప్రత్యేక బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా రూపొందించిన నివేదికల సమాచారాన్ని మీడియా సెంటర్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాల మార్గదర్శకాల మేరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మీడియా సెంటర్ ద్వారా నాణ్యమైన సేవలు అందించి ఎన్నికలను విజయవంతం చేయడంలో నిబద్ధతతో భాగస్వాములు కావాలని సూచించారు. మీడియా సెంటర్ ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ వెంట డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్.వి. మోహనరావు, అడిషనల్ పీఆర్వో కె.రవి, ప్రచార సహాయకులు వి.వి.ప్రసాద్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కృష్ణాజిల్లాకు కేంద్ర బలగాలు రాక

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ఎన్నికల నేపథ్యంలో కృష్ణాజిల్లాకు బుధవారం 75 మందితో కూడిన కేంద్ర బలగం చేరుకుంది. సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, పోలీసు కానిస్టేబుళ్లతో కూడిన ఈ బృందం మచిలీపట్నంలో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించనుంది. కేంద్ర బలగాల బృందం నగరంలోని హైనీ స్కూలు వద్ద నుంచి లక్ష్మీటాకీస్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, కోనేరు సెంటర్, చల్లరాస్తాసెంటర్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నట్లు బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తెలిపారు.



బలకాలకు సూచనలిస్తున్న బందరు డీఎస్పీ సుభాన్

డ్రామా పోటీల్లో డివిజన్‌కు మొదటి స్థానం

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



అవార్డులు సాధించిన సిబ్బందిని అభినందిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): హిందీ భాషను విస్తృత పరిచేందుకు ఇండియన్ రైల్వే చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఉదయపూర్‌లో ఈ నెల 15న నిర్వహించిన హిందీ డ్రామా పోటీలలో విజయవాడ డివిజన్ మొదటి స్థానం సాధించిందని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. గురువారం డీఆర్ఎం కార్యాలయంలో జరిగిన 186వ డివిజనల్ అధికార భాష అమలు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అధికారక విధుల్లో తప్పనిసరిగా హిందీ ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్‌లో అధికార భాష అమలులో డివిజన్ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. ఆల్ ఇండియా హిందీ డ్రామా పోటీలలో విజయవాడ డివిజన్ 15 విభాగాల్లో మొదటి స్థానంతో పాటు ఎనిమిది అవార్డులను గెలుచుకుందని తెలిపారు. సర్వనీతి డ్రామాకు ఉత్తమ డైరెక్టర్, ఉత్తమ సంగీతం, స్టేజి డిజైన్, సౌండ్ ఎఫెక్ట్, లైటింగ్, కాస్టింగ్ తదితర విభాగాల్లో ఈ అవార్డులను సాధించినట్లు తెలిపారు. ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్, రాజభాష అధికారి ఆశామహేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్‌లు 'నియమావళి' పాటించాలి

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, ముద్రణ సంస్థలు కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ప్రింటింగ్‌లో నిబంధనలు పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని 127ఏ ప్రకారం కరపత్రాలు, పోస్టర్లు ముద్రించినపుడు సంబంధిత పత్రాలపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామా స్పష్టంగా ఉండాలని పేర్కొన్నారు. వాటిని ముంద్రించిన మూడు రోజుల్లోపు మూడు కాపీలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి అందజేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సస్యరక్షణ.. డ్రోన్ శిక్షణ

- ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ల ఉపయోగం
- గ్రామీణ యువతకు అగ్రికల్చర్ డ్రోన్ పైలెట్ శిక్షణ
- డీజీసీఏ ఆథరైజేషన్‌తో ఏఆర్‌పీసీ కోర్సు
- ఎన్టీఆర్ జిల్లాలో 23 మంది యువతకు శిక్షణ పూర్తి



పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. టెక్నాలజీ రాకతో ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. హరిత విప్లవం వచ్చిన తొలి నాళ్లలో వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ జరిగింది. విత్తనం నాటే నాటి నుంచి పంట కోసే వరకు రైతులు పూర్తి స్థాయిలో యంత్రాలను వాడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలోనూ కృత్రిమ మేధ(ఏఐ) ప్రవేశించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. గత ప్రభుత్వాలతో పోలిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేసింది. గ్రామ స్థాయిలోనే రైతులకు యంత్ర పరికరాలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, రైతు కావాల్సిన రుణం, పంటల బీమా, సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి యువతను వ్యవసాయరంగం వైపు మళ్లించేందుకు వారికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నారు. పంట పొలాల్లో చీడపీడల నివారణకు పురుగు మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగించేలా యువతకు శిక్షణ ఇప్పిస్తున్నారు.

ఏఆర్‌పీసీ కోర్సులో శిక్షణ

వ్యవసాయ శాఖ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం సహకారంతో వ్యవసాయంలో డ్రోన్లు వినియోగించేలా గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. డీజీసీఏ ఆథరైజ్డ్ రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ అగ్రికల్చరల్ రిమోట్ పైలెట్ కోర్సును (ఏఆర్‌పీసీ) రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ యువతను గుర్తించి వారికి డ్రోన్ ఆపరేటింగ్ విధానంపై 12 రోజుల శిక్షణ ఇస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు 23 మంది డ్రోన్ పైలెట్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. 12 రోజుల వ్యవధి గల ఈ కోర్సులో డ్రోన్ ఆపరేటింగ్ చేసే విధానంపై థియరీ, ప్రాక్టికల్స్ చేయిస్తారు. ఈ కోర్సులో చేరిన వారికి నాలు గు రోజులు థియరీ క్లాసులు, రెండు రోజులు డ్రోన్ అసెంబ్లింగ్, మరమ్మతులు, నిర్వహణ, ఆరు రోజులపాటు డ్రోన్ ఆపరేటింగ్‌పై క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తారు. కోర్సు పూర్తిగానే ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం సర్టిఫికెట్లు ప్రదానం చేస్తోంది. ఇప్పటి వరకు తొమ్మిది బ్యాచ్‌లకు ప్రభుత్వం ఉచిత శిక్షణనిచ్చింది. కోర్సు పూర్తి చేసిన వారందరికీ 40 శాతం సబ్సిడీపై డ్రోన్లు అందజేస్తారు. రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానం చేసి రైతుల పంట పొలాలకు అవసరమైన పురుగు మందులను వారితో పిచికారీ చేస్తారు.

ప్రయోజనాలు ఇవీ..

వ్యవసాయ రంగంలో రాను రాను కూలీల కొరత ఏర్పడుతోంది. విద్యావకాశాలు పెరగడం వల్ల వ్యవసాయం చేసేవారి సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. పురుగు మందులు పిచికారీకి స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు వాడే క్రమంలో ఎంతో మంది అనారోగ్యం బారిన, కొందరు మృత్యువాత పడుతున్నారు. ఈ డ్రోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణానికి మందులు పిచికారీ చేసే అవకాశం ఏర్పడింది. డ్రోన్ వినియోగించి పురుగు మందులు పిచికారీ చేస్తే ప్రమాదాలు సంభవించవు. ఒకే సమయంలో సమీపంలోని అన్ని పంట పొలాలకు మందు పిచికారీ చేయడం వలన చీడ పీడలు నివారణ సాధ్యమైంది. ప్రస్తుతం కొందరు ప్రైవేటు వ్యక్తులు పురుగు మందులు స్ప్రే చేసేందుకు డ్రోన్లను వాడుతున్నారు. శిక్షణ పొందిన ఈ పైలెట్లు వద్ద డ్రోన్లు అందుబాటులోకి వస్తే పూర్తిగా రైతులంతా డ్రోన్ల సహాయంతోనే మందులు పిచికారీ చేయించొచ్చు.

ఉచితంగా శిక్షణ పొందాను



సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. వ్యవసాయం అంటే మక్కువ. ఈ ప్రభుత్వం ఉచితంగా డ్రోన్ పైలెట్ శిక్షణ ఇస్తోందని తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో ఉచితంగా వసతి, భోజనం సౌకర్యం కల్పించారు. 9వ బ్యాచ్‌లో కోర్సు పూర్తి చేశాను. డ్రోన్ ఆపరేటింగ్, మందుల పిచారీపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. డ్రోన్‌కు సంబంధించి పలు అంశాలపై అవగాహన ఏర్పడింది. సబ్సిడీపై ప్రభుత్వం డ్రోన్లు అందిస్తోంది. అవి రాగానే గ్రామంలోనే వ్యవసాయ రైతులకు ఉపయోగపడతాను.

– శీలం సీతారామిరెడ్డి, తిరువూరు

రాబోయే కాలమంతా డ్రోన్లదే



రాబోయే కాలమంతా డ్రోన్లదే. రైతులకు డ్రోన్లు ఎంతో మేలు చేస్తాయి. వృథా ఖర్చును నివారిస్తాయి. సమయం ఆదా అవుతుంది. ఐదు నిమిషాల్లో ఎకరం పొలానికి మందులు పిచికారీ చేయొచ్చు. సకాలంలో చీడ పీడల నివారణ జరిగి దిగుబడి పెరుగుతుంది. శిక్షణలో పురుగు మందులు పిచికారీ, సర్వేపై అవగాహన కల్పించారు. డ్రోన్లు సహాయంతో పొలంలో దిగకుండానే మందులు పిచికారీ చేయొచ్చు. బయట ఈ కోర్సు చేయాలంటే రూ.45 వేలు ఖర్చవుతుంది. ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్, లైసెన్స్ అందజేసింది.

– గుగులోతు అశోక్, పొందుగల తండా

9 నుంచి వసంత నవరాత్రోత్సవాలు

తెల్లవారుజామున స్నపనాభిషేకం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఏప్రిల్ 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాలలో ప్రతి రోజు అమ్మవారికి విశేష పుష్పార్చన జరుగుతుంది. 9వ తేదీన శ్రీక్రోధినామ సంవత్సరాదిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉగాది పర్వదినాన్ని నిర్వహిస్తారు. ఉగాదిని పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవమూర్తులకు, ఉపాలయాల్లో దేవతామూర్తులకు తెల్లవారుజామున స్నపనాభిషేకం, విశేష అలంకరణ, నిత్యపూజల అనంతరం ఉదయం 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం, సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులకు వెండి రథోత్సవం జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహామండప నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుంది.

పూల వివరాలివే..

వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పూలతో అర్చన జరుగుతుంది. రోజుకు 50 కిలోల పుష్పాలను అమ్మవారి అర్చనకు వినియోగిస్తారు. అమ్మవారి అర్చనకు నిర్వహించే పుష్పాలను ఉభయదాతలు, భక్తులు దేవస్థానానికి విరాళంగా అందజేయవచ్చు. 9వ తేదీ మంగళవారం మల్లెపూలు, మరువంతో అర్చన, 10వ తేదీ బుధవారం కనకాంబరాలు, గులాబీలతో అర్చన, 11వ తేదీ గురువారం చామంతి, ఇతర పుష్పాలతో అర్చన, 12వ తేదీ శుక్రవారం మందార పూలు, ఎర్ర కలువ పూలతో అర్చన, 13వ తేదీ శనివారం తెల్లజిల్లేడు, మారేడు, తులసీ, మరువం, ధవళంతో అర్చన, 14వ తేదీ ఆదివారం కాగడా మల్లెలు, జాజులు, మరువంతో అర్చన, 15వ తేదీ సోమవారం ఎర్ర తామరలు, ఎర్ర గన్నేరు పూలు, సన్న జాజులు, 16వ తేదీ మంగళవారం చామంతి, సంపెంగలతో అర్చన, 17వ తేదీ బుధవారం కనకాంబరాలు, గులాబీలతో అర్చన, 18వ తేదీ గురువారం అన్ని రకాల పుష్పాలతో అర్చన జరుగుతుంది.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్యాంశాలు

కూచిపూడి(మొవ్వ): నాట్యాచార్యుల ఇలవేల్పు బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి 261వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని పురష్కరించుకుని నాట్యక్షేత్రం కూచిపూడిలో బుధవారం నిర్వహించిన కూచిపూడి నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. శ్రీ సిద్ధేంద్రయోగి కళావేదికపై నిర్వహించిన కార్యక్రమాలను ఎస్‌బీఐ కూచిపూడి శాఖ మేనేజర్ పాల లోభనాచారి, నాట్యాచార్యులు కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, పసుమర్తి రత్తయ్య శర్మ, మాజీ ఎంపీటీసీ కావూరి భాను మూర్తి, ఏలేశ్వరపు హనుమంతరావు, పసుమర్తి నారాయణ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ముందుగా హైదరాబాద్‌కు చెందిన రాధాకృష్ణ కూచిపూడి నృత్యాలయానికి చెందిన మాదల కృష్ణప్రియ శిష్యబృందం, ఓలేటి శ్రీ రేఖ శిష్య బృందం, రాధాకృష్ణ కూచిపూడి నృత్యాలయానికి చెందిన మాదల కృష్ణప్రియ శిష్యబృందం, ఎస్‌కేఎస్ కళాక్షేత్రం డాక్టర్ ఎస్‌సీ కృష్ణకుమారి శిష్య బృందం, శ్రీ సిద్ధేంద్రయోగి కళానివాసం వైజాగ్‌కు చెందిన సత్యభాను శిష్యురాలు వై. యామిని తమ ప్రదర్శనలు ఇచ్చి అలరించారు. చివరిగా శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్ వేదాంతం రామలింగ శాస్త్రి శిష్య బృందం కూచిపూడి నాట్యాంశాలు ప్రదర్శించారు.



ఓలేటి శ్రీరేఖ శిష్య బృందం

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

23బైక్‌లు, రూ.18వేలు నగదు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): కోడి పందేల శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ మాట్లాడుతూ మండలంలోని బలుసుపాడు జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోని అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో జగ్గయ్యపేట ఎస్‌ఐ పద్మారావు ప్రత్యేక సిబ్బందితో దాడిచేసి ఏడుగురు వ్యక్తులతోపాటు 23 ద్విచక్ర వాహనాలు, నాలుగు కోళ్లు, రూ. 18 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కూచిపూడి, చెరువు మాధవరం ప్రాంతాలకు చెందిన వారున్నారన్నారు. మరో పదిమంది పరారీలో ఉన్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

జీవనశైలి.. పర్యావరణహితం

- అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి
- రోజువారీ జీవితాల్లో సులభమైన పర్యావరణ చర్యలు
- ఏడు కేటగిరీల్లో సమగ్రమైన వ్యక్తిగత లైఫ్ కార్యక్రమాల జాబితా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆరోగ్యకరమైన పర్యావరణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిని పర్యావరణ హితంగా ఉండాలని సూచించింది. పర్యావరణానికి హాని జరగకుండా ఎలా వ్యవహరించాలనే అంశంపై పలు సూచనలు చేసింది. ప్రజల రోజువారీ జీవితంలో సులభమైన, పర్యావరణ హితమైన చర్యలు అవలంభించేలా, వారిని మేల్కొలిపి, మార్పు తీసుకొచ్చేందుకు మిషన్ లైఫ్‌పై దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఏడు కేటగిరీల్లో సమగ్రమైన 75 వ్యక్తిగత లైఫ్ కార్యక్రమాల జాబితాపై కాలుష్య నియంత్రణ మండలి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. వాటిలో అర్థం చేసుకుని ఆచరించదగినవీ, వ్యక్తులు, సమూహాలు, సంస్థలు ఆచరించేందుకు సులభమైనవి, ఆర్థిక కార్యకలాపాలకు ఆటంకం కానివి, సమీప భవిష్యత్తులో ఆర్థిక కార్యకలాపాలకు తోడ్పాటు అందించే వాటిని రూపొందించింది.



ఆ కార్యక్రమాల జాబితా ఇలా..
- ఏకకాలంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి.
- ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా షాపింగ్ కోసం క్లాత్ బ్యాగులు వాడాలి.
- సాధ్యమైనంత వరకు సొంత వాటర్ బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- స్టోరేజ్ బాక్స్‌లుగా గ్లాస్ కంటెయినర్స్, ప్యాకేజింగ్ ప్లాస్టిక్ ఐటమ్స్ తిరిగి ఉపయోగించాలి.

స్వచ్ఛత కార్యకలాపాలు ఇలా..
- బయోగ్యాస్ ప్లాంట్ కోసం పశు వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించాలి.
- ఇళ్లలో తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం అలవాటు చేసుకోవాలి.
- పాత వార్తా పత్రికలు, మ్యాగజైన్‌లను రీసైక్లింగ్ చేసి తిరిగి ఉపయోగించాలి.
- డబుల్ సైడ్ ప్రింటింగ్‌కు ప్రింటర్‌ను అనువుగా ఏర్పాటు చేసుకోవాలి.
- పాత ఫర్నిచర్‌కు మరమ్మతులు చేసి, తిరిగి ఉపయోగించాలి.
- పాత పుస్తకాలు, వస్త్రాలను దానం చేయాలి.
- రీ సైకిల్ చేసిన పేపర్ నుంచి తయారైన పేపర్ ప్రొడక్ట్స్ కొనుగోలు చేయాలి.

- జన సమీకరణ, వేడుకల సమయంలో నాన్ ప్లాస్టిక్ ఎకో ఫ్రెండ్లీ కట్లెరి ఉపయోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- పాలు, పెరుగు వంటి వాటికోసం ఉపయోగించే ప్యాకేజింగ్ బ్యాగులను పాక్షికంగా కత్తిరించి, తద్వారా బయోడిగ్రేడబుల్ వ్యర్థాల్లో కలవడం నుంచి ప్లాస్టిక్ బిట్స్‌ను అరికట్టలి.

ఆహార విధానాలను ఎంచుకోవడం ఇలా..
- అంగన్‌వాడీ మధ్యాహ్న భోజనం, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ పథకం ద్వారా ఆహారాల్లో చిరు ధాన్యాలను చేర్చాలి.
- ఇంట్లో ఆహార వ్యర్థాలను ఎరువుగా, కంపోస్టుగా ఉపయోగించాలి.
- ఇళ్లు, పాఠశాలలు, ఆఫీసుల్లో కిచెన్ గార్డెన్స్, టెర్రస్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలి.
- అందుబాటులో ఉన్న, సీజన్‌లో దొరికే ఆహారాలను ఎంచుకోవాలి.
- ఆహార వ్యర్థాలను పొదుపు చేసేందుకు రోజువారీ భోజనంలో చిన్న చిన్న కంచాలను ఉపయోగించాలి.

ఆరోగ్యకరమైన జీవనశైలి ఇలా..
- ఆరోగ్యం కోసం భోజనంలో చిరు ధాన్యాలు, దేశీయంగా పండే వనమూలికలు, ఔషధ మొక్కలను ప్రోత్సహించాలి.
- సహజమైన, ఆర్గానిక్ ఉత్పత్తులను వినియోగించాలి.
- సమాజ స్థాయిలో బయోడైవర్‌సిటీ కంజర్వేషన్ ప్రారంభించాలి.
- సేంద్రియ, సహజ వ్యవసాయం అలవర్చుకోవాలి.
- కాలుష్య ప్రభావం పడకుండా, దానిని తగ్గించేందుకు మొక్కలను నాటాలి.

ఈ- వ్యర్థాలను తగ్గించడం ఇలా..
- పనిచేయకుండా ఆగిపోయిన ఎలక్ట్రానిక్ డివైజ్‌లను పడేయకుండా మరమ్మతులు చేసి తిరిగి ఉపయోగించాలి.
- సమీపంలోని ఈ-రీసైక్లింగ్ యూనిట్లకు గాడ్జెట్స్ అప్పగించాలి.
- రీ చార్జిబుల్ లిథియం సెల్స్ ఉపయోగించాలి.
- పెన్‌డ్రైవ్, హార్డ్ డ్రైవ్‌లో క్లౌడ్ స్టోరేజ్ ఎంచుకోవాలి

ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం



ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలితో పాటు, పలు శాఖల సమన్వయంతో కృషి చేస్తూ ఆయా అంశాలపై ప్రజలను చైతన్య పరుస్తున్నాం. పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు, ఆరోగ్యకరమైన అలవాట్లు, జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నాం. ఆ దిశగా నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నాం.
– పి.శ్రీనివాసరావు, పర్యావరణ ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలి

విద్యుత్ ఆదా ఇలా..
- ఎల్‌ఈడీ బల్బ్‌లు, ట్యూబ్ లైట్లను వాడాలి.
- సాధ్యమైనంత వరకూ ప్రజారవాణానే వినియోగించాలి.
- ఎలివేటర్‌కు బదులుగా మెట్లను వాడటం మంచిది.
- సిగ్నల్స్ వద్ద రెడ్‌లైట్స్ పడినప్పుడు, రైల్వే క్రాసింగ్స్ వద్ద వాహనాల ఇంజిన్‌ను ఆఫ్ చేయాలి.
- తక్కువ దూరం గల ప్రయాణానికి సైకిల్ వినియోగించాలి.
- ఉపయోగించిన తర్వాత ఇరిగేషన్ పంపుల స్విచ్ ఆఫ్ చేయాలి.
- పెట్రోలు, డీజిల్ వాహనాలకు బదులుగా సీఎన్‌జీ/ఈవీ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- స్నేహితులు, సహోద్యోగులు కార్ పూలింగ్ విధానాన్ని పాటించాలి.
- సరైన గేరులో డ్రైవ్ చేయడం, గేర్లు మార్చినప్పుడు క్లచ్‌పై నుంచి కాలుని తీసేయడం చేయాలి.
- ఇంటిపై కప్పు మీద సోలార్, సోలార్ కుక్కర్ హీటర్ పెట్టుకోవాలి.
- వంటకోసం, విద్యుత్ అవసరాల కోసం బయోగ్యాస్‌ను ఉపయోగించాలి.
- ఏసీల టెంపరేచర్ 24 డిగ్రీలు ఉండేట్లు చూసుకోవాలి.
- ట్రెడ్‌మిల్స్ బదులుగా ఆరు బయట పరిగెత్తడం ఉత్తమం.
- క్రమం తప్పకుండా ఫ్రిడ్జ్, ఫ్రీజర్‌ను డీఫ్రాస్ట్ చేయాలి.

నీటి ఆదా ఇలా..
- తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలపై దృష్టి సారించాలి.
- వరి, గోధుమ సాగు నుంచి పప్పు దినుసులు, నూనె గింజల సాగుకు మారాలి.
- నీటి పొదుపు, సాంకేతిక విధానాలు పాటించాలి.
- ఇళ్లు, పాఠశాలలు, కార్యాలయాల్లో నీటి ఇంకుడు గుంతల మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- వ్యర్థ మెటీరియళ్లతో సాధ్యమైనంత వరకూ డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్స్ ఉపయోగించాలి.

ప్రముఖ బుద్ధిస్టు చంద్రశేఖర్ మృతి

బందరు మెడికల్ కళాశాలకు పార్థివదేహం

కోనేరుసెంటర్: ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన ప్రముఖ బుద్ధిస్టు, రచయిత దేవన చంద్రశేఖర్ మృతదేహాన్ని ఆయన కోరిక మేరకు బుధవారం కుటుంబ సభ్యులు మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు. వేటపాలెంకు చెందిన చంద్రశేఖర్ మంగళవారం హైదరాబాద్‌లో మరణించారు. ఆయన కోరిక మేరకు కుటుంబసభ్యులు పార్థివదేహాన్ని అమ్మ ట్రస్టు వారి సహాయంతో మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలోని అనాటమీ విభాగానికి అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ కుటుంబసభ్యులు, స్నేహితులు, శిష్యులు, పలువురు బుద్ధిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చంద్రశేఖర్ శిష్యుడు వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి చంద్రశేఖర్ పార్థివదేహానికి నివాళులు అర్పించి ఆయన జ్ఞాపకార్థం మచిలీపట్నం వైద్య కళాశాలకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. లక్ష రూపాయలపై వచ్చే వడ్డీతో ఏటా మెడిసిన్ చదువుకునే విద్యార్థుల్లో అనాటమీకి సంబంధించి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతిగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఆశాలత, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ అనూష, అనాటమీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అందజేస్తున్న కుటుంబసభ్యులు

కబడ్డీ రాష్ట్ర జట్టు ఎంపిక



రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

విజయవాడస్పోర్ట్స్: జాతీయ 70వ సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన బి.శశికుమార్, కె.శ్రీకాంత్, కె.హరిప్రసాద్‌రెడ్డి, పి.వెంకటదుర్గారావు, జి.పవన్‌కుమార్, టి.కె.సీతారామతేజ, జి.లక్ష్మారెడ్డి, పి.శ్రీశివతేజస్, యు.చంగలరావు, సి.హెచ్.నాగబాబు, వి.ఇమ్మానియేల్, పి.గోపిచంద్ ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



ఉంగుటూరు: విజయవాడ-ఏలూరు రైల్వే మార్గంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తేలప్రోలు వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలు రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియన వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని కీమ్యాన్ గుర్తించారు. కీమాన్ సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35-40 వయసు కలిగిన పురుషుడిగా గుర్తించారు. మృతుడు నీలం, ఎరుపు రంగు పూల డిజైన్ కలిగిన తెలుపు చొక్కా, నీలం రంగు లుంగి, తెలుపు, కుంకుమ రంగు టవల్ కలిగి ఉన్నాడు. కుడి చేతిపై అమ్మ అను అనే అక్షరాలతో పచ్చబొట్టు ఉంది. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ సంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8074055378లో సంప్రదించాలని సూచించారు.

భద్రంగా జర్నలిస్టుల ఇళ్లస్థలాల దరఖాస్తులు

డీపీఆర్‌వో వెంకటేశ్వరప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): జర్నలిస్టుల ఇళ్లస్థలాల ఫైలు, దరఖాస్తులు డీఐపీఆర్వో కార్యాలయంలో భద్రంగా ఉన్నాయని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెత్తబుట్టలో పాత్రికేయుల ఇళ్లస్థలాల ఫైల్, మినిట్స్ పత్రాలు అంటూ మంగళవారం వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాల కేటాయింపునకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ 2024 ఫిబ్రవరి 17వ తేదీన సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన మినిట్స్ కలెక్టర్ పి. రాజాబాబు ఆమోదించారన్నారు. రిజిస్టర్ మాత్రమే కార్యాలయంలో కనిపించకపోవటంతో దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. జర్నలిస్టుల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఉన్నాయని వీటితో పాటు జర్నలిస్టుల నుంచి రెండు ప్రతులు దరఖాస్తులు స్వీకరించి ఒక ప్రతి సంబంధిత ఆర్డీవో కార్యాలయానికి పంపగా, రెండో ప్రతి దరఖాస్తులు తమ కార్యాలయంలో భద్రంగా ఉన్నాయని వివరించారు.

మోడ్రన్ ఖోఖో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా అప్పలస్వామి, ప్రసాద్



అప్పలస్వామి



ప్రసాద్

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రదేశ్ మోడ్రన్ ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయవాడకు చెందిన ఆర్.అప్పలస్వామి, కార్యదర్శిగా ఆర్‌డీ ప్రసాద్ నియమితులయ్యారు. ఇటీవల గోవాలో ఫెడరేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ సంఘ బాధ్యతలను ఫెడరేషన్ బృందం వీరికి అప్పగించింది. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సంఘాలను ఏర్పాటు చేస్తామని, మోడ్రన్ ఖోఖో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం జరిగే స్కూల్ గేమ్స్‌లో మోడ్రన్ ఖోఖోకు చోటు దక్కుతుందన్నారు.

అది దళిత వ్యతిరేక సభ

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు

మచిలీపట్నంటౌన్: ఇటీవల ఎన్డీయే ఆధ్వర్యంలో చిలకలూరిపేట వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్తంగా నిర్వహించిన ప్రజాగళం సభ దళిత వ్యతిరేక సభ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం కృష్ణాజిల్లా మచిలీపట్నం వచ్చిన ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభావేదికపై 30 మంది ఉంటే వారిలో ఎక్కువ మంది చంద్రబాబునాయుడు సామాజికవర్గానికి చెందిన వారే తప్ప ఇతర కులాల వారికి ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. స్టేజ్ పైకి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అవకాశమే కల్పించలేదన్నారు. చంద్రబాబుకు భజన చేసే ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్యను సైతం వేదికపైకి పిలవకపోవటం దుర్మార్గమన్నారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఏ విధమైన ప్రకటన చేయని ఈ కూటమి ఓటమి పాలయ్యేందుకు ప్రతి దళితుడు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ సంభోదిస్తూ ఆయా వర్గాలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ, బీర సురేష్‌బాబు, వి. సునీల్, బి. సందీప్, సీహెచ్ గోపి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు

ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

- కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే, ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలు ముందస్తు అనుమతి ఇవ్వటంతో పాటు చెల్లింపు వార్తలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. మీడియా ఉల్లంఘనలను కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందని వివరించారు.

గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు లేదా వాటి తరఫున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి పొందటం కోసం నిర్ణీత నమూనాలో ప్రకటన ప్రసారం చేసే మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు ప్రకటనలు ప్రసారం చేసేందుకు ఏడు రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు. వార్తా పత్రికల్లో పోలింగ్ రోజు, ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ చానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్ డిస్ ప్లేలు, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు వస్తాయని, సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్, వికీపీడియా కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయని స్పష్టంచేశారు. సినిమా థియేటర్లు, ప్రైవేట్ ఎఫ్ఎం రేడియోలు, ఎలక్ట్రానిక్ పత్రికలు ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పనిసరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాల్సి ఉందన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ నంబర్‌ను సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలుగా ప్రకటించి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు.



కలెక్టర్ రాజాబాబు

క్లుప్తంగా

పట్టణ ఆరోగ్య కేంద్రాలు సందర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం నగరంలోని కంఢ్రిక, ప్రకాష్‌నగర్, వాంబేకాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న ఇమ్యునైజేషన్‌ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ మహేశ్వరరావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పెనమలూరు: కానూరు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయ 6వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా చేశారు. కల్యాణోత్సవం అనంతరం రాత్రి స్వామివార్లను గరుడ వాహనంపై గ్రామంలో గ్రామోత్సవం చేశారు. కాగా బుధవారం ఆలయంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, అన్నే సుజాత ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మధ్యాహ్నం భక్తులు 6 వేల మందికి మంత్రి జోగి రమేష్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజక వర్గ కన్వీనర్ దేవినేని అవినాష్ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ తాడిగడప నగర అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, పిడికిటి రామకోటేశ్వరరావు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఫెడరల్ బ్యాంక్ ద్వారా మెరుగైన సేవలు



పెనమలూరు: ఫెడరల్ బ్యాంక్ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ జయశేఖర్ రెడ్డి అన్నారు. కానూరులో ఫెడరల్ బ్యాంకు శాఖ, ప్రాంతీయ కార్యాలయం, ఫెడరల్‌స్కిల్ అకాడమీని నాగార్జున ఆస్పత్రి ఎండీ కొడాలి జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న జయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్నిరకాల రుణాలు తక్కువ వడ్డీకి ఇస్తామన్నారు. నైపుణ్య శిక్షణ, ఉపాధి అందించటానికి ఫెడరల్ స్కిల్ అకాడమీ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విట్ వైస్ చాన్సలర్ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్, బ్యాంక్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ షాలినివారియర్, జోనల్ హెడ్ దిలీప్, బ్యాంక్ మేనేజర్ కిరణ్ తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలకు సెలవులు ప్రకటించాలని వినతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, అఫిలియేటెడ్ డిగ్రీ కళాశాలలకు మే ఒకటో తేదీ నుంచి రెండు నెలలు వేసవి సెలవులు ప్రకటించాలంటూ బుధవారం జీసీజీటీఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్, జీసీటీఏ నాయకులు లలితారెడ్డి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లకు వినతి పత్ర అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వారు విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు జారీ చేసిన అధికారిక అకడమిక్ క్యాలెండర్ ప్రకారం రెండు నెలల వేసవి సెలవులను రాష్ట్రంలోని యూనివర్సిటీలు ప్రకటించాల్సి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ వంటి పెద్ద కళాశాలలో రీసెర్చ్ సెంటర్లను అవసరమైన సబ్జెక్టులకు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాముడు, ముప్పా పద్మనాభం, జి. లుముంబా తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్ డాక్టర్ కె. శోభన బాబుకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం..

- కృష్ణమ్మ జల విహారం పార్కుకు సందర్శకుల తాకిడి
- మానసికోల్లాసం కోసం విచ్చేస్తున్న వైనం
- ఒత్తిళ్లను అధిగమించేందుకు దోహదం
- వ్యాయామం కోసం ఓపెన్ జిమ్‌ను ఆశ్రయిస్తున్న ప్రజలు



పార్కులో సందర్శకుల తాకిడి

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఉరుకులు పరుగుల జీవన విధానంలో సిటీ లైఫ్ గజిబిజి గందరగోళంగా మారింది. విధి నిర్వహణలో, నగరంలోని ట్రాఫిక్‌లో ప్రయాణం ఇలా ప్రతి ఒక్కరూ తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు. అలాంటి జీవనం నుంచి బయట పడేందుకు ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వీకెండ్స్‌లో దూర ప్రాంతాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని ప్రదేశాల్లో గడిపేవారు. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా, నగరంలోనే నందన వనం లాంటి పార్కు అందుబాటులోకి వచ్చింది. కృష్ణానదీ తీరాన ఏర్పాటు చేసిన కృష్ణమ్మ జలవిహారం పార్కు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటుంది. వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పిల్లల కోసం ఆటపరికరాలు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు పార్కుకు వెళ్లాలంటే నగరంలో రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి వాటికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కృష్ణమ్మ నదీ తీరాన ఏర్పాట్లు చేసిన పార్కును ఆశ్రయిస్తున్నారు.

ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు....

ఒకవైపు కృష్ణానది నుంచి వీచే చల్లటి గాలులు, ఆహ్లాదం కలిగించే రకరకాల మొక్కలు పెంచుతున్నారు. ఒకసారి పార్కును సందర్శించిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా తీర్చిదిద్దారు. వాకింగ్, ఓపెన్‌జిమ్‌లో వ్యాయామంతో మానసికోల్లాసం పొందేలా రూపొందించారు. ఇప్పుడు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో అక్కడికి తరలివస్తున్నారు. వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

కుటుంబ సమేతంగా,..

నగర జీవికి శారీరక శ్రమ లేక పోవడంతో ఎక్కువుగా జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారు. వాటి నుంచి బయట పడేందుకు వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వ్యాయామం చేయాలంటే జిమ్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే వాకింగ్ ట్రాక్ ఉన్న గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నగరంలోని అన్ని కాలనీల్లో పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటికి తోడు ఇప్పుడు కృష్ణమ్మ జల విహారం పార్కు అందరినీ ఆకట్టుకుంటుంది. వాకింగ్ ట్రాక్‌లతో పాటు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భార్యాభర్తలతో పాటు, తమ పిల్లలను తీసుకుని పార్కులకు వచ్చి వ్యాయామం చేస్తున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. మరోవైపు వృద్ధులు సైతం మానసికోల్లాసం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.

నగరానికే ఐకాన్‌లా పార్కు



కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన కృష్ణమ్మ జలవిహారం పార్కు అందరినీ ఆకట్టుకుంటుంది. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సందర్శకులు పార్కుకు వస్తున్నారు. రాత్రి వేళల్లో కూడా పార్కులో కాసేపు సేద తీరేందుకు వీలుగా లైటింగ్ ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇది నగరానికే ఐకాన్‌లో నిలుస్తుంది.

– కనగోని దుర్గారావు, కృష్ణలంక

మానసికంగా చాలా ఉపయోగం



బిజీలైఫ్ నుంచి బయట పడేందుకు వాకింగ్ చాలా అవసరం. పచ్చని మొక్కలు చూస్తూ వాకింగ్ చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటు, మెమరీ పెరుగుతుంది. ఉదయం సాయంత్రం వేళల్లో పచ్చని మొక్కల మధ్య వాకింగ్‌తో స్వచ్ఛమైన ఆక్సిజన్ బ్రెయిన్‌కు అందుతుంది. నదీ తీరాన ఏర్పాటు చేసిన పార్కు సందర్శనతో మానసికోల్లాసం పొందవచ్చు. ఉదయం వేళ వాకింగ్‌తో విటమిన్ డి లభిస్తుంది. ఎముకల పటుత్వంతో పాటు, హ్యాపీ హార్మోన్ రిలీజ్ అవుతుంది.

–డాక్టర్ గర్రే శంకరరావు, మానసిక విశ్లేషకులు



పిల్లలు ఆడుకుంటున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న సింహం రూపం

పవిత్రమైనది రంజాన్ మాసం



ఇఫ్తార్ విందులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు):ముస్లింలకు రంజాన్ మాసం పవిత్రమైనదని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లోని మస్జిద్ ఈ దారుసలామ్‌లో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటారన్నారు. రంజాన్ పండుగ వెనుక మానవాళికి మంచి చేసే ఉద్దేశం ఉందని చెప్పారు. అది క్రమశిక్షణను, దాతృత్వాన్ని, ధార్మిక చింతనను ప్రజలకు బోధిస్తుందన్నారు. ఉపవాస దీక్ష ముగిసిన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం గొప్ప పుణ్యకార్యమన్నారు. ముస్లింల మత గ్రంథమైన ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని పేర్కొన్నారు. అందుకే ఈ మాసాన్ని ముస్లింలు అతి పవిత్రంగా ఉపవాస దీక్షలు చేస్తుంటారని తెలిపారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, మస్జిద్ కమిటీ సభ్యులు బాజిద్, కాశిం పీరా, హాసన్ బేగ్, నాగులు తాజుద్దీన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు రిజ్వాన్, చోటు, కాశి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తన కుమారుడు అదృశ్యమయ్యాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు 100 అడుగుల రోడ్డులో కె.లావణ్య, భర్త నాగరాజు ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటోంది. ఆమె ఇళ్లల్లో పనులు చేస్తోంది. కాగా ఈ నెల 16వ తేదీన ఆమె కుమారుడు కె.సతీష్(15) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో సతీష్ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తూర్పులో వైఎస్సార్ సీపీ జెండాదే విజయం

విజయవాడ ఎంపీ కేశినేని నాని



సంక్షేమ పథకాల అమలు గురించి మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, అవినాష్ తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాదే విజయమని విజయవాడ ఎంపీ కేశినేని నాని తెలిపారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో బుధవారం ఎంపీ నాని, దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ 25 వేల ఓట్ల మెజార్టీతో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ విజయం సాధిస్తారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి చేశారని తెలిపారు. 15వ డివిజన్‌ను దత్తత తీసుకున్న గద్దె రామ్మోహన్ చిన్న పని కూడా చేయలేదన్నారు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అభివృద్ధి ఊసే లేదన్నారు. గద్దె అసమర్థుడని ధ్వజమెత్తారు. గతంలో గన్నవరం నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా గెలుపొందాడని, అయితే అక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. విజయవాడ ఎంపీగా పనిచేసినప్పుడు సైతం విజయవాడ ప్రాంతంలో ప్రజలకు ఒక మంచి పని కూడా చేయలేదని విమర్శించారు. దేవినేని అవినాష్ తూర్పులో రూ.650 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. అవినాష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే గతం కంటే పది రెట్లు అభివృద్ధి చేస్తారన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని అవినాష్ తెలిపారు. 15వ డివిజన్‌లో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలు ఆదరాభిమానాలు చూపుతున్నారన్నారు. అణగారిన వర్గాలకు భరోసా కల్పించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, డాక్టర్ నూరి పర్వీన్, బాలాజీ, భుజింగరావు, షమ్మీ, నర్సారావు, భాను, అబ్బు, చిన్నా, బలరాంరెడ్డి, రవి, బాబీ, సత్యనారాయణ, నాయుడు పాల్గొన్నారు.

అవినాష్ గెలుపునకు బీసీలంతా పనిచేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య చిత్రంలో అవినాష్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవినేని అవినాష్ గెలుపు కోసం బీసీలంతా పనిచేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఇన్‌చార్జిగా ఉంటూనే రూ. వందలకోట్లుతో అవినాష్ అభివృద్ధి చేశారని చెప్పారు. అవినాష్ ఇక్కడ పడుతున్న కష్టం చూసి ఆశ్చర్యపోయానన్నారు. గొప్ప మెజారిటీతో అవినాష్‌ని గెలిపించాలని కోరారు. లోటు బడ్జెట్ రాష్ట్రాన్ని వైఎస్ జగన్ విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసేవారికి అండగా ఉండాలన్నారు. అనంతరం దేవినేని అవినాష్ మాట్లాడుతూ బీసీల కోసం ఆర్. కృష్ణయ్య ఎన్నో పోరాటాలు చేశారన్నారు. గతంలో అనేక పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయని, కానీ వైఎస్ జగన్ బ్యాక్‌బోన్‌క్యాస్ట్‌గా మార్చారన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ పదవులు, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు, రాజ్యసభ సభ్యులుగా ఎంపిక చేసి బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు బీసీలను దుర్భాషలాడారని ధ్వజమెత్తారు. టీడీపీ మీడియా, సోషల్ మీడియాలో ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా ప్రజలు జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. జిల్లాలో బీసీలకు మంత్రి పదవి ఇచ్చి, దుర్గగుడి చైర్మన్ కూడా ఇచ్చాన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మోదీతో పొత్తు పెట్టుకున్నట్లు చెబుతున్న చంద్రబాబు, అసలు నిజం ఏమిటంటే అక్రమ కేసుల నుంచి బయట పడటం, ఆస్తులు కాపాడుకోవడం, లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడం కోసమే రాజకీయాలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. పెత్తందారులకు అవకాశం ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. తూర్పుని రూ.650 కోట్లుతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్ వియ్యపు అమర్నాథ్, జోగారావు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్ఎంసీ పాఠశాలను తనిఖీ చేసిన డీసీపీ



పరీక్ష కేంద్రం అధికారి రమేష్‌కు సూచనలు చేస్తున్న డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా

కృష్ణలంక(విజయవాడతూర్పు):జిల్లాలోని పదో తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. నగరంలోని పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ (ఏపీఎస్ఆర్ ఎంసీ) పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ అధికారులకు, పరీక్షా కేంద్రాల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 178 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఐపీఎస్ స్థాయి అధికారులు పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎ.మురళీకృష్ణ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



పెనమలూరు: ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోని వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కానూరు వీఆర్ సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. తాడిగడపలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఓటు హక్కుపై బుధవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ కొత్త ఓట్లు నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు ఇచ్చిందన్నారు. 18 ఏళ్లు నిండి ఓటు లేని వారు తమ ఓటును వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

భవిష్యత్తు అంతా నానో టెక్నాలజీదే

సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ బీఎల్వీ ప్రసాద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీఎల్వీ ప్రసాద్, చిత్రంలో డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):భవిష్యత్తు అంతా నానో టెక్నాలజీదేనని, ఈ టెక్నాలజీ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు కూడా అపారంగా ఉన్నాయని బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ బీఎల్వీ ప్రసాద్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్–ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. అతిథిగా ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి రంగంలోనూ నానో టెక్నాలజీ అవసరం ఉందన్నారు. ఇప్పటికే నానో టెక్నాలజీ ద్వారా పలు రంగాల్లో అభివృద్ధి సాధించామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని మార్పులు రానున్నాయని తెలిపారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా అపారంగా ఉన్నాయని పేర్కొన్నారు. సృజనాత్మకతను పెంచుకోవడం ద్వారా యువత వాటిని అందిపుచ్చుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ టాటా నరసింగరావు మరో అతిథిగా హాజరై మాట్లాడారు. నానో టెక్నాలజీలో ప్రతి రంగంలోనూ ఎంతో అవసరమన్నారు. యువత ఈ రంగంపై ఆసక్తి చూపితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ నానో టెక్నాలజీ రాకతో మనిషి జీవనం చాలా సౌకర్యవంతంగా మారిందన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎస్ కృష్ణ మాట్లాడుతూ నానో టెక్నాలజీ ఏవిధంగా ఉపయోగపడుతుందనే అంశాల గురించి వివరించారు. ఎస్.రాజశేఖర్, ముస్తారీన్, జె.పాండురంగారావు, ఎస్.విజయకృష్ణ, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మనోరంజని, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ ప్రసాదరావు, విశాలాక్ష్మి, నాగార్జున బాబు పాల్గొన్నారు.

క్రైమ్ థిల్లర్ మూవీ 'కలియుగం పట్టణంలో'

ఆ చిత్ర హీరో విశ్వ కార్తికేయ



మాట్లాడుతున్న హీరో విశ్వకార్తికేయ, నరేన్‌రామ్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 29న విడుదల కానున్న కలియుగం పట్టణంలో సినిమా క్రైమ్ థ్రిల్లర్, లవ్, మదర్ సెంటిమెంట్‌తో అందరినీ ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో విశ్వకార్తికేయ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విశ్వ కార్తికేయ మాట్లాడారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో తమ చిత్రం ప్రమోషన్‌ను ప్రారంభించామని తెలిపారు. కళాశాల విద్యార్థులతో చిత్ర విశేషాలు ముచ్చటించినట్లు చెప్పారు. వారి నుంచి వచ్చిన స్పందన ఎంతో సంతోషంగా ఉందన్నారు. బాలనటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించానన్నారు. ఎన్నో క్రైమ్ సినిమాలు వచ్చి ఉంటాయని, కానీ వాటన్నింటికీ విభిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు. ప్రేక్షకులు తప్పక ఆదరించాలన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా చిత్రాన్ని వీక్షించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సహ హీరో నరేన్‌రామ్ దర్శకుడు రమణ కాంత్ రెడ్డి, నిర్మాత మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

పెనమలూరు: బంగారు ఆభరణాలు చోరీ జరిగిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు జగనన్న కాలనీకి చెందిన చేకూరి సాయిదీప్తి కొద్ది రోజుల క్రితం యనమలకుదురులోని ఓ కల్యాణ మండపంలో తన కుమార్తె ఫంక్షన్ చేసింది. ఆ సమయంలో బంగారు ఆభరణాలు దాదాపు 7 తులాల వస్తువులు గదిలో పెట్టి మర్చి పోయింది. కొద్ది సమయం తరువాత వచ్చి చూసుకునే సరికి గదిలో బంగారు ఆభరణాలు కనబడలేదు. గదిలో ఆ సమయంలో మేకప్ చేయటానికి వచ్చిన యువతి ఉందని, పోలీసులు విచారించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు సాయిదీప్తి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నీటి సరఫరాకు మోటార్ల అందజేత



అంబాపురం(విజయవాడరూరల్): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ నైజం. అందులో ఆరు కాలం కష్టపడి పంటలను పండించే రైతులను ఆదుకోవడం అంటే ఆయన ముందుంటారు. ఈ ఏడాది దాళ్వా సీజనులో వరి పండిస్తున్న అంబాపురం, పి.నైనవరం గ్రామాలకు చెందిన రైతులు దాదాపు 758 ఎకరాల్లో వరి పంట సాగుచేస్తున్నారు. వరి పొలాలు పిలక దశలో ఉండగా, ఆ పొలాలకు సాగు నీరు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దిక్కుతోచని రైతులు ఇటీవల ఆ గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను కలిశారు. సహృదయంతో స్పందించిన వంశీమోహన్ వెంటనే తన సొంత నిధులతో ఆరు వంద హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లను రైతులకు అందజేశారు. గొల్లపూడి, జక్కంపూడి గ్రామాల సరిహద్దులో ఉన్న బుడమేరు నుంచి నీటిని పొలాలకు వినియోగించుకునే విధంగా మోటార్లు ఏర్పాటు చేశారు. నాయకులు చంద్రశేఖర్, బెంజిమెన్‌లు విద్యుత్‌శాఖ అధికారుల సహకారంతో బుధవారం తెల్లవారు జామున మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు.

తెలంగాణ

ఏపీలో అద్భుతంగా సామాజిక న్యాయం

జగన్‌ను చూసి నేర్చుకోవాలని సీఎం రేవంత్‌కు వంగపల్లి సలహా

ముషీరాబాద్ (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సామాజిక న్యాయం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం విషయంలో అక్కడి సీఎం వైఎస్ జగన్‌ను చూసి నేర్చుకోవాలని సలహా ఇచ్చారు. వైఎస్ జగన్ ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లలో 50 శాతానికి పైగా బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు కేటాయించి ఔరా అనిపించుకున్నారని ప్రశంసించారు. 2019తో పోలిస్తే అత్యధికంగా బీసీలకు 48, ఎస్సీలకు 29, ఎస్టీలకు ఏడు, మహిళలకు 19 టికెట్లు కేటాయించారని కొనియాడారు. రెండు రోజుల క్రితం రేవంత్‌రెడ్డి 37 కార్పొరేషన్ల చైర్మన్‌లను ప్రకటిస్తే 17 అగ్రకులాలకు ఇచ్చారని, 50 శాతం ఉన్న బీసీలకు కేవలం 13, 12 శాతం ఉన్న ఎస్టీలకు మూడు, 20 శాతం ఉన్న ఎస్సీలకు కేవలం ఒకే ఒక్క చైర్మన్ పదవిని ఇచ్చారని తెలిపారు. దీన్ని బట్టే తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం కేవలం మాటలకు మాత్రమే పరిమితం అని అర్థమవుతోందన్నారు. రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు.

సౌత్ గ్రూప్, కిక్‌బ్యాక్‌లపై ప్రశ్నలు

నాలుగోరోజూ కవితను విచారించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అధికారులు నాలుగో రోజైన బుధవారం కూడా విచారించారు. మద్యం విధానం కూర్పు, అమలు, సౌత్ గ్రూప్, కిక్‌బ్యాక్‌లకు సంబంధించి పలు అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. అనంతరం సాయంత్రం 7 గంటల సమయంలో మాజీ మంత్రి కేటీఆర్ ఈడీ కార్యాలయంలో కవితతో భేటీ అయ్యి సుమారు గంటసేపు మాట్లాడారు. శుక్రవారం సుప్రీంకోర్టులో జరగనున్న విచారణకు సంబంధించి న్యాయవాది మోహిత్‌రావుతో కలిసి చర్చించారు. మరోవైపు, కవిత పీఏలైన రాజేష్, రోహిత్ రావులను బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఈడీ అధికారులు విచారించారు. జప్తు చేసిన వారి ఫోన్లకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది.

అభిషేక్ బోయినపల్లికి మధ్యంతర బెయిల్

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో నిందితుడైన హైదరాబాద్ వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లికి సుప్రీంకోర్టు ఐదు వారాలపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. 2023 జూలైలో ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ అభిషేక్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్‌దత్తాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. అభిషేక్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ 2022 అక్టోబరు 9 నుంచి కస్టడీలో ఉన్నారని చెప్పారు. పిటిషనర్ భార్య అనారోగ్యంగా ఉన్నారంటూ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి అనుమతిస్తామని, అయితే ట్రయల్ కోర్టు విధించిన షరతులు పాటించాలని ధర్మాసనం పేర్కొంది. 'ఈడీ అధికారులతో టచ్‌లో ఉండేందుకు వీలుగా ఫోన్ నంబరు ఇవ్వాలి. పాస్‌పోర్టు సరెండర్ చేయాలి. స్వస్థలం హైదరాబాద్ సందర్శించడం మినహా దేశ రాజధాని ప్రాంతాన్ని వీడి వెళ్లరాదు' అని చెప్పింది. తదుపరి విచారణను ఐదువారాలపాటు వాయిదా వేసింది.

బాబు బాగోతమే 'బెస్ట్'ట..!

'పచ్చ'పాతం రామోజీకి కనబడని విద్యాభివృద్ధి

- గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక యూనివర్సిటీ
- ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీలో ర్యాంకులు
- రూ.15 కోట్లతో స్టడీసర్కిళ్ల అభివృద్ధి
- దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని బరితెగించి మాట్లాడిన బాబు



సాక్షి, అమరావతి: ఒకటీ రెండూ కాదు.. రాష్ట్రంలోని 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం చదువులు అందుబాటులోకి వచ్చాయి. కుల మత బేధాలు లేకుండా 47 లక్షల మంది పిల్లలకు ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించింది. పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా, జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఒక్కటేంటి చదువుకోవాలనే ఆశ, ఆశయం ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా విద్యనందిస్తోంది ఈ సర్కారు. విదేశాల్లో చదువుకునేందుకు రూ.1.25 కోట్ల ఫీజును చెల్లిస్తోంది. ఐక్యరాజ్యసమితిలో 'ఏపీ చదువులు బెస్ట్' అనిపించుకుంది. కానీ రామోజీకి మాత్రం ఇవి కనిపించకపోగా.. ''ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా'' అన్న కుసంస్కారికి సంఘ సంస్కర్త అని డబ్బా కొడుతోంది. బెస్ట్ అవెయిలబుల్ స్కూళ్లను అటకెక్కించేశారంటూ గగ్గోలు పెడుతోంది. దళిత, గిరిజన బిడ్డలు చదువులకు దూరం చేశారంటూ మొసలి కన్నీరు కారుస్తోంది. అట్టడుగువర్గాల యువతకు అందించే విదేశీ విద్యా పథకం పైనా ఈనాడు విషం కక్కింది. గత ప్రభుత్వం విదేశీ విద్య పథకాన్ని అవినీతి, అక్రమాలకు నిలయంగా మార్చేస్తే దానిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టి అక్రమాలను వెలికి తీసింది. విదేశీ విద్యా పథకంలో మార్పులు చేసి నిజమైన అర్హులకు అందిస్తోంది. ఎంపిక చేసుకున్న యూనివర్సిటీలకు ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటి వరకు 41 మంది ఎస్సీ విద్యార్థులు ఈ పథకం కింద లబ్ధి పొంది విదేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. అడవి బిడ్డలు చదువుకునే గిరిజన విద్యాలయాలను అభివృద్ధి చేయడమే కాకుండా, వారి భోజన, ఇతర సదుపాయాల కోసం రూ.920.31 కోట్లను ఖర్చు చేసింది. అందుకు నిదర్శనమే ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులు 2019 నుంచి 23 మధ్య దాదాపు 400 మందికి పైగా ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ ర్యాంకులు సాధించారు. ఇవేమీ కనిపించని ఈనాడు పత్రిక కుళ్లు రాతలు రాస్తోంది. ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూసిన చంద్రబాబు పథకాలు ఇంతకంటే చాలా గొప్పవని చెబుతోంది.

బెస్ట్ అవెయిలబుల్ స్కూల్స్ ఎన్ని రామోజీ?

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించేందుకు దివంగత వైఎస్సార్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికే 'బెస్ట్ అవెయిలబుల్ స్కూల్స్'గా చంద్రబాబు పేరుమార్చి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను తన కూటమిలోని సభ్యులు నడుపుతున్న 383 ప్రైవేటు స్కూళ్లలో కేవలం 33 వేల మందిని చేర్పించి, నిరుపేద విద్యార్థులకు బెస్ట్ ఇంగ్లిష్ మీడియం చదువులంటూ భారీగా నిధులను దోచుకున్నారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ప్రతి పేద విద్యార్థికి ఇంగ్లిష్ మీడియం విద్య అందించాలని రాష్ట్రంలోని దాదాపు 45 వేల ప్రభుత్వ స్కూళ్లను ఇంగ్లిష్ మీడియం బోధనలోకి మార్చారు. దాంతో 47 లక్షల మంది పిల్లలకు బెస్ట్ విద్య అందుతోంది. ఇక గిరిజన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 371 ఆశ్రమ పాఠశాలలు, 18 ప్రి మెట్రిక్ హాస్టళ్లు, 159 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, 1958 పాఠశాలలను ఆధునికీకరించారు. వీటిలో ఇప్పుడు 1,55,599 మంది విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుతోంది. వారి భోజన, సదుపాల కోసం ఒక్క 2023 సంవత్సరంలోనే ప్రభుత్వం రూ.920.31 కోట్లు ఖర్చు చేసింది. గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు గత నాలుగేళ్లలో 400 మందికిపైగా ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించారు. 50 మందికి పైగా నీట్ ర్యాంకులు సాధించి మెడిసిన్ చదువుతున్నారు.

గిరిజన వర్సిటీ, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల స్థాపన

గత ప్రభుత్వంలో ప్రచారానికే పరిమితమైన అడవి బిడ్డల బెస్ట్ విద్యను ఈ ప్రభుత్వం వారి చెంతకు చేర్చింది. ఒకటో తరగతి నుంచి స్కూళ్లలో ఇంగ్లిష్ విద్యను అందించడమే కాకుండా ఉన్నత విద్యను సైతం వారి దరికి చేర్చింది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో రూ.153.85 కోట్లతో నిర్మిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలలో సగం సీట్లు (150) గిరిజన విద్యార్థులకే రిజర్వు చేసింది. సాలూరులో రూ.561.88 కోట్లతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని నిర్మిస్తోంది. పాడేరులో రూ.500 కోట్లతో గిరిజన వైద్య కళాశాలను మంజూరు చేసింది. ఇవేమీ రామోజీ పచ్చ కళ్లకు కనిపించకపోవడమే విడ్డూరం.

రూ.వేల కోట్ల నిధుల అభివృద్ధి కనిపించలేదా రామోజీ

ఎస్సీ వర్గానికి చెందిన 8,84,131 మంది తల్లులకు రూ.15 వేల చొప్పున రూ.5,335.7 కోట్లు ఇప్పటివరకూ అందించింది. 2,86,379 ఎస్టీ విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి ద్వారా రూ.1,714.75 కోట్లు అందించింది. జగనన్న వసతి దీవెన ద్వారా 5.06 లక్షల మందికి పైగా ఎస్సీ విద్యార్థుల తల్లులకు రూ.834 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో వేసింది. 83 వేల మంది ఎస్టీల తల్లులకు రూ.135.66 కోట్లను వారి ఖాతాల్లో జమచేసింది. జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.5.4 లక్షల మంది ఎస్సీ విద్యార్థుల తల్లులకు రూ.2,081 కోట్లు అందించింది. 1.11 లక్షల మంది ఎస్టీ తల్లులకు రూ.346 కోట్లు అందాయి. ఈ పథకాలన్నీ అత్యంత పారదర్శకంగా, ఎలాంటి అవినీతికి చోటు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోనే జమ అయ్యాయి. ఇవేమీ బెస్ట్ అవెయిలబుల్‌కు సాటిరావంటోంది ఎల్లో మీడియా.

- గత ప్రభుత్వం హయాంలో విదేశీ విద్యా పథకంలో జరిగిన లోపాలను, అవినీతిని, అక్రమాలను గుర్తించి ఆ స్థానంలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని తీసుకు వచ్చింది. ప్రతిభ ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించింది. అభ్యర్థులు ఎంచుకోదగ్గ 21 కోర్సులలో క్యూఎస్ ర్యాంకింగ్ లేదా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంక్‌ల ప్రకారం 50 ఉత్తమ ర్యాంకుల గల విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్లు లేదా ట్యూషన్ ఫీజు 100 శాతం చెల్లించేలా పథకాన్ని మార్చి అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 41 మంది విద్యార్థులు ఎంపికై విదేశాల్లో చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం విదేశీ విద్యకు ఈ స్థాయిలో భరోసా ఇవ్వగలిగిందా?
- అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్‌పైనా ఈనాడు పచ్చి అబద్ధాలు అచ్చేసింది. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్ మరింత ప్రయోజనకరంగా నిర్వహిస్తోంది. విశాఖలో సివిల్స్ కోచింగ్. విజయవాడలో గ్రూప్స్‌కి శిక్షణనిస్తోంది. తిరుపతిలో బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణనిస్తోంది. ఈ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉద్యోగ శిక్షణ కోసం ఇప్పటివరకు రు.15 కోట్లు పైగా ఖర్చు చేసింది. అయినా సరే.. బాబు బాగోతమే బాగుందంటోంది పచ్చపత్రిక.

ఎస్సీ విద్యా సంస్థల్లో ఉత్తమ విద్య

గత టీడీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వ విద్యారంగాన్ని, వైద్యరంగాన్ని నిర్వీర్యం చేసి అంతిమంగా పేదలపైన, దళితులపైన భారం మోపారు. చదువులు, వైద్యాన్ని కొనే స్తోమత లేక రెండింటికీ దూరమయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు బకాయి పెట్టి విద్యార్థులను వేదనకు గురి చేసింది. ఇవేమీ ఈనాడు దినపత్రికలో ఏరోజూ కనిపించలేదు. అలాంటి పరిస్థితులను తొలగిస్తూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మెరుగైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఎస్సీ, ఎస్టీల కోసం చేపడితే అది తప్పు అన్నట్టు రాస్తోంది. గతంలో కనీస ప్రమాణాలు లేని స్కూళ్లకూ బెస్ట్ అవైలబుల్ స్కీంను అమలు చేసి నిధులను దోచుకున్నారు. ఇప్పుడు విద్యార్థులందరికీ నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య అందుతోంది. డిజిటల్ తరగతి గదులు, ఐఎఫ్‌పీ స్క్రీన్లు, ఇంటర్నెట్, విద్యార్థులకు ట్యాబ్‌లు, బైలింగువల్ టెక్ట్స్ బుక్స్‌తో, డిక్షనరీ, యూనిఫారం, షూలతో విద్యాకానుక అందిస్తున్నారు. టోఫెల్ శిక్షణనిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాలను ప్రకటించింది. మెయిన్స్‌కు అర్హత సాధిస్తే రూ.లక్ష, ఇంటర్వ్యూలకు క్వాలిఫై అయినవారికి అదనంగా రూ.50వేల చొప్పున ప్రోత్సాహకాలను ప్రకటించింది. గత ఏడాది ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్, మెయిన్స్‌ల్లో విద్యార్థులు 99.05 శాతం పర్సంటైల్ సాధించడంతో పాటు 200 మందికి పైగా ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు పొందారు.

పచ్చనేతల ప్రలోభాలు

గిరిజన తండాల్లో హోలీ కానుకల పేరుతో తాయిలాలు

- ద్వితీయ శ్రేణి నేతలకు టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఎర
- ఇతర నాయకులతో వసంత కృష్ణ ప్రసాద్ బేరసారాలు
- క్షేత్ర స్థాయిలో టీడీపీకి ఎదురుగాలి వల్లే ఓటర్లకు గాలం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రజా క్షేత్రంలో టీడీపీకి ఎదురుగాలి వీస్తోంది. మరోసారి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకొనే దిశగా దూసుకు పోతున్న వైఎస్సార్‌సీపీ ధాటిని ఎదుర్కొనేందుకు వారు అడ్డదారులు తొక్కాల్సి వస్తోంది. అధికార పార్టీ అభ్యర్థులు తాము ఇప్పటివరకూ చేసిన మంచిని చెప్పుకుంటూ ప్రతి ఇంటి తలుపు తట్టారు. తమదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకొంటున్నారు. టీడీపీలో మాత్రం నైరాశ్యం నెలకొంది, గ్రామాల్లో ఆ నేతలకు స్పందన కరువవ్వడంతో ద్వితీయ శ్రేణి నాయకులకు ఎర వేసి, వారిని తమవైపు తిప్పుకొనేందుకు ప్రయతిస్తున్నారు. వారు కూడా ఏమాత్రం రాజీపడకుండా నేతలనుంచి డబ్బు గుంజేందుకు వెనకాడటం లేదు.

గిరిజన తండాల్లో తాయిలాల ఎర

తిరువూరు నియోజక వర్గంలో చంద్రబాబు ప్రాపకంతో టీడీపీ టికెట్ సంపాదించిన కొలికపూడి శ్రీనివాస్‌కు నియోజక వర్గ ప్రజలతో సత్సంబంధాలు లేవు. అక్కడ ఇన్‌చార్జిని కాదని ఆయనకు టికెట్ కేటాయించడాన్ని ఆ పార్టీ నేతలే జీర్ణించుకోలేక పోతున్నారు. నియోజక వర్గంలో ఆశించిన స్పందన రాకపోవడంతో ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. జి.కొండూరు మండలంలోని గిరిజన తండాలను లక్ష్యంగా చేసుకొని హోలీ కానుకల పేరుతో వారిని ఆకర్షించేందుకు యతిస్తున్నారు. రోజుకో తండాలో రాత్రివేళల్లో కొలికపూడి ఆయన భార్య కలిసి పర్యటిస్తూ, అక్కడి నాయకులతో కలసి భోజనం చేసి, అక్కడే ఉంటూ వారిని మచ్చిక చేసుకొనే యత్నం చేస్తున్నారు. శ్రీనివాస్ భార్య గిరిజన తెగకు చెందినవారు కావడంతో బంధుత్వాలు కలుపుకుని ఓటర్లకు డబ్బు ఎర చూపుతున్నట్లు చర్చ సాగుతోంది.

ద్వితీయ శ్రేణి నేతలకు చిన్ని గాలం

వైఎస్సార్‌సీపీ పార్లమెంటు అభ్యర్థి కేశినేని నానికి నియోజకవర్గ వ్యాప్తంగా బలమైన క్యాడర్ ఉంది. దీనికితోడు టాటా ట్రస్టు ద్వారా సేవలు అందించడంతో ఆయనకు మంచి పేరుంది. ఈ నేపథ్యంలో టీడీపీ పార్లమెంటు అభ్యర్థిగా ప్రచారం చేసుకొంటున్న కేశినేని చిన్ని ఎన్నికల ముందు సేవా కార్యక్రమాల పేరుతో ప్రజలను మభ్యపెట్టేయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో డబ్బుతో ద్వితీయ శ్రేణి నాయకులకు ఎర వేస్తున్నట్లు సమాచారం, నాయకుని స్థాయిని బట్టి డబ్బు ముట్టజెప్పి, పార్టీలో చేరికలు అంటూ కలరింగ్ ఇస్తున్నారు.

స్వపార్టీలోనే వసంతకు వ్యతిరేకత

మైలవరం నియోజకవర్గంలో టీడీపీ తరఫున పోటీ చేస్తున్న వసంత కృష్ణప్రసాద్ సొంత పార్టీ నేతలనుంచే వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తనకు బలముందని అందరినీ నమ్మించేందుకు ప్రజా ప్రతినిధుల స్థాయిని బట్టి డబ్బు ఆశ చూపి తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. దేవినేని ఉమా వర్గం నాయకులను సైతం స్థానిక ఎన్నికల్లో చేసిన ఖర్చు మొత్తం ఇస్తాననీ, అన్ని రకాలుగా చూసుకుంటాననీ, తనకు మద్దతివ్వాలని గాలం వేస్తున్నట్లు నియోజక వర్గంలో చర్చ సాగుతోంది. నాయకులు సైతం ఇదే అదనుగా అందిన కాడికి దండుకొనే యత్నం చేస్తున్నారు.

బీజేపీ అభ్యర్థుల ఖరారు మరింత ఆలస్యం

పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సహా ఆశావహులంతా ఢిల్లీలో మకాం

సాక్షి, అమరావతి : పొత్తుల్లో బీజేపీకి కేటాయించిన స్థానాల్లో అభ్యర్థుల ఖరారు ప్రక్రియకు మరో రెండు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీల పొత్తులో బీజేపీకి ఆరు లోక్‌సభ స్థానాలతో పాటు పది అసెంబ్లీ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. చంద్రబాబు- పవణ్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లి ఎన్డీయేలో చేరేందుకు అమిత్ షాతో ఆ ఇద్దరి భేటీ అనంతరం.. ఈ నెల 11వ తేదీ బీజేపీ జాతీయ నాయకత్వం తరఫున కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ రాష్ట్రానికి వచ్చి పొత్తుల్లో బీజేపీకి కేటాయించిన స్థానాలపై టీడీపీ – జనసేన పారీల అధ్యక్షులతో చర్చించి వెళ్లిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గత పది రోజులుగా తమ పార్టీకి కేటాయించిన స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై బీజేపీలో పూర్తి స్తబ్ధత నెలకొని ఉంది. బీజేపీ సంస్థాగత నిబంధన ప్రకారం.. ఎన్నికల సమయంలో రాష్ట్ర పార్టీ నుంచి అభిప్రాయ సేకరణ ప్రక్రియలో రాష్ట్ర అధ్యక్షులు, తాజా మాజీ అధ్యక్షులతో పాటు రాష్ట్ర పార్టీ సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షించే సంఘటన కార్యదర్శులను జాతీయ పార్టీ పెద్దలు భాగస్వామ్యం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి అందిన పిలుపు మేరకు పార్టీకి కేటాయించిన స్థానాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై చర్చించేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, పార్టీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్‌లు మంగళవారమే ఢిల్లీ వెళ్లారు. అదే సమయంలో బీజేపీ టికెట్లు ఆశించే నాయకులందరూ రెండు మూడు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేశారు. కాగా, పురందేశ్వరి, సోము, మధుకర్‌లు మంగళ, బుధవారాల్లో బీజేపీ జాతీయ పార్టీ సహ సంఘటన కార్యదర్శి శివప్రకాష్‌తో సమావేశమయ్యారని, ఆరు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రాథమిక స్థాయిలో చర్చలు ముగిసినట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. వలస నేతలతో పాటు ఒరిజినల్ బీజేపీ నేతలకూ టికెట్ల కేటాయింపు జరిగేలా కసరత్తు కొనసాగినట్టు బీజేపీ వర్గాలంటున్నాయి. పార్టీకి కేటాయించిన పది అసెంబ్లీ స్థానాల్లో, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై జాతీయ – రాష్ట్ర పార్టీల మధ్య ప్రాథమిక స్థాయి చర్చలు గురువారానికల్లా కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలిసింది. కాగా, విజయవాడ పశ్చిమ స్థానం బీజేపీకే ఖరారైందని పేర్కొంటూ, బీజేపీ జిల్లా శాఖ గురువారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తోంది.

ఉల్లంఘనులు

పలుచోట్ల నిబంధనలు పట్టించుకోని టీడీపీ నేతలు

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన • తిరుపతి జిల్లాలో కానిస్టేబుల్, చిత్తూరులో ఏఎన్ఎం సస్పెన్షన్

ప్రొద్దుటూరు/ చిత్తూరు అర్బన్/ కొమ్మాది (విశాఖ)/ పాలకొల్లు (సెంట్రల్)/భాకరాపేట(తిరుపతి జిల్లా)/హిందూపురం అర్బన్: ఈసీ ఆదేశాలను టీడీపీ నేతలు పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కోడ్‌కు విరుద్ధంగా అనుమతులు లేకుండానే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. దేవాలయాలను సైతం ప్రచారానికి వినియోగిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఓటర్లకు చీరలు, ఇతర సామగ్రి పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు.

ప్రొద్దుటూరులో..

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి స్థానిక టీడీపీ నేతలు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని టీచర్స్ కాలనీలో మంగళవారం సాయంత్రం టీచర్స్ కాలనీలో సమావేశానికి టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి హాజరై ప్రసంగించారు. బుధవారం ఉదయం గోపవరం గ్రామంలో 22వ వార్డు కౌన్సిలర్ మహ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో వరదరాజులురెడ్డి ప్రసంగించారు. విషయం తెలుసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హైమావతి సంఘటన స్థలానికి వెళ్లి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పినా పట్టించుకోలేదు. దీనిపై ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదంటూ అధికారితో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. ఆమె ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు వరదరాజులరెడ్డితోపాటు మహ్మద్ గౌస్‌పై కేసు నమోదు చేశారు. అయినప్పటికీ వరదరాజులురెడ్డి బుధవారం సాయంత్రం గోపవరం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశానికి సైతం హాజరవడం గమనార్హం. రెండు రోజుల్లో నాలుగు సమావేశాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు వరదపై ఒక్క కేసు మాత్రమే నమోదైంది.


ఎన్నికల అధికారి హైమావతితో వాగ్వాదం చేస్తున్న వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి

వైద్యం పేరుతో వల

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన నాయకులు వైద్యం పేరుతో ఓటర్లకు వల వేస్తున్నారు. విశాఖ నగరం 8వ వార్డు గొల్లల ఎండాడలో బసవతారకం, గీతం ఆస్పత్రులు సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ, జనసేన నాయకులు ప్రారంభించారు. ఇది వైద్య శిబిరంలా కాకుండా పార్టీ ప్రచార కార్యక్రమంలా సాగింది. ఇటీవల 39వ వార్డు లక్ష్మీటాకీస్ ప్రాంతంలో బసవతారకం ఆస్పత్రి, గీతం ఆస్పత్రి సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి భరత్, జనసేన నాయకుడు వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై.. ఓటర్లను ప్రభావితంచేసేలా కార్యక్రమం చేపట్టారు.


విశాఖపట్నం గొల్లల ఎండాడలో నిర్వహించిన వైద్య శిబిరం


టీడీపీ కండువా వేసుకుని పూజలు నిర్వహిస్తున్న చిత్తూరు జిల్లా టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు

పార్టీ గుర్తుతో పూజలు

ఎన్నికల నియమావళి ప్రకారం ఆలయాల్లో రాజకీయ ప్రచారాలు చేయకూడదు. చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు సైకిల్ గుర్తును చొక్కాకు పెట్టుకుని ప్రభుత్వ ఆసుపత్రి పక్కనున్న ఈశ్వరుని ఆలయంలో పూజలు చేశారు. అదేరీతిలో బుధవారం రాత్రి చిత్తూరు కట్టమంచి వద్ద ఉన్న శ్రీ సాయిబాబా ఆలయంలోనూ టీడీపీ కండువా ధరించి పూజలు నిర్వహించారు.

తొలగించని టీడీపీ పోస్టర్లు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో ఇంకా తెలుగుదేశం పార్టీకి చెందిన వాల్ పోస్టర్లు, ట్రీ గార్డులపై పేర్లు తొలగించలేదు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా టీడీపీ వాల్‌పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. అధికార పక్షానికి చెందిన పోస్టర్లు, బ్యానర్లు తొలగించిన అధికారులు టీడీపీకి చెందిన వాల్‌పోస్టర్ల జోలికి వెళ్లకపోవడం విశేషం.


పట్టణం, గ్రామాల్లో ఇంకా దర్శనమిస్తున్న టీడీపీ వాల్‌పోస్టర్లు

టీడీపీ ప్రచారంలో కానిస్టేబుల్, ఏఎన్ఎం


అన్నమయ్య జిల్లా, భాకరాపేటలో టీడీపీ ప్రచార కరపత్రం అందజేస్తున్న కానిస్టేబుల్ రాజశేఖర్

టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దిశ కానిస్టేబుల్ సాకిరి రాజశేఖర్‌పై భాకరాపేట పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటికి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వెళుతుండగా తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో టీడీపీ శ్రేణులు మార్గమధ్యలో స్వాగతం పలికారు. దిశ కానిస్టేబుల్ టీడీపీ నాయకులతో కలసి పూలమాలలు వేయడం, భాకరాపేటలో పార్టీ కరపత్రాలు పంచుతూ టీడీపీకి ఓటు వేయమని అభ్యర్థించడం, వాటర్ బాటిళ్లపై సైతం టీడీపీ నాయకుల ఫొటోలు వేయించుకోవడం చర్చనీయాంశమైంది. బుధవారం రాత్రి ఆ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పడాల్ ఉత్తర్వులిచ్చారు. అలాగే టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చిత్తూరు జిల్లా చౌడేపల్లి సచివాలయ గ్రేడ్ 3 ఏఎన్ఎం లతను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు.

వాటర్ బాటిల్‌పై దిశ కానిస్టేబుల్ ఫొటో



హిందూపురంలో ప్రలోభాలు

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో టీడీపీ ప్రలోభాలకు తెరలేపింది. యథేచ్ఛగా చీరల పంపిణీ చేపడుతోంది. బుధవారం రాత్రి హిందూపురం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో టీడీపీ వర్గీయులు ఓటర్ల జాబితా చేతబట్టుకుని ఇంటింటికీ చీరలు పంపిణీ చేస్తుండగా అధికారులు కొన్ని చీరలు, ఓటర్ల జాబితాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

హిందూపురంలో టీడీపీ వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఓటర్ల జాబితా, చీరలు



క్లుప్తంగా...

బతిమాలితేనే పవన్‌కు టికెట్ ఇచ్చాం..
పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం: ×గత 20 ఏళ్లుగా పార్టీని కాపాడుకుంటూ వచ్చా. చంద్రబాబు ఆదేశాలతో నా సీటును త్యాగం చేశా. ఎంతో బాధతో ఆ స్థానాన్ని వదులుకున్నా. నేను త్యాగం చేస్తేనే పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తున్నాడు॰ అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ నిర్వేదం వ్యక్తం చేశారు. బుధవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. పిఠాపురంలో పవన్‌కు టీడీపీ నేతలే పచ్చ జెండాలతో ఎన్నికల ప్రచారం చేస్తారని, జనసేన నేతల అవసరం లేదన్నారు. తానే సేనాధిపతినని చెప్పారు. పవన్ కాకినాడ ఎంపీగా పోటీ చేస్తే పిఠాపురం సీటు తనదేనని తేల్చి చెప్పారు. పవన్ కాకుండా పిఠాపురం సీటును మరెవరికీ ఇచ్చేది లేదన్నారు. ఇక్కడ తనను కాదని జనసేన విజయం సాధించడం ఎట్టి పరిస్థితుల్లోను కుదరదన్నారు. పిఠాపురంలో టీడీపీ మాత్రమే ఉందని, జనసేన అనేదే లేదని కుండబద్ధలు కొట్టారు. ×మనల్ని బతిమలాడుకుంటే పవన్‌కు టికెట్ ఇచ్చాం. మనమిచ్చిన టికెట్ కాబట్టి నెగ్గించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది॰ అని చంద్రబాబు తనకు చెప్పారన్నారు. పవన్‌ను గెలిపించినా తీసుకెళ్లి చంద్రబాబుకే అప్పగిస్తామన్నారు. ఆయన ఆదేశాల మేరకే పవన్ పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గెలవడం వరకే పవన్ పని, గెలిచాక పని చేసేది మాత్రం టీడీపీనే అని పేర్కొన్నారు. కాగా వర్మ వ్యాఖ్యలపై జనసేన నేతలు మండిపడుతున్నారు. పవన్ కళ్యాణ్ పోటీ చేయడంపై రోజుకో రకంగా మాట్లాడుతూ షరతులు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు
నూర్ బాషా దూదేకుల ముస్లిం సేవాసంఘం



పెందుర్తి(విశాఖపట్నం): రాష్ట్రంలో పేదల పాలిట పెన్నిధిగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని నూర్ బాషా దూదేకుల ముస్లిం సేవా సంఘం రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు ప్రకటించారు. బుధవారం పెందుర్తిలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు వారు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో సేవలందించారన్నారు. ముఖ్యంగా మైనారిటీలను పూర్తిస్థాయిలో ఆదుకున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లో తమ పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు తమవంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సంఘం ప్రతినిధులు షేక్ ఖాన్ సాహెబ్, బాబ్జి, షేక్ అబ్దుల్లా మాస్టర్, పీర్ సాహెబ్, రెహమాన్, సయ్యద్, ఫాతిమా బీబీ, సలీమా, ఖాన్ బేబీ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఓ అపరిచితుడు
విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్



ఆటోనగర్(విజయవాడతూర్పు): చంద్రబాబు ఓ అపరిచితుడు.. ఊసరవెల్లి.. మోసగాడు అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) ఆరోపించారు. నాడు మోదీని టెర్రరిస్టు అని తిట్టిన చంద్రబాబే.. మూడు రోజులు ఢిల్లీలో జాగారం చేసి మళ్లీ పొత్తు పెట్టుకున్నాక.. వీరుడు, ధీరుడు అంటున్నాడని ఎద్దేవా చేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో కలిసి బుధవారం ఆయన పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ చిలకలూరిపేట ప్రజాగళం సభకు ప్రధాని మోదీని పిలిచి తీవ్రంగా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ప్రధానికి శాలువా కూడా వేయలేని స్థితిలో చంద్రబాబు, పవన్‌లు ఉన్నారని ఎద్దేవా చేశారు. భాషలపై పట్టులేని చంద్రబాబు.. మోదీ ప్రసంగాన్ని వచ్చీరాని విధంగా చెప్పారని దుయ్యబట్టారు. పిఠాపురంలో ఓడిపోవటానికి పవన్ సిద్ధంగా ఉన్నాడని, అందుకే అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నాడని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీత లక్ష మెజారిటీతో పవన్‌పై గెలుస్తుందని జోస్యం చెప్పారు. ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేనలు బీజేపీలో విలీనమవుతాయన్నారు. చిలకలూరిపేట సభకు 15 లక్షలు వస్తారని గొప్పలు చెప్పారని, తీరా చూస్తే లక్షమంది కూడా రాలేదన్నారు. సిద్ధం సభలను చూసి చంద్రబాబు, పవన్‌లలో భయం పట్టుకుందన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనతో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌కు అండగా నిలుస్తారని కేశినేని చెప్పారు.

కోలుకుంటున్న నారాయణ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 16న కామారెడ్డిలో ఒక వివాహ కార్యక్రమంలో జారిపడిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పక్కటెముక విరిగిందని, ఆయనకు రెండు వారాల విశ్రాంతి అవసరమని ఏఐజీ వైద్యులు సూచించినట్టు సీపీఐ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం నారాయణ హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ప్రత్తిపాడులో టీడీపీ గూండాయిజం

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంటిపై టీడీపీ అభ్యర్థి దాడి

రౌడీ మూకలతో వచ్చి స్వయంగా దాడి చేసిన మాజీ ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు

- 200 మంది రౌడీలతో 20 కార్లలో కిరణ్‌కుమార్ ఇంటిపైకి దాడి
- అభ్యర్థిని, కార్యకర్తలను అసభ్య పదజాలంతో, కులం పేరుతో దుర్భాషలు
- అడ్డగించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడి
- కార్లతో తొక్కించేందుకు ప్రయత్నం
- ప్రతిఘటనతో పలాయనం చిత్తగించిన టీడీపీ రౌడీలు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ముగ్గురికి గాయాలు
- ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు




రౌడీ మూకలకు దాడి చేయమని చెబుతున్న బూర్ల రామాంజనేయులు, బలసాని కిరణ్‌కుమార్ ఇంటిముందు దాడికి ప్రయత్నిస్తున్న టీడీపీ రౌడీ మూకలు

గుంటూరు రూరల్: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఇంటిపై స్వయంగా దాడికి తెగబడ్డారు. బుధవారం మధ్యాహ్నం కార్లు, ఇతర వాహనాలపై 200 మంది టీడీపీ, జనసేన రౌడీలతో, మారణాయుధాలతో వచ్చి రామాంజనేయులు ఈ దాడికి పాల్పడ్డారు. అక్కడ ఉన్న వారిని కార్లతో తొక్కించే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎదురుదాడికి దిగడంతో పలాయనం చిత్తగించారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. మాజీ ఐఏఎస్ అధికారి అయిన రామాంజనేయులే ఓ గూండా మాదిరిగా ఇలా దాడికి పాల్పడటం అందరినీ విస్మయ పరిచింది. టీడీపీ గుండాయిజాన్ని తేటతెల్లం చేసింది. ఓడిపోతామన్న అక్కసుతోనే రామాంజనేయులు ఇలా దాడి చేసి, భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నించారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. వారిపై పోలీసులు, ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిమాండ్ చేశారు.

ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ఓ పథకం ప్రకారం కర్రలు, రాడ్లు, ఇతర మారణాయుధాలతో 20 కార్లు, ఇతర వాహనాలతో రౌడీమూకలను తీసుకొని గుంటూరు నగరం జేకేసీ కళాశాల రోడ్డులోని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ ఇంటి వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న కిరణ్‌కుమార్ కారు డ్రైవర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవరు మీరు ఎందుకు వచ్చారని అడగ్గా, టీడీపీ రౌడీ మూకలు వారిపై ఒక్కసారిగా దాడికి దిగారు. కారులోనే ఉన్న టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు కొట్టండిరా వాళ్లను అంటూ రౌడీ మూకలను రెచ్చగొట్టాడు. దీంతో వారు రెచ్చిపోయి అభ్యర్థి బలసానిని, కార్యకర్తలను కులం పేరుతో దుర్భాషలాడుతూ దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎదురు దాడికి దిగటంతో టీడీపీ, జనసేన రౌడీ మూకలు కార్లు వెనక్కి తిప్పుకొని పారిపోయారు. కిరణ్‌కుమార్ డ్రైవర్ ఇంద్రబాబు చేతికి తీవ్రగాయమైంది. గోరంట్లకు చెందిన తాళ్ళ అబ్బులును రౌడీ మూకలు కిందపడేసి కొట్టడంతో ఆయనకు గాయాలయ్యాయి. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి కాళ్ళ పైకి రామాంజనేయులు తన కారు ఎక్కించి, తొక్కించడంతో ఆయన కాలు విరిగింది.అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని కిరణ్‌కుమార్ డ్రైవర్ ఇంద్రబాబు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో టీడీపీ వారు కూడా అక్కడికి రావడంతో పోలీసు స్టేషన్ వద్ద కూడా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి, ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ అంశంపై జిల్లా ఎస్పీ తుషార్ డూడీకి ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిరణ్‌కుమార్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిలారు రోశయ్య, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, గుంటూరు తూర్పు అభ్యర్థి షేక్ నూరీఫాతిమా, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ లాల్‌పురం రాము ఫిర్యాదు చేశారు.

రాళ్ళతో దాడిచేస్తూ వచ్చారు



కార్యాలయం వద్ద కింద నాతోపాటు మరో పది మంది కార్యకర్తలు భోజనం చేసేందుకు ఉపక్రమిస్తున్నాం. ఒకేసారి సుమారు 20 కార్లు ఇంటి ముందుకు వచ్చి ఆగాయి. వెంటనే కార్లలో నుంచి దిగిన టీడీపీ గూండాలు ఇంటిపైకి రాళ్ళు రువ్వుతూ ఎవరున్నారు లోపల బయటకు రాండిరా అంటూ దుర్భాషకు దిగారు. వెంటనే నేను, కార్యకర్తలు వారి వద్దకు వెళ్ళి ఎవరు మీరు ఎందుకు వచ్చారని ప్రశ్నించాం. కారులో ఉన్న టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు దుర్భాషలాడుతూ తనతో వచ్చిన రౌడీ మూకలతో వెయ్యండ్రా వీళ్ళని అని అరిచాడు. వెంటనే రౌడీ మూకలు మాపై దాడికి దిగారు. ఇంటివద్దకే వచ్చి చంపుతాం.. అంటూ రౌడీ మూకలు అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి దిగారు. దాడిలో నా చేతికి గాయమైంది.

– ఇంద్రబాబు, కిరణ్‌కుమార్ డ్రైవర్

కారు ఎక్కించి తొక్కెయ్యిరా వాడిని అని రామాంజనేయులు అన్నాడు



ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటిపై రాళ్ళతో, రౌడీలతో దాడికి పాల్పడుతున్నావ్.. ఇదేనా నీ సంస్కారం అంటూ నేను గట్టిగా నిలదీశాను. నేను, ఇతర వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైతం రామాంజనేయులుతో వచ్చిన రౌడీ మూకలపై ఎదురు దాడికి దిగాం. దీంతో రామాంజనేయులు తన కారుతో వాళ్ళను తొక్కెయ్యమని డ్రైవర్‌కు చెప్పాడు. కారును ఒక్కసారిగా ముందుకు వెనక్కు కదపటంతో కారు టైరు నా ఎడమ కాలుపై ఎక్కింది. కాలు పాదం వద్ద ఫ్యాక్చర్ అయ్యింది. కారుతో తొక్కించి మమ్మల్ని అంతం చేయాలని బూర్ల రామాంజనేయులు ప్రయత్నించాడు.

– మెట్టు వెంకటప్పారెడ్డి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

విచక్షణరహితంగా దాడి



టీడీపీ రౌడీలు దాడికి దిగటంతో మమ్మల్ని మేం కాపాడుకునేందుకు ఎదురు దాడికి ప్రయత్నించాం. దీంతో నన్ను, నాతోపాటు ఉన్న ఆర్ అండ్ బీ డైరెక్టర్ పిల్లి మేరిని సైతం రామాంజనేయులే స్వయంగా చేతులతో నెట్టి కిందపడేశాడు. ఆడ మనిషి అని కూడా చూడకుండా రౌడీ మూకలు మేరిపై దాడి చేశారు. నన్ను కొట్టారు. వెంటనే మేము లేచి ఎదురు దాడికి ప్రయత్నించాం. దీంతో మమ్మల్ని కార్లతో తొక్కించే ప్రయత్నం చేసి పరారయ్యారు.

– తాళ్ళ అబ్బులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త

బీసీలకు ఎంతో మేలు చేసిన జగన్‌ను గెలిపించుకుందాం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపు
- బలహీనవర్గాల ఉన్నతికి కృషి చేస్తున్న సంఘ సంస్కర్త సీఎం జగన్



విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

లబ్బీపేట(విజయవాడ తూర్పు): బడుగు, బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. వారి ఉన్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ రాజకీయ నాయకుడు కాదని.. ఒక సంఘ సంస్కర్త అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నన్ని పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. బీసీలకు అండగా నిలిచిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవడం ద్వారా ఆయన రుణం తీర్చుకుందామని బీసీలకు పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సీఎం జగన్ రాష్ట్రంలో పేదల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రిని కలిశా. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ఆయన మెచ్చుకున్నారు. ఇన్ని పథకాలు అమలు చేయడం ఎవరి వల్ల కాదని చెప్పారు. ఇతర రాష్ట్రాలు తిరిగి వస్తే కానీ.. వైఎస్ జగన్ విలువేంటో ఇక్కడున్న వారందరికీ బాగా అర్థమవుతుంది. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించడం ద్వారా.. వారి కుటుంబాల్లో సీఎం జగన్ వెలుగులు నింపుతున్నారు. పొరుగు రాష్ట్రాల ప్రజలు కూడా తమను ఏపీలో కలపాలని అడుగుతున్నారు. విద్య ద్వారా ఉన్నత శిఖరాలు చేరుకునే అవకాశం కోసం వారు ఎంతో ఆరాటపడుతున్నారు. ఏపీలోని అన్ని పదవుల్లోనూ సీఎం జగన్ బీసీలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా బీసీలకు ఇంత న్యాయం ఎన్నడూ జరగలేదు. ఓట్ల కోసం ప్రయత్నించే పార్టీలు.. బీసీలకు న్యాయం చేసేందుకు మాత్రం ముందుకు రావు. కానీ సీఎం జగన్ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడానికి సహకరించారు. బీసీలకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా.. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకొని ఆయన రుణం తీర్చుకుందాం' అని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. దేవినేని నెహ్రూ తనకు సుపరిచితులని, బడుగు బలహీనవర్గాల కోసం కష్టపడి పనిచేసేవారని చెప్పారు. దేవినేని అవినాశ్ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పార్టీనాయకులు దేవినేని అవినాశ్, వెంకట సత్యనారాయణ, వియ్యపు అమర్నాథ్ పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజలే అండ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- రాష్ట్రంలో 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయి
- ఇతర పార్టీలతో పొత్తులు లేనిదే చంద్రబాబు పోటీ చేయలేడు
- మేమంతా సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- సీఎం బస్సు యాత్ర ఏర్పాట్లపై కర్నూలు, కడపలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం

కర్నూలు(టౌన్)/కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ పాలనలో లబ్ధి పొందిన రాష్ట్ర ప్రజలంతా సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా నిలుస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలు, కడపలో ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, నాయకులతో కలిసి ×మేమంతా సిద్ధం॰ పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ×ఎన్నికల రణరంగంలోకి వైఎస్సార్‌సీపీ ఎంతో ఉత్సాహంగా ముందుకెళ్తోంది. ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో నిర్వహించిన సిద్ధం సభలు విజయవంతమైన విషయం అందరికీ తెలిసిందే. ఇదే క్రమంలో సీఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతున్నారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలతో మమేకం అవుతారు. అలాగే బహిరంగ సభల్లో పాల్గొంటారు. ఈనెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ఈ బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటలకు ప్రొద్దుటూరులో సభ జరుగుతుంది. 28న నంద్యాలలో సభ ఉంటుంది. ఆళ్లగడ్డలో ప్రజలతో సీఎం జగన్ ముచ్చటిస్తారు. ఐదేళ్ల పాలనతో పాటు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి మాట్లాడుతారు. ఈనెల 29న ఎమ్మిగనూరుకు బస్సు యాత్ర చేరుకుంటుంది. అక్కడ జరిగే సభలో సీఎం పాల్గొంటారు. ఆ తర్వాత షెడ్యూల్ ప్రకారం రాయలసీమ జిల్లాల్లో బస్సు యాత్ర కొనసాగుతుంది. ఈ బస్సు యాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలంతా కలిసి విజయవంతం చేయాలి॰ అని సూచించారు. 14 ఏళ్లు సీఎంగా చేశానని, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబుకు ఎన్నికల్లో ఒంటరిగా పాల్గొనే దమ్ము, ధైర్యం మాత్రం లేవని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వచ్చాయంటే ఇతర పార్టీల మీద ఆధారపడతారని.. ఇప్పుడు ఆయనకు జనసేన, బీజేపీలు ఊతకర్రలుగా మారాయన్నారు. గతంలో మోదీని తీవ్రస్థాయిలో తిట్టిన చంద్రబాబు ఇప్పుడు పొగుడుతున్నాడని విమర్శించారు. ఇలా అందితే జుట్టు అందకపోతే కాళ్ల పట్టుకోవడం చంద్రబాబు నైజమని దుయ్యబట్టారు. ఎంత మంది కలిసి వచ్చినా.. వైఎస్ జగన్ విజయాన్ని ఆపలేరన్నారు. తమ ప్రభుత్వం మూడు రాజధానులకు కట్టుబడి ఉందని.. కర్నూలును న్యాయ రాజధానిగా ఇప్పటికే ప్రకటించామన్నారు. గత నెలలో లా విశ్వవిద్యాలయ నిర్మాణ పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమని.. కర్నూలు న్యాయ రాజధానిగా ఉంటుందన్నారు. ఈ సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కె.సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండ

- వైఎస్ జగన్ పాలనలో రైతులకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు
- ఏటా సగటున 1.05 కోట్ల మందికి రూ.1,74,193 కోట్ల రుణాలు
- 2023–24 సీజన్‌లో రుణ ప్రణాళిక రూ.2.31 లక్షల కోట్లు
- ఇప్పటికే 99.65 లక్షల మందికి రూ.2.08 లక్షల కోట్లు అందజేత
- రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలతో వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వం
- ప్రభుత్వ తోడ్పాటుతో సకాలంలో రుణాలు చెల్లిస్తున్న రైతులు
- దీంతో అడిగిందే తడవుగా రుణాలిస్తున్న బ్యాంకులు



చంద్రబాబు హయాంలో ఇలా..

సంవత్సరం	రైతులు (లక్షల్లో)	రుణం (రూ.కోట్లలో)
2014–15	58.14	40,210
2015–16	73.41	75,919
2016–17	78.40	78,819
2017–18	88.74	92,602
2018–19	99.20	77,074
మొత్తం	397.89	3,64,624

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...

సంవత్సరం	రైతులు (లక్షల్లో)	రుణం (రూ.కోట్లలో)
2019–20	98.34	1,13,998
2020–21	107.88	1,46,879
2021–22	108.60	1,76,954
2022–23	112.21	2,24,997
2023–24 (ఫిబ్రవరి నాటికి)	99.60	2,08,136
మొత్తం	526.63	8,70,964

సాక్షి, అమరావతి: ఆరు గాలం శ్రమించే అన్నదాతకు వైఎస్ జగన్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా వంటి పథకాల ద్వారా అవసరమైన ఆర్థిక చేయూతనిస్తోంది. అలాగే బ్యాంకర్ల సాయంతో ముందెన్నడూ లేని రీతిలో రైతులకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు అయ్యేలా చూస్తోంది. గతంలో రుణాల కోసం అన్నదాతలు చెప్పులరిగేలా బ్యాంకుల చుట్టూ తిరిగేవారు. అయినా సకాలంలో అప్పులు పుట్టక వడ్డీ వ్యాపారుల ఉచ్చులో పడి అప్పుల ఊబిలో కూరుకుపోయేవారు. సీఎం జగన్ పాలనలో ఆ పరిస్థితి మారింది. అడిగిందే తడవుగా అన్నదాతలకు రుణాలు మంజూరవుతున్నాయి. రైతులకు లబ్ధి చేకూరుస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కారణంగా బ్యాంకులు సైతం వ్యవసాయ రంగానికి రుణాల మంజూరును ఏటా పెంచుతున్నాయి. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా కింద 53.58 లక్షల రైతు కుటుంబాలకు రూ.34,288 కోట్ల పెట్టుబడి సాయం.. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద 84.67 లక్షల మందికి రూ.2,051 కోట్ల లబ్ధి చేకూర్చింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 54.58 లక్షల మందికి రూ.7,802.05 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో 30.85 లక్షల మందికి రూ.3,411 కోట్లు అందించింది. ఫలితంగా రైతుల ఆర్థిక పరపతి గణనీయంగా పెరిగింది. దీనికి తోడు రికార్డు స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. వాటికి మార్కెట్‌లో ఎమ్మెస్పీకి మించి మంచి ధరలు లభిస్తున్నాయి. దీంతో తీసుకున్న రుణాలను రైతులు కూడా సకాలంలో చెల్లిస్తున్నారు. రికార్డు స్థాయిలో మొండి బకాయిలు సైతం వసూలవుతున్నాయి. 2019–20లో మొండి బకాయిలు 3.57 శాతం ఉండగా, 2023–24కు వచ్చేసరికి 2.50 శాతానికి తగ్గింది. దీంతో గత ఐదేళ్లుగా రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు ఆసక్తి చూపిస్తున్నాయి.

రికార్డు స్థాయిలో మంజూరు..

2014–15 నుంచి 2018–19 మధ్య ఐదేళ్లలో 3.97 కోట్ల మందికి రూ.3,64,624 కోట్ల రుణాలు మంజూరు చేస్తే.. గత 57 నెలల్లో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో 5.27 కోట్ల మంది రైతులకు ఏకంగా రూ.8,70,964 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. అంటే టీడీపీ ఐదేళ్ల పాలనలో ఏటా సగటున 79 లక్షల మందికి రూ.72,925 కోట్ల రుణాలిస్తే.. వైఎస్ జగన్ పాలనలో ఇప్పటివరకు ఏటా సగటున 1.05 కోట్ల మంది రైతులకు ఏకంగా రూ.1,74,193 కోట్ల రుణాలు బ్యాంకులు అందించాయి. టీడీపీ హయాంతో పోలిస్తే రైతుల సంఖ్య దాదాపు 30 శాతం పెరిగితే, మంజూరు చేసిన రుణాలు ఏకంగా 142 శాతం పెరిగింది. అంటే ఏ స్థాయిలో రుణాలు మంజూరయ్యాయో అర్థం చేసుకోవచ్చు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.31 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. 2024 ఫిబ్రవరి నాటికి 99.65 లక్షల మందికి 2.08 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందించాయి. మొత్తంగా చూస్తే ఈ ఏడాది షార్ట్ టర్మ్ రుణాలు రూ.1.22 లక్షల కోట్లు కాగా, అగ్రి టర్మ్ రుణాలు రూ.66 వేల కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల రంగానికి రూ.20,816 కోట్లు మంజూరు చేశాయి.

కౌలు రైతులకు వెన్నుదన్ను

భూ యజమానుల హక్కులకు రక్షణ కల్పిస్తూనే వాస్తవ సాగుదారులకు ప్రభుత్వం పంట సాగుదారు హక్కు పత్రాల(సీసీఆర్సీ)ను జారీ చేస్తోంది. వైఎస్ జగన్ పాలనలో ఇప్పటివరకు ఏటా సగటున 5.80 లక్షల మంది చొప్పున 26 లక్షల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేసింది. అలాగే ఈ ఐదేళ్లలో 15 లక్షల మందికి రూ.8,577 కోట్ల రుణాలు మంజూరు చేసింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 8.31 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులు జారీ చేయగా.. వీరిలో ఇప్పటికే 5.48 లక్షల మందికి రూ.1,908 కోట్ల పంట రుణాలు మంజూరయ్యాయి.

ఎన్నికలప్పుడు ప్యాకేజీ కోసమే వర్గీకరణ అంశం తెరపైకి..

- ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి మంద కృష్ణ మాదిగది ఇదే తంతు
- మాదిగలపై కేసులు పెట్టిన బాబుకే ఓటేయాలనడం కృష్ణమాదిగ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే..
- పెద్ద మాదిగగా ఉంటానన్న చంద్రబాబు ఏం చేశారు?
- మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు మాదిగ



ఒంగోలు: చంద్రబాబు చంకలో పెంపుడు కుక్కలా మంద కృష్ణమాదిగ వ్యవహరిస్తున్నారని మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికట్టాయని, అప్పుడు చంద్రబాబు.. చెప్పులు కుడుతూ పెద్ద మాదిగగా ఉంటానంటూ ప్రకటించారని, కానీ సమస్యలు తీర్చకపోగా కురుక్షేత్ర సభను ఈ రాష్ట్రంలో పెట్టనీయకుండా పక్క రాష్ట్రానికి తరలించిన వ్యక్తి చంద్రబాబుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో అనేక మంది మాదిగలపై ప్రభుత్వం కేసులు పెట్టినా చంద్రబాబు కూటమికే ఓటేయాలంటూ మందకృష్ణమాదిగ అడగడం కేవలం ఆయన వ్యక్తిగత లాభం కోసమే తప్ప మాదిగల కోసం కాదన్నారు. వర్గీకరణ అంశాన్ని అడ్డం పెట్టుకుని మందకృష్ణ మాదిగ లాభపడుతున్నారన్న విషయాన్ని మాదిగలు అర్థం చేసుకున్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో కేవలం రావెల్ల కిషోర్‌బాబు, జవహర్‌లకు మాత్రమే కొద్దికాలం పాటు మంత్రులుగా మాదిగలకు అవకాశం దక్కిందన్నారు. మరో వైపు ఆర్టీసీ చైర్మన్‌గా వర్ల రామయ్య, లీడ్ క్యాప్ చైర్మన్‌గా గూడూరి ఎరిక్షన్‌బాబును నియమించినట్టు తెలిపారు. కానీ నేడు జగన్ ప్రభుత్వంలో విద్యా శాఖ/పురపాలక శాఖ మంత్రి, హోంశాఖ మంత్రి పదవులు మాదిగలకు దక్కాయని, ఇవి కాకుండా తూర్పుగోదావరి వంటి జిల్లాలో కనీస గుర్తింపు కూడా లేని ప్రాంతంలో ఒక ఎమ్మెల్సీ కూడా ఇచ్చిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదేనన్నారు. మాదిగ కార్పొరేషన్, లీడ్ క్యాప్ చైర్మన్, మానవ హక్కుల కమిషన్‌తో పాటు అనేక రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన కమిషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్.. ఇలా అనేక పదవులు ప్రస్తుత ప్రభుత్వంలో మాదిగలకు లభించాయన్నారు. వర్గీకరణ అంశం కేవలం కేంద్రం చేతిలో ఉందని సీఎం వైఎస్ జగన్ స్పష్టంగా చెప్పారని, కేంద్రం దానిపై తీసుకునే నిర్ణయాన్ని తాము స్వాగతిస్తామన్నారన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు హయాంలో మాదిగలపై పెట్టిన కేసులన్నీ తొలగించింది కూడా వైఎస్ జగనేనని గుర్తు చేశారు.

532 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్టు
- అల్లూరి జిల్లా బచింతలో ఘటన



నిందితులతో పోలీసులు

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ బచింత గ్రామంలో నిల్వ ఉంచిన 532 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం... ఒడిశాలోని నేరేడుమిల్లి నుంచి గంజాయిని తీసుకువచ్చినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐలు రామకృష్ణ, లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. 17 బస్తాల్లో నిల్వ ఉంచిన 532 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ రూ.26 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. చింతపల్లి మండలం తాజంగి పంచాయతీ గొడుగుమామిడికి చెందిన పాంగి సుందరరావు, డౌనూరు పంచాయతీ బచింతకు చెందిన వంతల చిన్న, పాంగి మాణిక్యం అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు.

క్లుప్తంగా...

డీఏల విడుదలపై ఈయూ హర్షం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు విడుదల చేయడంపై ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) హర్షం వ్యక్తం చేసింది. పెండింగ్ డీఏల విడుదలతో ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఈయూ అధ్యక్ష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పి.దామోదర రావు, జీవీ నరసయ్య ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీకి జాతీయస్థాయిలో ఐదు అవార్డులు రావడంపై ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) హర్షం వ్యక్తం చేసింది. సాంకేతిక విభాగం, సిబ్బంది సంక్షేమం, ఇంధన సామర్థ్యం, టికెట్ల ద్వారా ఆదాయం, డిజిటల్ యాప్ ద్వారా టికెట్ల జారీ విభాగాల్లో అవార్డులు సాధించడం ఆర్టీసీ సమర్థతకు గుర్తింపుగా పేర్కొంది. అసోసియేషన్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అండర్ టేకింగ్స్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆర్టీసీ ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమలరావును అభినందించింది. ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య విజయవాడలోని ఆర్టీసీ భవన్‌లో ఎండీ ద్వారకా తిరుమలరావును బుధవారం కలిసి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈయూ ప్రతినిధులు ఎండీఏ సిద్ధిక్, టీవీ భవాని, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 27న పాలిసెట్-2024

- ఏప్రిల్ 18 నుంచి సాధారణ పరీక్షలు
- సాంకేతిక విద్య శాఖ కమిషనర్ నాగరాణి




సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 27న పాలిసెట్-2024 నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు పాలిటెక్నిక్ (కరిక్యులమ్-2020) 4, 5 సెమిస్టర్ల సాధారణ పరీక్షలు ఏప్రిల్ 18 నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఇందులో కరిక్యులమ్ 2020, 2016తో పాటు ఫార్మసీ కోర్సులకు సంబంధించి ఈఆర్-91/ఈఆర్-20 కరిక్యులమ్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అనుమతిస్తున్నామన్నారు. మార్చి 26వ తేదీలోగా అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. కరిక్యులమ్ 2023 మొదటి సంవత్సరం విద్యార్థులకు మే2వ తేదీన పరీక్షలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేశారు.

ఏపీఈఏపీ సెట్ పరీక్ష తేదీ మార్పు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2024 షెడ్యూల్‌లో మార్పులు చేస్తూ ఉన్నత విద్యా మండలి బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గతంలో మే 13 నుంచి 19 వరకు ప్రవేశ పరీక్షల తేదీలను ప్రకటించింది. అయితే మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుండటంతో ఈఏపీ సెట్‌ను రీషెడ్యూల్ చేసింది. ఇందులో భాగంగా మే 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, 18 నుంచి 22వ తేదీవరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. ఇక జూన్ 3 నుంచి 7వరకు జరగాల్సిన ఏపీపీజీసెట్ పరీక్షలను 10 నుంచి 14వ తేదీకి మార్చింది. తాజాగా ఏపీ రీసెర్చ్ సెట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగియడంతో ప్రవేశ పరీక్షలను మే 2 నుంచి 5వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది.

జూన్ 23న నీట్ పీజీ

- జూలై 15న ఫలితాలు
- నేషనల్ మెడికల్ కమిషన్ వెల్లడి



సాక్షి, అమరావతి: వైద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పీజీ-2024ను ఈ ఏడాది జూన్ 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బుధవారం విడుదల చేసింది. వచ్చే జూలై 7న నీట్ పీజీ నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. కాగా, జూన్ 23వ తేదీనే పరీక్ష నిర్వహించి, జూలై 15న ఫలితాలు ప్రకటించనున్నట్టు సవరించిన షెడ్యూల్‌లో వెల్లడించారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆగస్టు 5 నుంచి అక్టోబర్ 15 మధ్య ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 16వ తేదీ నుంచి అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. కళాశాలల్లో చేరికలకు అక్టోబర్ 21 చివరి గడువుగా పేర్కొన్నారు. నీట్ పీజీ-2024 అర్హత పరీక్ష రాయడానికి ఆగస్టు 15 లోగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

27న 'ఆక్వా' వ్యవస్థాపకత, సాధికారతపై సెమినార్

సాక్షి, అమరావతి: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆక్వా పరిశ్రమలో వ్యవస్థాపకత, సాధికారత అనే అంశంపై ఈ నెల 27వ తేదీన విజయవాడలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ రీజియన్ చైర్మన్ మలినేని రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్, భోజన వసతి కల్పించామని పేర్కొన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 98480 77227 లేదా andhrachambervijayawada@gm-ail.com అనే వెబ్‌సైట్‌లో కానీ సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుష్కలంగా మందులు


సీఎం జగన్ పాలనలో ఆస్పత్రుల్లో మందుల కొరత రాకుండా చర్యలు

- డబ్ల్యూహెచ్‌వో, జీఎంపీ ప్రమాణాలతో నాణ్యమైన మందులు సరఫరా
- టీడీపీ ప్రభుత్వంలో మందుల సరఫరాకు 2015–19 మధ్య రూ. 868 కోట్లు ఖర్చు
- ప్రస్తుత ప్రభుత్వంలో 2019 నుంచి రూ. 2,090 కోట్లు వ్యయం



సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు చాలా మెరుగయ్యాయి. చంద్రబాబు పాలనలో ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందులు, ఇతర వనరులకు తీవ్ర కొరత ఉండేది. దీంతో అప్పట్లో ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. ఈ పరిస్థితులను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం గడిచిన ఐదేళ్ల పాలనలో పూర్తిగా చక్కబెట్టింది. ఆస్పత్రుల్లో పుష్కలంగా మందులను ఉంచేలా చర్యలు తీసుకుంది. 2019 ముందు ఏటా చంద్రబాబు ప్రభుత్వం చేసిన ఖర్చు కన్నా రెట్టింపు ఖర్చు చేసి మందుల సరఫరా చేపట్టింది.

టీడీపీ ప్రభుత్వంలో మందుల కోసం చేసిన ఖర్చు ఇలా (రూ.కోట్లలో)



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మందుల కోసం చేసిన ఖర్చు ఇలా (రూ.కోట్లలో)



కొరతకు తావివ్వకుండా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డబ్ల్యూహెచ్‌వో, గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ (జీఎంపీ) ప్రమాణాలు కలిగిన నాణ్యమైన మందులను ప్రభుత్వాస్పత్రులకు సరఫరా చేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో మందుల సరఫరాకు సంబంధించి 2018–19 సమయంలో రేట్ కాంట్రాక్ట్‌లో 608 గాను 229 మందులే ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వంలో 608 మందులకు గాను 566 మందులు రేట్ కాంట్రాక్ట్‌లో ఉంటున్నాయి. రేట్ కాంట్రాక్ట్‌లో ఉన్న మందులను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ ద్వారా ఏపీఎంఎస్ఐడీసీ సరఫరా చేస్తోంది. తక్కువ వినియోగం ఉన్న మందులను డి-సెంట్రలైజ్డ్ బడ్జెట్ ద్వారా స్థానిక సరఫరాదారుల నుంచి నేరుగా ఆస్పత్రులకు అందిస్తున్నారు. ఇలా విలేజ్ క్లినిక్స్‌లో 105, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 200లకు పైగా, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో 362, బోధనాస్పత్రుల్లో 608 రకాల మందులను ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సరఫరా చేస్తున్నారు. పీహెచ్‌సీలు, విలేజ్‌క్లినిక్స్‌కు మూడు నెలలకు సరిపడా మందులను ముందే అందుబాటులో ఉంచుతున్నారు.

మందుల బడ్జెట్‌లో గణనీయమైన పెరుగుదల

టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వంలో మందుల కోసం బడ్జెట్ గణనీయంగా పెరిగింది. పెరిగిన బడ్జెట్ ప్రభుత్వాస్పత్రుల్లో పుష్కలంగా మందులు ఉంటున్నాయనడానికి నిదర్శనంగా నిలిచింది. టీడీపీ ప్రభుత్వంలో 2015–19 మధ్య మందుల కోసం సుమారు రూ. 868 కోట్లు ఖర్చు చేశారు. ఈ లెక్కన ఏడాదికి సుమారు రూ. 216 కోట్లు మాత్రమే మందులకు వెచ్చించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2019 నుంచి మందుల కోసం రూ. 2,090.39 కోట్లు ఖర్చు చేసింది. అంటే ఏడాదికి రూ. 418.07 కోట్లు వ్యయం చేశారు. దీన్ని బట్టి టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఏటా రూ. 200 కోట్లకు పైగా అదనంగా మందుల కోసమే ఖర్చు పెట్టారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగి వైద్య సేవల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.700 కోట్ల మేర మందుల కోసం ఖర్చు పెట్టాల్సి ఉంది.

గల్లా ఎన్నికపై పిటిషన్ కొట్టివేత

పోస్టల్ బ్యాలెట్ల తిరస్కరణపై మోదుగుల వాదనను తోసిపుచ్చిన హైకోర్టు



సాక్షి, అమరావతి: గత లోక్‌సభ ఎన్నికల్లో గుంటూరు నుంచి గల్లా జయదేవ్ ఎన్నికను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అప్పటి అభ్యర్థి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు బుధవారం తీర్పు వెలువరించారు. 2019లో సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి గల్లా జయదేవ్ ఎన్నికయ్యారు. ప్రత్యర్థిగా నిలిచిన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. పోస్టల్ బ్యాలెట్‌లను తిరస్కరించడం వల్లే తాను ఓటమి చెందానని, ఈ నేపథ్యంలో జయదేవ్ ఎన్నికను చెల్లనిదిగా ప్రకటించాలని కోరుతూ మోదుగుల 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం 9,782 పోస్టల్ బ్యాలెట్లను తిరిగి లెక్కించి ఆ తరువాత ఫలితాన్ని వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే.. గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని 13వ పోలింగ్ స్టేషన్‌లో ఓట్లను కూడా తిరిగి లెక్కించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు సుదీర్ఘ విచారణ జరిపారు. ఫారం-13బీ కవర్‌పై పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన సీరియల్ నంబర్‌ను పొందుపర్చనందున అలాంటి బ్యాలెట్లను తిరస్కరించడం ఎంతమాత్రం సరికాదని మోదుగుల హైకోర్టుకు వివరించారు. సీరియల్ నంబర్ పొందుపర్చాల్సిన బాధ్యత రిటర్నింగ్ అధికారికి సంబంధించిన సిబ్బంది బాధ్యత అని ఆయన తెలిపారు. రిటర్నింగ్ అధికారి, సిబ్బంది చేసిన తప్పునకు తాను మూల్యం చెల్లించాలనడం ఎంతమాత్రం సరికాదని విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మోదుగుల వాదనను తోసిపుచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఫారం-13బీలో పోస్టల్ బ్యాలెట్ సీరియల్ నంబర్ పొందుపరచకపోతే దానిని తిరస్కరించవచ్చని స్పష్టంగా ఉందని తెలిపారు.

హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంచాలి

హైకోర్టులో మరో పిల్..కొట్టేసిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: హైదరాబాద్‌ను మరో పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు వీలుగా చట్ట సవరణ చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు కొట్టేసింది. ఇదే అభ్యర్థనతో దాఖలైన పిల్‌ను ఇప్పటికే కొట్టేశామని గుర్తు చేస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 2 రాష్ట్రాల మధ్య ఆస్తి, అప్పుల విభజన ఇంకా పూర్తి కాలేదని, ఈ విషయంలో కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైందని, అందువల్ల మరో పదేళ్ల పాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా ఆదేశించాలంటూ నెల్లూరు జిల్లా అక్కంపేటకు చెందిన నారపరెడ్డి కిరణ్‌కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపున న్యాయవాది గుండాల శివప్రసాదరెడ్డి వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర విభజన అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఉమ్మడి రాజధాని విషయంలో మరిన్ని డాక్యుమెంట్లను కోర్టు ముందుంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ స్పందిస్తూ ఇంతకు ముందు ఇదే అంశంపై పిల్ దాఖలైందని, దాన్ని ఇదే ధర్మాసనం కొట్టేసిందన్నారు. గతంలో దాఖలైన పిల్‌లోని అంశాలను యథాతథంగా కట్ పేస్ట్ చేసి ఈ పిల్‌ను తయారు చేశారని తెలిపారు. ఆ పిల్‌ను కాపీ కొట్టి తాజా పిల్ దాఖలు చేశారంటా? అని ధర్మాసనం ప్రశ్నించగా, అవునని సుమన్ చెప్పారు. ఈ సమయంలో శివప్రసాద్ జోక్యం చేసుకుంటూ, ఈ వ్యవహారంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధం లేదని, తనపై కక్షతోనే ఈ విధంగా వాదనలు వినిపిస్తోందన్నారు. కక్ష సాధింపులు అలాంటివేవీ లేవన్న ధర్మాసనం, ఈ పిల్‌ను కొట్టేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీసిటీని సందర్శించిన బెల్జియం రాయబారి

పారిశ్రామిక ప్రగతిపై ప్రశంస

శ్రీసిటీ(వరదయ్యపాళెం): భారత్‌లోని బెల్జియం రాయబారి డిడియర్ వాండర్ హాసెల్ట్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, ఇక్కడ ప్రపంచశ్రేణి మౌలిక వసతులు, ప్రత్యేకతలు, వేగవంతమైన పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు.

శ్రీసిటీ ప్రగతి, మౌలిక సదుపాయాలపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన వాండర్ హాసెల్ట్, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటి పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూల పర్యావరణ వ్యవస్థ చాలా బాగుందని కితాబిచ్చారు. చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు సైతం ఇది అనువుగా ఉంటుందన్నారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే మరిన్ని బెల్జియన్ కంపెనీలకు తాను శ్రీసిటీని పరిచయం చేస్తానని చెప్పారు. దీనిపై స్పందించిన డాక్టర్ సన్నారెడ్డి, గణనీయమైన సంఖ్యలో బెల్జియం సంస్థలు ఆసక్తి చూపితే, ప్రత్యేక బెల్జియం పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.



వెర్మీరెన్ ప్లాంట్ నాల్గవ దశ విస్తరణకు శంకుస్థాపన చేస్తున్న వాండర్‌హాసెల్ట్

పర్యటనలో భాగంగా శ్రీసిటీలోని బెల్జియంకు చెందిన వైద్య పరికరాల తయారీ పరిశ్రమ వెర్మీరెన్ ఇండియా రిహాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను వాండర్ హాసెల్ట్ సందర్శించారు. వెర్మీరెన్ గ్రూప్ చైర్మన్ అండ్ సీఈఓ పాట్రిక్ వెర్మీరెన్, మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ రియాజ్ ఖాద్రీ ఆయనకు స్వాగతం పలికి, కంపెనీ ఉత్పత్తులు, వృద్ధి గురించి వివరించారు. అనంతరం వెర్మీరెన్ ప్లాంట్ నాలుగో దశ విస్తరణకు వాండర్ హాసెల్ట్ శంకుస్థాపన చేశారు. బెల్జియంలోని ఫ్లాండర్స్ రీజియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ జయంత్ నడిగర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు తేలికపాటి వర్షాలు

- బలహీన పడిన ద్రోణి
- సీమలో వేడి వాతావరణం



సాక్షి, విశాఖపట్నం: దక్షిణ తమిళనాడు నుంచి పశ్చిమ విదర్భ వరకు.. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో కోస్తాంధ్రలో పలుచోట్ల బుధవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు సంభవించాయి. కాగా.. ఉత్తరాంధ్ర వరకు విస్తరించిన ద్రోణి బలహీనపడింది. మరోవైపు పశ్చిమ విదర్భ వరకు విస్తరించిన ద్రోణి బుధవారం కేరళ నుంచి ఉత్తర తెలంగాణ వరకు సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తులో కొనసాగుతూ ఉత్తర తెలంగాణ పరిసర ప్రాంతాల్లోని ఉపరితల ఆవర్తనం వరకు విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో గురువారం కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉత్తర కోస్తాలో ఉరుములు, మెరుపులకు ఆస్కారం ఉందని పేర్కొంది. రాయలసీమలో మాత్రం వేడితో కూడిన పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపింది. కాగా బుధవారం అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా రాజాం (అనకాపల్లి)లో 5.9 సెం.మీ. వర్షపాతం రికార్డయింది. చొల్లంగి (కాకినాడ)లో 5.4, జగ్గంపేట (కాకినాడ)లో 5.2, కొత్తకోట (అనకాపల్లి)లో 4.7, కిర్లంపూడి (కాకినాడ) 3.5, రాజానగరం (తూర్పు గోదావరి) 3.4, పెదగంట్యాడలో (విశాఖ) 3.2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. మొత్తం 49,993 మంది విద్యార్థులు పరీక్ష కోసం నమోదు చేసుకోగా ఈనెల 10వ తేదీన నిర్వహించిన పరీక్షకు 42,928 మంది హాజరైనట్టు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్) సంస్థ కార్యదర్శి డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల తెలిపారు. కాగా ఈ గురుకులాల్లో బాలికలకు 9,750 సీట్లు, బాలురకు 5,270 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆన్‌లైన్ విధానంలో శుక్రవారం మొదటి దశ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం ఖాళీల ఆధారంగా జోన్ల వారీ ఎంపిక ప్రక్రియ చేపడతామన్నారు. ఫలితాలను https://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని కార్యదర్శి తెలిపారు.

ఏఎంవీఐ అభ్యర్థుల జాబితా విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల ఫలితాలను ఏపీపీఎస్సీ బుధవారం ప్రకటించింది. పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు.

16 ఏళ్ల డిమాండ్.. 16 రోజుల్లో పరిష్కారం

▶ మొదటి పేజీ తరువాయి

విధాన నిర్ణయాలను సత్వరం ఆమోదించడంపట్ల దాదాపు లక్షమంది పోలీసు అధికారులు, సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కోరిన వెంటనే పరిష్కారం

బ్రిటిష్ కాలంలో ప్రవేశపెట్టిన తమ యూనిఫామ్‌లో మార్పులు చేయాలని ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) కానిస్టేబుళ్లు 16ఏళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఆ యూనిఫామ్ తమ ఆత్మగౌరవానికి భంగకరంగా ఉందని చెబుతూ వచ్చినా ఇన్నేళ్లు ఫలితం లేకపోయింది. కానీ ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని కలసి తమ యూనిఫామ్‌లో మార్పులు చేయాలని కోరారు. వారు కోరిన 16రోజుల్లోనే ఏఆర్, ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుళ్ల యూనిఫామ్‌లో మార్పులు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. బ్యారెట్ టోపీ స్థానంలో పీక్ టోపీని ప్రవేశపెట్టింది. కానిస్టేబుల్ నుంచి రిజర్వ్ ఎస్ఐ స్థాయివరకు నలుపు రంగు విజిల్ కార్డ్‌ను తీసుకువచ్చింది. ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు విజిల్ కార్డ్‌తో పాటు పోలీస్ యాంబ్లమ్ ఉన్న నలుపు బకిల్ ఉన్న బెల్ట్‌ను యూనిఫామ్‌లో భాగం చేసింది. దాంతో ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల ఆత్మ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

ఎస్ఐలకు గెజిటెడ్ హోదా

రాష్ట్రంలో ఎస్ఐలకు గెజిటెడ్ అధికారి హోదా కల్పించాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కొత్త పీఆర్సీ ద్వారా ఆమేరకు సిఫార్సు చేయనున్నట్టుగా ప్రకటించింది.

ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట

పోలీసుల ఆర్థిక ప్రయోజనాలు కల్పించే డిమాండ్లపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సత్వరం చర్యలు తీసుకున్నారు. ఎస్ఎల్ఆర్, ఏఎస్ఎల్ఎస్ బిల్లులను మార్చి 31లోగా చెల్లించాలని ఆర్థిక శాఖను వారం రోజుల క్రితమే ఆదేశించారు.

- పోలీసులకు వివిధ రిస్క్ అలవెన్సుల మంజూరు.
- పోలీసులకు 24 ఏళ్ల సర్వీసు ఇంక్రిమెంట్‌ను కొనసాగిస్తూనే 30 ఏళ్ల సర్వీసుకు ప్రత్యేక ఇంక్రిమెంట్.
- ఏపీఎస్పీ నుంచి ఏఆర్‌కు మారే పోలీసులకు 6, 12, 18, 24 ఇంక్రిమెంట్ల మంజూరు

ఇతర ప్రయోజనాలు

- సర్వీసుకు సంబంధించిన సమస్యలను విన్నవించుకునేందుకు ఇప్పటివరకు సరైన వేదికలేకపోవడం పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. దీనికి పరిష్కారంగా డీజీపీ కార్యాలయంలో, జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనరేట్లలో ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు.
- కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాల్లో పోలీసు ఆసుపత్రులను ఏర్పాటు చేయడంతోపాటు వైద్య అధికారులను నియమించాలని సీఎం ఆదేశం.
- మహిళా పోలీసులకు అదనంగా ఏడాదికి అయిదు క్యాజువల్ లీవులు మంజూరు చేయడంతోపాటు చైల్డ్ కేర్ లీవులను 150 రోజుల నుంచి 180 రోజులకు పెంపు.
- విధి నిర్వహణలో భాగంగా రాజధానికి వచ్చే మహిళా పోలీసులకు ప్రత్యేక వసతి సౌకర్యం.
- పోలీసులకు ఎల్‌టీసీ సౌకర్యం పునరుద్ధరణ
- పోలీసు అధికారుల సంఘానికి తొలిసారిగా రాష్ట్ర జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో భాగం చేశారు. ఇటీవల నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకున్నారు.

అమరవీరుల పిల్లలకు రిజర్వేషన్

విధి నిర్వహణలో ఆశువులు బాసిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు మరింత ప్రయోజనం కలిగించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. అమరవీరుల కుటుంబాల పిల్లలకు ఇంజనీరింగ్, వైద్య విద్య తదితర కోర్సుల్లో 2శాతం రిజర్వేషన్ కల్పించారు. దశాబ్దాలుగా అమరవీరుల కుటుంబాల పిల్లలకు కేవలం 0.25 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉండేది. ఆ రిజర్వేషన్‌ను ఏకంగా 2 శాతానికి పెంచడంతో అమరవీరుల కుటుంబాల్లోని పిల్లలు ఇంజనీరింగ్, వైద్య విద్య, ఇతర ఉన్నత కోర్సుల్లో చేరి ఉజ్వల భవిష్యత్‌ను సాధించేందుకు ముఖ్యమంత్రి అండగా నిలిచారు.

తెలంగాణ

హైదరాబాద్ విద్యార్థి అమెరికాలో కిడ్నాప్



మల్లాపూర్ (హైదరాబాద్): ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన హైదరాబాద్ నాచారానికి చెందిన మహ్మద్ సలీం కుమారుడు అబ్దుల్ మహ్మద్ అర్ఫద్ (25)ను అక్కడ దుండగులు కిడ్నాప్ చేశారు. 8 నెలల క్రితం క్లీవ్‌లాండ్ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ కోసం అబ్దుల్ అమెరికాకు వెళ్లాడు. ఈ నెల 8న చివరిసారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాడు. మూడు రోజుల క్రితం డ్రగ్ మాఫియాకు చెందిన దుండగులు సలీంకు ఫోన్ చేసి.. మీ అబ్బాయిని కిడ్నాప్ చేశామని, 1200 డాలర్లు (సుమారు లక్ష రూపాయలు) ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి నుంచి వరుసగా బెదిరింపు మెసేజ్‌లు పెడుతున్నారు. డబ్బు ఇవ్వకపోతే అబ్దుల్ కిడ్నీని విక్రయిస్తామని బెదిరించినట్లు తెలిసింది. భయాందోళనకు గురైన సలీం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆశ్రయించారు. మరిన్ని వివరాల కోసం 'సాక్షి' ప్రయత్నించగా వెల్లడించేందుకు సలీం నిరాకరించారు. ఒకట్రెండు రోజుల్లో తాను మీడియా ముందుకొచ్చి అన్ని విషయాలను చెబుతానన్నారు. కాగా, అబ్దుల్ బంధువులు క్లీవ్‌లాండ్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, అక్కడి పోలీసులు లుకౌట్ నోటీసు జారీచేశారు.



భారత్, యూఎస్ రక్షణ రంగ సంబంధాలు మరింత బలోపేతం

విశాఖ సిటీ: భారత్-యూఎస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయాంఫ్-2024 విన్యాసాల్లో పాల్గొనేందుకు యూఎస్‌కు చెందిన యుద్ధ విమానాలు బుధవారం ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్నాయి. ఈ అధునాతన, బహుముఖ యుద్ధ విమానాలు భారత నావికాదళం, వైమానిక దళాలతో కలిసి విన్యాసాలు చేయనున్నాయి. భారత్, యూఎస్ రక్షణ రంగ సంబంధాలను మరింత పెంపొందించేందుకు ఈ ప్రదర్శన దోహదం చేస్తుందని ఇరు దేశాల అధికారులు చెబుతున్నారు.

అలరిస్తున్న అతిథులు..

తెలంగాణ

నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ, చిన్నయానం గ్రామ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో ఫ్లెమింగో పక్షులు సందడి చేస్తున్నాయి. ప్రతి వేసవిలో యూరప్ ఖండం నుంచి ఈ పక్షులు వలస వచ్చి ఇక్కడ సేదతీరుతాయి. వేసవి ముగియగానే తిరిగి వెళ్లిపోతాయని డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు. - నిజామాబాద్



నృత్య తపస్వి

ఆమె ప్రయాణం నాట్యం.
ఆమె ప్రయత్నం నాట్యకళకు జీవం పోయడం.
నాలుగేళ్ల వయసు నుంచి కూచిపూడిని
జీవనాడిగా చేసుకుని.,
69 ఏళ్ల వయసులోనూ కళను వీడలేదు
హైదరాబాద్ వాసి మద్దాలి ఉషాగాయత్రి.
సుదీర్ఘ నృత్య ప్రయాణంలో భారత్‌తోపాటు
దేశ విదేశాల్లో ఎన్నో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
వందల మంది ఔత్సాహికులు
కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా
200కు పైగా నృత్యాంశాలకు సోలోగా
కొరియోగ్రఫీ చేశారు.
విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలికి బ్యాలే చేసి,
కేంద్ర ప్రభుత్వ అవార్డులు పొందారు.
ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా
ప్రతిష్ఠాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును
అందుకున్న డా. ఉషా గాయత్రి
నృత్య ప్రయాణం తెలుసుకుంటే
ఈ కళాసేవ ఒక తపస్సులా అనిపించకమానదు.


మద్దాలి ఉషాగాయత్రి



రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకుంటూ...

''కూచిపూడి నృత్యానికి సంబంధించిన సాహిత్యం, రచనలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పుస్తకాలుగా తీసుకురావాలనేది నా చిరకాల స్వప్నం. దానిని నిజం చేయాలనే ప్రయత్నంలో ఉన్నాను'' అని తనను తాను పరిచయం చేసుకున్న తపస్వి ఉషాగాయత్రి తన నృత్య జీవన గమ్యాన్ని ఇలా మనముందుంచారు.

''నాలుగేళ్ల వయసులో ఉదయ్ శంకర్ శిష్యుడైన దయాల్ శరణ్ వద్ద నాట్యాభ్యాసం మొదలుపెట్టాను. ఇక్కడే కథక్, ఒడిస్సీ, సంగీతం కూడా నేర్చుకున్నాను. ఆ తర్వాత ప్రఖ్యాత గురువు వేదాంతం జగన్నాథ శర్మ వద్ద కూచిపూడి, పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ, పద్మభూషణ్ డా.వెంపటి చినసత్యం, వేదాంతం ప్రహ్లాద శర్మ వద్ద యక్షగానాలు, ప్రఖ్యాత కళాక్షేత్ర గురువు కమలారాణి వద్ద నట్టువాంగం, పద్మశ్రీ డా.నటరాజ రామకృష్ణ వద్ద పదములు నేర్చుకున్నాను. 1988లో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.ఏ. పూర్తయ్యింది. అంతేకాకుండా 'తెలుగు సాహిత్యంలో సత్యభామ పాత్ర వృద్ధి, వికాసం, నాట్యంలో అవతరణ' అనే అంశం మీద పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పొందాను. రాజీవ్‌గాంధీ విశ్వవిద్యాలయంలోని నృత్య విభాగంలోనూ పనిచేశాను. ఆ తర్వాత దాదాపు పాతిక సంవత్సరాలు పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఉద్యోగం చేశాను. నాట్యానికే అంకితం అవ్వాలనే తపనతో ఉద్యోగానికి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. 'నృత్య కిన్నెర' పేరుతో ఏర్పాటు చేసిన సంస్థ ఆధ్వర్యంలో వందల మందికి శిక్షణనిస్తూ వచ్చాను. ఇందులో 50 మంది శిష్యులు నృత్యంలో డిప్లొమా సర్టిఫికెట్లు పొందారు. 10 మంది చిన్నారులు భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్ పొందారు. నా శిష్యులు దేశవిదేశాల్లో స్థిరపడటమే కాకుండా నృత్యంలో పీహెచ్‌డీ, ఎం.ఏ. పట్టాలు పొంది గురువులు, నర్తకులుగా అభివృద్ధి చెందారని చెప్పుకోవడం ఎంతో సంతోషంగా అనిపిస్తుంది.


మద్దాలి ఉషాగాయత్రి

పాదం కదపని వేదిక లేదు

సంగీత నాటక అకాడమీ, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, టీటీడీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో ఎన్నో వందల ప్రదర్శనలు. దేశంలోని న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోనే కాకుండా విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చాను. భారత స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో 1997లో మారిషస్‌లో ఇచ్చిన ప్రదర్శనకుగాను ఆనాటి ప్రెసిడెంట్ సత్కరించడం ఒక గొప్ప జ్ఞాపకం. ప్రదర్శనల కోసం శిష్యులతోపాటు యూకే, యూరోప్‌లలో పర్యటించాను. యూకేటీఏ, జయతే కూచిపూడి, అంతర్జాతీయ కూచిపూడి ఫెస్టివల్‌లో భాగంగా ప్రదర్శనలు ఇవ్వడం మరో గొప్ప అనుభూతి. ప్రధానంగా దాదాపు 200 లకు పైగా సోలో నృత్యాంశాలకు కొరియోగ్రఫి చేయడంతో పాటు ప్రతిష్ఠాత్మకమైన 16 బ్యాలేలు చేశాను. ఇందులో భాగంగా రచయిత ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ చారిత్రక నవల శివభక్త మార్కండేయ, మా తెలుగుతల్లికి మల్లెపూదండ, స్వర్ణోత్సవ భారతి, వందేమాతరం, సంక్రాంతి లక్ష్మి, రుక్మిణీ సత్య, అలిమేలుమంగ చరిత్ర, యశోదకృష్ణ వంటి బ్యాలేలు ప్రదర్శించాను.

రవీంద్రుని గీతాంజలి మాట నిజమైన వేళ

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలికి బ్యాలే చేయడం నా అదృష్టంగా భావిస్తాను. కలకత్తా వేదికగా ఈ ప్రదర్శన చేసిన సమయంలో ఒక విషయం నన్ను అమితమైన ఆనందానికి లోను చేసింది. 'ఏదో ఒకనాడు, ఎవరో ఒకరు నా సాహిత్యానికి నృత్య రూపాన్ని తీసుకువస్తారు' అని ఆనాడే రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన మాటలను అక్కడి వారు ప్రస్తావించడం మాటల్లో చెప్పలేనంత సంతోషాన్ని, సంతృప్తినిచ్చింది. కావ్యాలకు, కథనాలకు, నృత్యానికి ఎంతటి అనుబంధం ఉంటుందో ఆ సంఘటన రుజువు చేసింది.

12 గంటలు 12 మంది శిష్యులు

నృత్యం దర్శయామిలో భాగంగా 72 సోలో నృత్యాంశాలైన శబ్దాలు, తరంగములు, దరువులు, తిల్లానాలు, అష్టపదులు, కీర్తనలు.. తదితర అంశాలతో 12 మంది శిష్యురాళ్లతో కలిసి 12గంటల పాటు అవిరామంగా నృత్యప్రదర్శన చేశాం. 12గంటల పాటు నిరంతరాయంగా నట్టువాంగం నిర్వహించి దానిని గురువు వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రికి అంకితం చేశాం. చేసిన సోలో ప్రదర్శనలు, బ్యాలేలు న్యూ ఢిల్లీ దూరదర్శన్‌తో పాటు విదేశీ ఛానళ్లలోనూ ప్రసారమయ్యాయి.

ఎంతో ప్రోత్సాహం..

ఈ నృత్య ప్రయాణంలో నా జీవిత భాగస్వామి మద్దాళి రఘురామ్ ప్రోత్సాహం ఎనలేనిది. ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకున్నాను. వాటిలో .. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో 2001లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రీయ అవార్డు 'హంస పురస్కారాన్ని', 2004లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ప్రతిభా పురస్కారం, యూరప్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ నర్తకిగా, న్యూయార్క్‌లో ఉత్తమ నాట్యగురువుగా, సిలికాన్ ఆంధ్ర అంతర్జాతీయ కూచిపూడి కన్వెన్షన్‌లో ఆనాటి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు, మారిషస్ ప్రెసిడెంట్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నృత్యరత్న బిరుదుతోపాటు, ఉత్తమ నర్తకి–నాట్యగురు అవార్డులను పొందాను. 1984లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో ఉత్తమ కళాకారిణిగానూ, భారత్‌తో పాటు విదేశాల్లో నిర్వహించిన పలు అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలకు న్యాయనిర్ణేతగా సేవలందించాను.

గత డిసెంబర్‌లో స్ట్రోక్ వచ్చి వీల్‌చెయిర్‌లో ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. అయినా నా కళా తపన ఆగలేదు. వీల్ చెయిర్ నుంచే విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో శిక్షణను అందిస్తున్నాను. ఈ నెల 6న రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక పురస్కారాన్ని వీల్‌చెయిర్‌లో ఉండే అందుకున్నాను. నా శ్వాస ఉన్నంత వరకు కళాసేవలో తరించాలని, కళలో ఔత్సాహికులను నిష్ణాతులను చేయాలన్నదే నా తపన' అంటూ ఉషాగాయత్రి తన సుదీర్ఘ నృత్య ప్రయాణాన్ని ఎంతో ఆనందంగా మన ముందు ఆవిష్కరించారు.

– హనుమాద్రి శ్రీకాంత్,
సాక్షి సిటీ, హైదరాబాద్



ఆమె ఉన్న చోట పులి ఉంటుంది



మన దేశంలో దాదాపు 55 టైగర్ రిజర్వాయర్‌లు ఉన్నాయి. వాటన్నింటినీ తన కెమెరాలో నిక్షిప్తం చేసింది ఆర్జూ ఖురానా. సరిగా చెప్పాలంటే పులి ఉన్న చోటల్లా ఆమె ఉంటుంది. వృత్తి రీత్యా అడ్వకేట్ అయినా ఆ పని మానేసి కెమెరాను నేస్తంగా అడవిని నివాసంగా చేసుకుని తిరుగుతూ ఆమె తీస్తున్న ఫొటోలు పెద్ద గుర్తింపునిచ్చాయి. ఆర్జూ పరిచయం.

అక్టోబర్ 1, 2023 నుంచి నేటి వరకూ 29 ఏళ్ల ఆర్జూ ఖురానా అడవుల్లోనే ఉంటూ వందల మైళ్లు తిరుగుతూ ఉందంటే నమ్ముతారా? నిజం. 'ఆల్ టైగర్ రిజర్వ్స్ ప్రాజెక్ట్' (ఏటిఆర్) కోసం ప్రభుత్వం అప్పజెప్పిన పనిలో ఆమె తలమునకలుగా నిమగ్నమైంది. మన దేశంలో 55 టైగర్ రిజర్వ్‌లు ఉన్నాయి. అయితే వాటిలో కొన్నింటికే టూరిస్ట్ అట్రాక్షన్ ఉంది. మిగిలిన వాటిని కూడా అందంగా ఫొటోలలో బంధించి, ప్రచారానికి ఉపయోగించి, టూరిస్ట్‌లను ఆకర్షించేందుకు నిర్దేశించిన ప్రాజెక్టే ఏ.టి.ఆర్. దానిలో భాగంగా అక్టోబర్ 1న రాజస్థాన్‌లోని సరిస్కా టైగర్ రిజర్వ్‌తో మొదలెట్టి మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో 43 టైగర్ రిజర్వ్‌లను కవర్ చేసి మరో రెండు నెలల్లో మిగిలినవి చేసి ఆఖరున నైనిటాల్‌లో ఉన్నా జిమ్ కార్బెట్ రిజర్వ్ ఫారెస్ట్‌ను ఫొటోలు తీయడం ద్వారా ఆమె పని ముగిస్తుంది. 'రోజుకు 14 గంటలు పని చేస్తున్నాను. మానసికంగా శారీరకంగా చాలా కష్టమైనది ఈ పని. కాని ఇందులో నాకు ఆనందం ఉంది' అంటుంది ఆర్జూ ఖురానా.

లా చదివి

'మాది ఢిల్లీ. మా నాన్నకు నేను అడ్వకేట్ కావాలని కోరిక. నాకేమో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కావాలని చిన్నప్పటి నుంచి కల. ఒక్కతే కూతురుని. అడవుల్లో కెమెరా పట్టుకుని తిరగడానికి అమ్మా నాన్నలు ఒప్పుకోలేదు. నాన్న కోసం లా చేశాను కాని చివరకు ఒప్పించి వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌ని అయ్యాను. ఇందుకోసం నేను ఢిల్లీలో బేసిక్ ఫొటోగ్రఫీ కోర్సును చేశాను. కాని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ వేరు. దానికి వేరే శిక్షణ కావాలి. నెట్‌లో వెతికితే సుధీర్ శివరామ్ అనే ప్రసిద్ధ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ మాలాంటి వారి కోసం క్యాంప్స్ నిర్వహిస్తారని తెలిసింది. ఆయన రాజస్థాన్‌లోని భరత్‌పూర్ రిజర్వ్‌ఫారెస్ట్‌లో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ క్యాంప్ నిర్వహించినప్పుడు హాజరయ్యి పని కొంత తెలుసుకున్నాను. రెండు సారస్ కొంగల సరదా సంప్రదింపులను నేను మొదటిసారి ఫొటో తీశాను. అది అందరికీ నచ్చింది. ఆ క్షణమే అనుకున్నాను... అరణ్యానికి జనారణ్యానికి మధ్య వారధిగా నేను ఉండగలను అని. అడవుల్లో ఉండే పక్షులు జంతువుల తరపున వకాల్తా పుచ్చుకోగలను అని' అంటుంది ఆర్జూ ఖురానా.

కలిసి బతకాలి

'మనుషులు కలిసి బతకడానికి కష్టపడుతుంటారు. అడవుల్లో తిరిగితే వందల వేల జీవులు ఎలా ఒకదానితో ఒకటి కలిసి బతుకుతాయో తెలుస్తుంది. అవి మనతో కూడా కలిసి బతకాలనే అనుకుంటాయి. కాని మన స్వార్థం కోసం అడవులు ధ్వంసం చేస్తూ వాటిని నాశనం చేస్తున్నాం. గత 50 ఏళ్లలో భూమి మీద ఉన్న జంతువులలో 50 శాతం నశించిపోయాయంటే నమ్ముతారా? ఇది నిజం. మనలో ప్రతి ఒక్కరం అడవుల పరిరక్షణకు, తద్వారా వన్యప్రాణి పరిరక్షణకు పూనుకోవాలి. లేకపోతే మిగిలేదేమీ ఉండదు. ఒక పులి ఉండదు. ఒక నక్కా కనిపించదు' అంటోంది ఆర్జూ ఖురానా.

పశ్చిమ కనుమలలో ప్రాణదాతలు

'ప్రాణదాత' అనే మాట మనుషులకు సంబంధించే ఎక్కువగా వినబడుతుంది. 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్'లోని మహిళలు మాత్రం పశ్చిమ కనుమల అరణ్యాలలోని మొక్కల ప్రాణదాతలు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మొక్కలు, చెట్లను కాపాడడానికి 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' ద్వారా మొక్కవోని కృషి చేస్తున్నారు. పచ్చటి అడవి పెదవుల మీద చిరునవ్వు చెరిగిపోకుండా కష్టపడుతున్నారు...

పశ్చిమ కనుమల అడవులు అపూర్వమైన చెట్లజాతులు, జంతుజాలం, పక్షి, చేప జాతులకు ప్రసిద్ధి పొందాయి. అయితే ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ది కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయుసిఎన్) పశ్చిమ కనుమల గురించి ఆందోళన వ్యక్తం చేసింది. అటవీ నిర్మూలన, వాతావరణ మార్పుల వల్ల మన దేశంలోని పశ్చిమ కనుమలు ప్రమాదంలో పడ్డాయి. ఈ ప్రాంతంలోని అడవులను రక్షించుకోవడానికి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడానికి కేరళలోని పెరియాలో ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పాటైన 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' లోని 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్' కృషి చేస్తోంది.

27 మంది మహిళలు ఉన్న 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్' 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ'లో అరుదైన మొక్కలను సంరక్షిస్తోంది. 'మొక్కలను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. ప్రమాదంలో ఉన్న మొక్కలకు ఈ గురుకులం శరణార్థి శిబిరంలాంటిది. ఆస్పత్రి కూడా అనుకోవచ్చు. మొక్కలకు సంబంధించిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ మట్టిపాత్రలతో ఉంటుంది' అంటుంది ఎకోసిస్టమ్ గార్డెనర్ సుప్రభా శేషన్.

తొంభై శాతం అడవులు మాయమైన పరిస్థితిని 'పర్యావరణ మారణహోమం'గా అభివర్ణిస్తుంది సుప్రభా శేషన్.

అడవులనే ఇల్లుగా భావిస్తున్న సుప్రభ శేషన్ 'గ్రీన్ ఆస్కార్'గా గుర్తింపు పొందిన యూకేలోని టాప్ ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్ 'విట్లీ'కి ఎంపికైంది.

గురుకుల బొటానికల్ శాంక్చువరీ (జీబీఎస్) అరుదైన మొక్కల 'స్వర్గధామం'గా పేరు తెచ్చుకుంది

పశ్చిమ కనుమల ప్రాంతాలలో 50 లక్షల మందికి పైగా నివసిస్తున్నందున అడవులు ప్రమాదం అంచున ఉన్నాయి. 28 ఏళ్లుగా 'జీబీఎస్'లో పనిచేస్తున్న సుప్రభా శేషన్ అరణ్యాలకు సంబంధించిన పరిస్థితులు విషమించడాన్ని ప్రత్యక్షంగా చూసింది.

'అరుదైన మొక్కలను కాపాడడంలోని ఆనందం అంతా ఇంతా కాదు' అంటుంది సీనియర్ గార్డెనర్ లాలీ జోసెఫ్. పాతిక సంవత్సరాలుగా ఈ అభయారణ్యంలో పని చేస్తున్న జోసెఫ్ 'మొక్కలు సంతోషంగా ఉంటేనే మేము సంతోషంగా ఉండగలం' అంటోంది.

'నేను చూస్తుండగా అడవిలో ఒక చెట్టు నేల కూలిపోవడాన్ని మించిన విషాదం మరొకటి లేదు' అంటుంది లాలీ జోసెఫ్.

కీటకాలు, పాముల నుంచి రక్షణగా పెద్ద బూట్లు ధరించిన 'ఆల్-ఫిమేల్ రెయిన్ ఫారెస్ట్ ఫోర్స్'లోని మహిళలు అడవులలో తిరుగుతుంటారు. ప్రమాదంలో ఉన్న మొక్కలు, చెట్లను రక్షించడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటారు. సహజ పదార్థాల నుంచి పురుగు మందులను తయారుచేస్తుంటారు.





అడవి గుండె చప్పుడు విని...

దిల్లీలో పెరిగిన సుప్రభా శేషన్... కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలోని బ్రోక్‌వుడ్ పార్క్ సెంటర్ (యూకే)లో చదువుకుంది. అక్కడ ఉన్నప్పుడు తొలిసారిగా కేరళలోని 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' గురించి విన్నది. ల్యాండ్ స్కేప్ గార్డెన్స్, పార్క్ ల్యాండ్‌ల చరిత్రపై ప్రాజెక్ట్ చేస్తున్న సుప్రభ శేషన్‌ని కేరళలోని 'గురుకుల' ఆకర్షించింది. అమెరికాలోని ల్యాండ్ ఇనిస్టిట్యూట్‌లో ఒక సంవత్సరం పాటు అధ్యయన కార్యక్రమాల్లో భాగం అయిన సుప్రభ ఆ తరువాత మన దేశంలోని ఆదివాసీ గూడేలలో మకాం వేసి అడవుల గుండె చప్పుడు విన్నది. తన ప్రయాణంలో భాగంగా 'గురుకుల బొటానికల్ శాంక్చువరీ' (జీబీఎస్) వ్యవస్థాపకుడు వోల్ఫ్ గాంగ్‌ను కలిసింది. 'జీబీఎస్' ద్వారా అడవులను రక్షించడానికి వారు చేస్తున్న ప్రయత్నాల గురించి తెలుసుకుంది. అలా లాలీ జోసెఫ్, సుమ కెలోత్‌లాంటి ఇతర 'జీబియస్' సభ్యులతో కలిసి అడవిబాట పట్టింది. పశ్చిమ కనుమలలోని పర్వతాలను అధిరోహించింది. అంతరించిపోతున్న మొక్కల జాతుల గురించి తెలుసుకోవడమే కాదు వాటి పరిరక్షణలో భాగంగా 'జీబియస్'గా గార్డెనర్‌గా ప్రయాణాన్ని ప్రారంభించింది.



ఈ నల్లని రాళ్లలో..

'గురుకుల బొటానికల్ శాంక్చువరీ'లోని సీనియర్ గార్డెనర్ అయిన లాలీ జోసెఫ్, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మొక్కల కోసం అన్వేషిస్తుంటుంది. గురుకులంలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ద్వారా వాటిని బతికించే ప్రయత్నం చేస్తుంది. కొండ, కోనలు తిరుగుతూ మొక్కల యోగక్షేమాలు తెలుసుకుంటుంది.

నేడు ప్రపంచ అటవీ దినోత్సవం

అక్షరం

సజీవ ప్రపంచంలోకి...

వైశాలి ష్రాఫ్ చేతిలో మంత్రదండం ఉంది. ఆ మంత్రదండం అడవులను బడులకు రప్పించగలదు. అలనాటి రాక్షస బల్లులతో ఈనాటి పిల్లలను మాట్లాడించగలదు. ఆ మంత్రదండం పేరు కలం. ముంబైకి చెందిన వైశాలి ష్రాఫ్ పర్యావరణ సంబంధిత విషయాలపై పిల్లల్లో అవగాహన కలిగించడానికి ఎన్నో పుస్తకాలు రాసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డ్‌లు అందుకుంది...



వైశాలి ష్రాఫ్

నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్(సిఎన్‌పీ)కి వెళ్లి వచ్చిన తరువాత వైశాలికి 'సీతాస్ చిత్వాన్' అనే పుస్తకం రాయడం ప్రారంభించింది. ఈ పార్క్‌కు వెళ్లడానికి ముందు తన కుటుంబంతో కలిసి మన దేశంలోని ఎన్నో జాతీయ పార్క్‌లను చూసింది వైశాలి. ఏ పార్క్‌కు వెళ్లినా అందులోని జీవవైవిధ్యం తనకు బాగా నచ్చేది.

సాలె పురుగుల నుంచి పెద్ద పిల్లుల వరకు ఏనుగుల నుంచి ఆకాశాన్ని అంటుతున్నట్లు కనిపించే చెట్ల వరకు తనను అమితంగా ఆకట్టుకునేవి.

'ప్రకృతిని కాపాడుకుంటేనే బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చు' అనే సత్యాన్ని పిల్లలకు బోధ పరచడానికి 'సీతాస్ చిత్వాన్' పుస్తకం రాసింది.

'పర్యావరణ పరిరక్షణకు సంబంధించి చిత్తశుద్ధి ఉంటే అడవులను తద్వారా రాబోయే తరాలను కాపాడుకోవచ్చు. అడవి ఒక పాఠశాల. సహనంతోనూ, సాహసోపేతంగా ఉండడాన్ని నేర్పుతుంది. జీవరాశుల పట్ల సానుభూతి కలిగి ఉండడాన్ని నేర్పుతుంది' అని 'సీతాస్ చిత్వాన్' ద్వారా చెబుతుంది వైశాలి.

ప్రాపంచిక, పర్యావరణానికి సంబంధించిన విషయాల గురించి తగిన సమాచారంతో ఫిక్షన్ ఫార్మట్‌లో చెప్పడం వైశాలికి ఇష్టం. ఈ ఫార్మట్‌లో ఎన్నో ప్రయోగాలు చేసింది. ఆకట్టుకునే క్యారెక్టర్‌లను సృష్టించింది.

పిల్లలు పుస్తకంలోని పాత్రలతో కనెక్ట్ కావడమే కాకుండా పర్యావరణానికి సంబంధించిన ఎన్నో విషయాల గురించి తెలుసుకుంటారు.

తన బామ్మ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకుంది వైశాలి. వైశాలి స్కూల్ రోజుల్లో... తన బామ్మ ఒక మూలన కుర్చీలో కూర్చుని ఏదో ఒక పుస్తకం సీరియస్‌గా చదువుతూ కనిపించేది. బామ్మను అనుకరిస్తూ వైశాలి కూడా ఏదో కథల పుస్తకం చదువుతూ కూర్చునేది. మధ్య మధ్యలో బామ్మను ఆసక్తిగా చూసేది. ఈ అనుకరణ కాస్తా ఆ తరువాత పుస్తకాలు చదివే అలవాటుగా మారింది. ఆ అలవాటే తనని పిల్లల రచయిత్రిని చేసింది.

'ఫిక్షన్, నాన్ ఫిక్షన్‌లలో నాన్ ఫిక్షన్ రాయడమే కష్టం. నాన్ ఫిక్షన్ పుస్తకాల కోసం బోలెడు సమాచార సేకరణ చేయాల్సి ఉంటుంది' అంటుంది వైశాలి. మన దేశంలోని రాక్షస బల్లుల గురించి సాధికారమైన సమాచారంతో ఆమె రాసిన 'బ్లూథింగోసారస్' నాన్-ఫిక్షన్ పుస్తకానికి ఎంతో మంచి స్పందన వచ్చింది.

వివిధ రకాల వ్యక్తీకరణల ద్వారా కమ్యూనికేట్ చేయడానికి, కనెక్ట్ కావడానికి భాషలు వీలు కల్పిస్తాయి. వైశాలి తాజా పుస్తకం 'తాతుంగ్ తతుంగ్ అండ్ అదర్ అమేజింగ్ స్టోరీస్' పుస్తకం భారతీయ భాషల విస్మృతి, లోతు గురించి పిల్లల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. మాతృభాషల గొప్పదనాన్ని తెలియజేస్తుంది. గుహ గోడలపై ఉన్న చిత్రలిపి నుంచి పురాతన, సమకాలీన స్థానిక భాషలకు సంబంధించిన వివరాలు ఈ పుస్తకంలో ఉంటాయి.

'తాతుంగ్ తతుంగ్... మన దేశపు అద్భుతమైన భాషా సంప్రదాయాన్ని కళ్లకు కడుతుంది. భాషలు, వాటి గొప్ప వారసత్వాలు కనుమరుగు కాకూడదని హెచ్చరిస్తుంది. ఈ పుస్తకం చదవడం ద్వారా పిల్లలకు తమ మాతృభాష పట్ల మరింత అభిమానం పెరుగుతుంది' అంటారు రచయిత, రాజకీయ నాయకుడు శశిథరూర్.

'భిన్నమైన విషయాల గురించి భిన్నమైన పద్ధతుల్లో రాయడం ఇష్టం' అంటున్న వైశాలి ష్రాఫ్ పిల్లల కోసం మరిన్ని మంచి పుస్తకాలు రాయాలని ఆశిద్దాం.

బ్యూటిప్స్ -హెయిర్ కేర్



వేసవిలో జుట్టు రాలిపోయే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అందువల్ల కొన్ని చిన్న చిట్కాలను పాటించడం ద్వారా దానిని అరికట్టవచ్చు.

యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న గ్రీన్ టీ జుట్టు పెరుగుదలను, బలాన్ని పెంచుతుంది. 2–3 గ్రీన్ టీ బ్యాగ్‌లను వేడి నీటిలో నానబెట్టండి. చల్లారిన తర్వాత, మీ జుట్టు, తలపై మసాజ్ చేయాలి. ఒక గంట పాటు అలాగే ఉంచి చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి.

మెంతి గింజల పేస్ట్

మెంతులను రాత్రంతా నానబెట్టి, ఆపై వాటిని పేస్ట్‌గా రుబ్బుకోవాలి. ఈ గ్రోత్-బూస్టింగ్ మాస్క్‌ని మీ జుట్టుకు అప్లై చేసి 30–40 నిమిషాల పాటు అలాగే ఉంచండి. తరువాత, చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి.



పరాజయంతో పునరాగమనం

ప్రపంచ మాజీ నంబర్‌వన్ సిమోనా హాలెప్ పరాజయంతో ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో పునరాగమనం చేసింది. మయామి ఓపెన్ టోర్నీలో హాలెప్ (రొమేనియా) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. పౌలా బదోసా (స్పెయిన్)తో జరిగిన మ్యాచ్‌లో హాలెప్ 6–1, 4–6, 3–6తో ఓడిపోయింది. హాలెప్ 2022లో డోపింగ్‌లో విఫలమవడంతో నాలుగేళ్ల నిషేధం విధించారు. అయితే ఈ నిషేధంపై ఆమె కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో అప్పీల్ చేసింది. విచారణ తర్వాత హాలెప్ నిషేధాన్ని 9 నెలలకు కుదించారు.

'టాప్' ర్యాంక్‌లోనే సూర్యకుమార్

గత మూడు నెలలుగా ఆటకు దూరంగా ఉన్నా... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల టి20 ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ తన నంబర్ వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో సూర్యకుమార్ 861 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఐర్లాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో రాణించిన రషీద్ ఖాన్ నాలుగు స్థానాలు ఎగబాకి పదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ 4వ ర్యాంక్‌లో ఉన్నాడు.



అరంగేట్రంలో అదరగొట్టేందుకు!

- తొలిసారి ఐపీఎల్ బరిలో యువతారలు
- అందరి దృష్టి రచిన్ రవీంద్రపైనే

రేపటి నుంచి ఐపీఎల్ 17వ సీజన్

సత్తా ఉన్న ప్రతిభావంతులకు తారాజువ్వలా దూసుకుపోయేందుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సరైన వేదిక. స్వదేశీ ఆటగాళ్లయినా... విదేశీ ఆటగాళ్లయినా ఒక్కసారి ఐపీఎల్‌లో ఆడి మెరిపిస్తే కావాల్సినంత గుర్తింపు వస్తుందనడంలో సందేహం లేదు. నిలకడైన ఆటతీరుతో కెరీర్‌ను గాడిలో పెట్టుకోవడానికి.... ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఐపీఎల్ దోహదం చేస్తోంది. ఇప్పటికే ఎంతో మంది క్రికెటర్లు ఐపీఎల్‌లో అదరగొట్టి తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. రాబోయే ఐపీఎల్ 17వ సీజన్‌లో అరంగేట్రంలోనే తమ విధ్వంసకర ఆటతీరుతో, ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. –సాక్షి క్రీడా విభాగం



రచిన్ రవీంద్ర

➤ గెలుపు గుర్రం... రచిన్ రవీంద్ర (చెన్నై)

అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక్కసారిగా తెరపైకి వచ్చాడు ఈ న్యూజిలాండ్ క్రికెటర్. ఫార్మాట్ ఏదైనా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. అనతికాలంలోనే జట్టు ముఖ్య సభ్యుడిగా ఎదిగాడు. గత ఏడాది భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో రచిన్ 10 మ్యాచ్‌లు ఆడి 578 పరుగులు సాధించి న్యూజిలాండ్ టాప్ స్కోరర్‌గా నిలవడంతోపాటు టాప్–4లో చోటు సంపాదించాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టి20లో కేవలం 35 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో చెలరేగి 68 పరుగులు చేశాడు. తొలిసారి ఐపీఎల్ ఆడబోతున్న రచిన్ తన మెరుపులతో మెరిపించి చెన్నై సూపర్ కింగ్స్ టైటిల్ నిలబెట్టుకునేందుకు తనవంతు పాత్ర పోషిస్తే మాత్రం భవిష్యత్‌లో టాప్ స్టార్‌గా ఎదగడం ఖాయం.

➤ సిక్సర్ల వీరుడు... సమీర్ రిజ్వీ (చెన్నై)



ఐపీఎల్‌లో ఐదుసార్లు విజేతగా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ వేలంలో ఆటగాళ్లను ఎంచుకునే సమయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. కానీ గత మినీ వేలంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల సమీర్ రిజ్వీ కోసం చెన్నై పట్టుబట్టింది. ఇంకా భారత జట్టుకు ఆడని సమీర్ రిజ్వీని చెన్నై ఏకంగా రూ. 8 కోట్ల 40 లక్షలు వెచ్చించింది. ముస్తాక్ అలీ దేశవాళీ టి20 టోర్నీలో భాగంగా తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో రిజ్వీ యూపీని గెలిపించినంత పనిచేశాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్లు సాయికిశోర్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తిలపై విరుచుకుపడిన రిజ్వీ ఆ మ్యాచ్‌లో 46 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో అజేయంగా 75 పరుగులు చేశాడు. యూపీ టి20 లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్ జట్టు తరఫున అత్యధిక సిక్స్‌లు బాది వెలుగులోకి వచ్చిన రిజ్వీ కల్నల్ సీకే నాయుడు అండర్–23 టోర్నీలో ఏకంగా ట్రిపుల్ సెంచరీ సాధించాడు. ఆడుతున్న తొలి ఐపీఎల్‌లో తనపై పెట్టుకున్న అంచనాలను నిజం చేసేందుకు రిజ్వీ రెడీ అవుతున్నాడు.

➤ వేగం.. వైవిధ్యం.. గెరాల్డ్ కొయెట్జీ (ముంబై)



గతంలో రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీ గెరాల్డ్ కొయెట్జీని ప్రత్యామ్నాయ ప్లేయర్‌గా తీసుకున్నా మ్యాచ్ ఆడించలేదు. వేగంతోపాటు వైవిధ్యభరిత బౌలింగ్‌తో కొయెట్జీ గత వన్డే వరల్డ్‌కప్‌లో ఏకంగా 20 వికెట్లు పడగొట్టి టాప్–5లో నిలిచాడు. ఈ ప్రదర్శన ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని ఆకట్టుకుంది. 23 ఏళ్ల కొయెట్జీని ముంబై రూ. 5 కోట్లకు సొంతం చేసుకుంది. ఈసారి ఐపీఎల్‌లో బుమ్రా తర్వాత ముంబై తరఫున రెండో ప్రధాన బౌలర్‌గా కొయెట్జీని చూడవచ్చు.

➤ ఆల్‌రౌండర్... అజ్మతుల్లా (గుజరాత్)



2022లో కొత్త జట్టుగా వచ్చిన గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో తొలి ప్రయత్నంలోనే ఐపీఎల్ చాంపియన్‌గా అవతరించింది. గత ఏడాది రన్నరప్‌గా నిలిచింది. అయితే ఈ ఏడాది పాండ్యా గుజరాత్‌ను వీడి ముంబై ఇండియన్స్‌కు వెళ్లిపోయాడు. దాంతో పాండ్యా తరహాలో టైటాన్స్‌కు ఆల్‌రౌండర్ కొరత ఏర్పడింది. ఈ లోటును కొంతలో కొంత అఫ్గానిస్తాన్ ప్లేయర్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్ భర్తీ చేస్తాడని చెప్పవచ్చు. రూ. 50 లక్షలకు అజ్మతుల్లాను టైటాన్స్ కొనుగోలు చేసింది. గత ఏడాది వన్డే వరల్డ్‌కప్‌లో అజ్మతుల్లా 353 పరుగులు చేయడంతోపాటు ఏడు వికెట్లు పడగొట్టాడు.

➤ లెఫ్టార్మ్ పేసర్... జాన్సన్ (గుజరాత్)



మడమ గాయంతో గుజరాత్ టైటాన్స్ ప్రధాన బౌలర్ మొహమ్మద్ షమీ ఈ ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. దాంతో టైటాన్స్ బౌలింగ్ విభాగం కాస్త బలహీనపడింది. అయితే ఆస్ట్రేలియాకు చెందిన లెఫ్టార్మ్ పేసర్ స్పెన్సర్ జాన్సన్ రూపంలో టైటాన్స్‌కు మరో మంచి బౌలర్ దొరికాడనే చెప్పాలి. 28 ఏళ్ల జాన్సన్ గత రెండేళ్లలో ఎంతో రాటుదేలాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగే టి20 లీగ్‌లలో పాల్గొన్నాడు. మినీ వేలంలో గుజరాత్ టైటాన్స్ ఏకంగా రూ. 10 కోట్లు వెచ్చించి జాన్సన్‌ను తీసుకుంది.

➤ లక్కీ చాన్స్... షామర్ జోసెఫ్ (లక్నో)



ఆస్ట్రేలియాతో ఈ ఏడాది జనవరిలో జరిగిన టెస్టులో షామర్ జోసెఫ్ ఏడు వికెట్లు తీసి వెస్టిండీస్‌ను గెలిపించాడు. ఈ ప్రదర్శనతో షామర్ అంతర్జాతీయస్థాయిలో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించాడు. గత ఏడాది మినీ వేలంలో షామర్‌ను ఎవరూ తీసుకోలేదు. అయితే ఇంగ్లండ్‌కు చెందిన పేస్ బౌలర్ మార్క్ వుడ్ గాయంతో తప్పుకోవడంతో అతని స్థానంలో లక్నో సూపర్ జెయింట్స్ షామర్ జోసెఫ్‌ను రూ. 3 కోట్లకు తీసుకుంది.

సింధు శుభారంభం

ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్, లక్ష్య సేన్



బాసెల్ (స్విట్జర్లాండ్): మాజీ చాంపియన్ పీవీ సింధు స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు 21–12, 21–13తో పోర్న్‌పిచా చొయ్‌కీవోంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో జపాన్ ప్లేయర్ తొమోకా మియజకీతో సింధు ఆడుతుంది. పురుషుల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్ కూడా తొలి రౌండ్‌లో విజయాలు అందుకున్నారు. 2015లో స్విస్ ఓపెన్ విజేతగా నిలిచిన శ్రీకాంత్ 21–17, 21–18తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై నెగ్గగా... లక్ష్య సేన్ 21–19, 15–21, 21–11తో లియోంగ్ జున్ హావో (మలేసియా)ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో... పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీలు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. తొలి రౌండ్‌లో అశ్విని–తనీషా ద్వయం 21–18, 12–21, 21–19తో మెలీసా పుస్పితాసారి–రేచల్ రోజ్ (ఇండోనేసియా) జంటపై... గాయత్రి–ట్రెసా జోడీ 21–15, 21–12తో అనీ జు–కెరీ జు (అమెరికా) ద్వయంపై గెలుపొందాయి.

విజయమే లక్ష్యంగా...

నేడు అఫ్గానిస్తాన్‌తో భారత్ పోరు



అభా (సౌదీ అరేబియా): ఫుట్‌బాల్ ప్రపంచకప్–2026 ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా నేడు అఫ్గానిస్తాన్‌తో భారత జట్టు తలపడనుంది. తటస్థ వేదిక సౌదీ అరేబియా ఆతిథ్యమివ్వనున్న ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి గం. 12:30 నుంచి జరుగుతుంది. నాలుగు జట్లున్న గ్రూప్ 'ఎ'లో భారత జట్టు రెండు మ్యాచ్‌లు ఆడింది. ఒక మ్యాచ్‌లో నెగ్గి, ఒక మ్యాచ్‌లో ఓడి మూడు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. సునీల్ ఛెత్రి కెప్టెన్సీలో భారత జట్టుకు మరో విజయం లభిస్తే మూడో రౌండ్‌కు అర్హత పొందేందుకు తమ అవకాశాలను మెరుగుపర్చుకుంటుంది. అఫ్గానిస్తాన్‌తో ముఖాముఖిగా 11 సార్లు తలపడ్డ భారత్ ఏడుసార్లు గెలిచింది. మూడు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది.

క్వార్టర్స్‌లో స్నేహిత్

డబుల్స్‌లో శ్రీజ జోడీకి కాంస్యం



బీరుట్ (లెబనాన్): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్లు ఆకుల శ్రీజ, సూరావజ్జుల స్నేహిత్‌లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో స్నేహిత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... మహిళల సింగిల్స్‌లో శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 166వ ర్యాంకర్ స్నేహిత్ 11–7, 11–8, 11–13, 15–13తో ప్రపంచ 58వ ర్యాంకర్ అహ్మద్ సలెహ్ (ఈజిప్ట్)ను బోల్తా కొట్టించాడు. శ్రీజ 10–12, 9–11, 11–2, 9–11తో భారత్‌కే చెందిన ఐహిక ముఖర్జీ చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో శ్రీజ–దియా చిటాలె (భారత్) ద్వయం 9–11, 8–11, 5–11తో చాంటల్ మాంట్జ్ (జర్మనీ)–ఇజాబెలా లుపులెస్కు (సెర్బియా) జోడీ చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో స్నేహిత్–శ్రీజ (భారత్) జోడీ తొలి రౌండ్‌లో 4–11, 4–11, 8–11తో జియా లియాన్ ని–లుకా మ్లాడెనోవిచ్ (లక్సెంబర్గ్) జంట చేతిలో ఓటమి పాలైంది. భారత్‌కే చెందిన మానవ్ ఠక్కర్–అర్చన కామత్... మనుష్ షా–దియా చిటాలె జోడీలు మిక్స్‌డ్ విభాగం ఫైనల్లోకి దూసుకెళ్లాయి.

సినిమా

తనకు అంత పిచ్చి ఉంటుందనుకోలేదు

– రామ్‌చరణ్



● రామ్‌చరణ్, జాన్వీకపూర్, చిరంజీవి

''డైరెక్టర్ సుకుమార్‌గారి టీమ్‌లో బుచ్చిబాబు బెస్ట్. తనకు సినిమా అంటే పిచ్చి. 'రంగస్థలం' కథని సుకుమార్ గారు నాకు నలభై నిమిషాలు చెప్పారు. ఆ తర్వాత ప్రతి రోజూ నాకు రెండేసి గంటలు నెరేషన్ ఇచ్చింది మాత్రం బుచ్చిబాబునే. తనకు సినిమా అంటే అంత పిచ్చి ఉంటుందనుకోలేదు'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్). మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమా బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత బోనీ కపూర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో చిరంజీవి క్లాప్ కొట్టారు. డైరెక్టర్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందించారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ ''నేను, జాన్వీ కలిసి 'జగదేకవీరుడు–అతిలోక సుందరి' లాంటి మూవీ చేయాలని చాలామంది అనుకున్నారు. మా కాంబినేషన్ 'ఆర్‌సీ 16'తో నిజం కావడం హ్యాపీ'' అన్నారు. ''నాపై నమ్మకంతో రామ్‌చరణ్‌గారు ఇచ్చిన అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకుంటాను'' అన్నారు బుచ్చిబాబు సానా. ''బుచ్చిబాబు ఏదైనా పెద్దగా ఆలోచిస్తాడు. తన కథపై తనకు ఉన్న నమ్మకం అలా ఉంటుంది'' అన్నారు డైరెక్టర్ సుకుమార్. ''ఈ సినిమాకి ఇప్పటికే మూడు ట్యూన్స్ పూర్తి చేశాం'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్. ''నేను ఎంతగానో అభిమానించే ప్రముఖులందరితో కలిసి ఈ వేడుకలో పాల్గొనడం నా అదృష్టం'' అన్నారు జాన్వీ కపూర్. ''బుచ్చిబాబు ఈ సినిమాతో తప్పకుండా మరో హిట్ కొడతాడు'' అన్నారు నిర్మాత నవీన్ ఎర్నేని. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు వై. రవిశంకర్, 'దిల్' రాజు, శిరీష్, సాహూ గారపాటి, రామ్ ఆచంట, నాగవంశీ, ఎమ్మెల్యే రవి గొట్టిపాటి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సమర్పకుడు: సుకుమార్, కెమెరా: రత్నవేలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై. ప్రవీణ్ కుమార్.



● మోహన్‌బాబు మంచు, నిర్మలాదేవి, విరానికా, విష్ణు మంచు

కన్నప్ప నా మనసుకు ఎంతో దగ్గరైంది

– విష్ణు మంచు

''కన్నప్ప' కథ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. కామిక్ పుస్తకం కూడా సినిమాలానే ఉంటుంది. మన చరిత్ర, మన మూలాలను తెలుసుకునేలా చేయడంలో ఇది గొప్ప ప్రారంభం అని నేను భావించాను. ఇది నేను డబ్బు కోసం చేస్తున్న పని కాదు.. ఈ కథ నా మనసుకు ఎంతో దగ్గరైంది. కన్నప్ప భక్తి భావాన్ని ప్రపంచమంతా తెలుసుకోవాలనుకుంటున్నాను'' అని హీరో విష్ణు మంచు అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో విష్ణు మంచు హీరోగా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో మోహన్‌బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. కాగా మార్చి 19న మోహన్‌బాబు పుట్టినరోజు, మోహన్‌బాబు యూనివర్సిటీ 32వ వార్షిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి నటులు మోహన్‌లాల్ గౌరవ ముఖ్య అతిథిగా, ముఖేష్ రిషి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో 'కన్నప్ప స్టోరీ బుక్ వాల్యూమ్ 1'ని ఆవిష్కరించిన విష్ణు మంచు మాట్లాడుతూ–''ఈ పుస్తకం భక్త కన్నప్ప పురాణ కథను కామిక్ రూపంలో చూపిస్తుంది. నేను చదివిన అత్యంత ఉత్తేజకరమైన కథను ప్రపంచానికి తెలియజేయాలనేది నా కల. నేటితరం యువత ఈ కథను, చరిత్రను తెలుసుకోవాలి'' అన్నారు.

వెండితెరకి ఇళయరాజా



● కమల్‌హాసన్, ఇళయరాజా, ధనుష్

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా జీవితం వెండితెరపైకి వస్తోంది. ధనుష్ లీడ్ రోల్‌లో నటిస్తున్న 'ఇళయరాజా' చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ మూవీకి అరుణ్‌మాథేశ్వరన్ దర్శకుడు. కనెక్ట్ మీడియా, పీకే ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యూరీ మూవీస్ సమర్పణలో రూపొందుతున్న 'ఇళయరాజా' షూటింగ్ బుధవారం చెన్నైలో ప్రారంభమైంది. ఈ వేడుకకి ఇళయరాజా, హీరోలు కమల్ హాసన్, ధనుష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇళయరాజాతో తమకున్న అనుబంధాన్ని కమల్‌హాసన్, ధనుష్ పంచుకున్నారు. కాగా ఈ మూవీ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. తమిళ్, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి నీరవ్ షా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కాగా ఈ మూవీకి ఇళయరాజా సంగీతం అందిస్తారని కోలీవుడ్ టాక్.

నా పెళ్ళాం దెయ్యం!



● రామ్‌గోపాల్ వర్మ

'నా పెళ్ళాం దెయ్యం' అంటున్నారు డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ. ఆయన దర్శకత్వం వహించిన 'వ్యూహం, శపథం' సినిమాలు ఇటీవల విడుదల అయ్యాయి. తాజాగా తన కొత్త చిత్రాన్ని ప్రకటించారు వర్మ. ఈ మూవీకి 'నా పెళ్ళాం దెయ్యం' అనే టైటిల్‌ని అనౌన్స్ చేసి, తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్టర్‌ని షేర్ చేశారాయన. అయితే ఈ మూవీలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలేవి ప్రకటించలేదు.



● కీర్తి సురేష్

ఆ అంశం కిక్ ఇచ్చింది

– శ్రీ విష్ణు



''నా సినిమాలకు పెట్టుబడి పెట్టే నిర్మాతలు నష్టపోకూడదని కోరుకుంటాను. ఇండస్ట్రీలో నా మార్కెట్ పెరగడం, తగ్గడం అనేది నా చేతుల్లో లేని విషయం. ఏ సినిమా వల్ల మార్కెట్ పెరుగుతుందో, ఏ సినిమా వల్ల తగ్గుతుందో గ్యారెంటీగా చెప్పలేం'' అని శ్రీవిష్ణు అన్నారు. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో వి సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ– ''సైంటిస్ట్‌లు కావాలని ఉస్మానియా యూనివర్సిటీలో చాలా కాలంగా తిష్ట వేసిన ఓ ముగ్గురు పీహెచ్‌డీ స్కాలర్స్‌ను అక్కడి విద్యార్థులు ఓ స్కెచ్ వేసి బయటకు పంపిస్తారు. అలా బయటకు వచ్చిన ఆ ముగ్గురు భైరవపురం అనే ఊరికి వెళ్లినప్పుడు అక్కడ ఏం జరిగింది? ఈ ముగ్గురి నిధి అన్వేషణ ఫలించిందా? లేదా అన్నది 'ఓం భీమ్ బుష్' కథాంశం. అలాగే ఈ మూవీలో కొత్త పాయింట్‌ని టచ్ చేశాం. ఆ అంశం నాకు కిక్ ఇచ్చింది. నా తర్వాతి చిత్రం 'స్వాగ్' పూర్తి కావొచ్చింది. గీతా ఆర్ట్స్, కోనగారితో సినిమాలు కమిటయ్యాను. అలాగే ఓ థ్రిల్లర్ ఫిల్మ్ కూడా ఉంది'' అన్నారు.

ఉప్పు కప్పురంబు!

హీరోయిన్ కీర్తి సురేష్ మెయిన్ లీడ్ రోల్‌లో నటించనున్న కొత్త సినిమాకు 'ఉప్పు కప్పురంబు' అనే టైటిల్ ఖరారైనట్లు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో 'కలర్ ఫోటో' ఫేమ్ సుహాస్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. అని ఐవీ శశి దర్శకత్వంలో రాధికా లావు ఈ చిత్రం నిర్మిస్తున్నారు. వసంత్ మురళీ కృష్ణ మరింగంటి కథ అందిస్తున్నారు. ఓ గ్రామంలోని స్మశానం విస్తరణ నేపథ్యంలో 'ఉప్పు కప్పురంబు' సినిమా కథనం ఉంటుందనే ప్రచారం ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలో కీర్తి సురేష్, సుహాస్ జంటగా నటిస్తారా? లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

కొత్త జేమ్స్ బాండ్?



● ఆరోన్ టేలర్ జాన్సన్

హాలీవుడ్ 'జేమ్స్ బాండ్' ఫ్రాంచైజీ సూపర్‌హిట్. 'జేమ్స్ బాండ్' సినిమా ఎప్పుడు వచ్చినా ప్రేక్షకాదరణ ఉంటుంది. ఈ ఫ్రాంచైజీలో ఇప్పటివరకు 25 సినిమాలు వచ్చాయి. హాలీవుడ్ నటుడు డేనియల్ క్రైగ్ ఎక్కువ సార్లు జేమ్స్ బాండ్‌గా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించారు. 2021లో వచ్చిన జేమ్స్ బాండ్ 25వ చిత్రం 'జేమ్స్ బాండ్: నో టైమ్ టు డై'లోనూ డేనియల్ క్రైగ్ బాండ్‌గా కనిపించారు. తాజాగా జేమ్స్ బాండ్ 26వ సినిమా గురించిన వార్తలు హాలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ఈ సినిమాకు తొలుత డేనియల్ క్రైగ్ పేరు వినిపించింది. కానీ మరోసారి బాండ్‌గా కనిపించేందుకు డేనియల్ ఆసక్తికరంగా లేరట. దీంతో కొత్త జేమ్స్ బాండ్‌గా ఎవరు కనిపిస్తారు? అనే చర్చ హాలీవుడ్‌లో మొదలైంది. ఈ క్రమంలో ఆరోన్ టేలర్ జాన్సన్ పేరు తెరపైకి వచ్చింది. యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడం, వయసు రీత్యా కూడా జేమ్స్ బాండ్‌గా ఆరోన్ పర్‌ఫెక్ట్ చాయిస్ అంటున్నారు కొందరు హాలీవుడ్ సినీ ప్రేమికులు. అలాగే 'జేమ్స్‌బాండ్ 26'వ చిత్రానికి క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇక హాలీవుడ్ చిత్రాలు 'కిక్కాస్', 'చాట్ రూమ్', 'గాడ్జిల్లా', 'అవెంజర్స్' వంటి సినిమాల్లో నటించి మెప్పించారు ఆరోన్ టేలర్.

బాలీవుడ్ అశ్వత్థామ



● షాహిద్ కపూర్

బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'అశ్వత్థామ: ది సాగా కంటిన్యూస్' టైటిల్ ఖరారైంది. కన్నడ దర్శకుడు సచిన్ రవి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. వసు భగ్నాని, జాకీ భగ్నాని, దీప్షికా దేశ్‌ముఖ్ నిర్మిస్తున్న ఈ సినిమా అధికారిక ప్రకటన వెల్లడైంది. సచిన్ రవి మాట్లాడుతూ– ''మహా భారతంలోని అశ్వత్థామ ఇప్పటికీ జీవించే ఉంటారని కొందరి నమ్మకం. మహాభారత కాలంనాటి ఓ అమరుడు ఇప్పటి ఆధునిక కాలానికి వస్తే ఏం జరుగుతుంది? అనే అంశాలను ఈ సినిమాలో చూపిస్తున్నాం'' అన్నారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో లెజెండ్స్ యుద్ధం చేస్తే ఎలా ఉంటుంది? అనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుంది. త్వరలోనే మూవీ రిలీజ్ డేట్ వెల్లడిస్తాం'' అని పేర్కొన్నారు జాకీ భగ్నాని.

సరికొత్తగా...



● అప్సరా రాణి

'క్రాక్, డీ కంపెనీ, సీటీమార్' చిత్రాల ఫేమ్ అప్సరా రాణి, అరుణ్ ఆదిత్య జంటగా కృష్ణబాబు దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. జస్ట్ ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో నల్లా శ్రీదేవి నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ క్లాప్ కొట్టారు. దర్శకుడు వి. సముద్ర గౌరవ దర్శకత్వం వహించారు. కృష్ణబాబు మాట్లాడుతూ– ''సరికొత్త కథాంశంతో రూపొందుతున్న సినిమా ఇది'' అన్నారు. ''నా కెరీర్‌కు ఈ సినిమా ప్లస్ అవుతుందని నమ్మకంగా ఉంది'' అన్నారు అప్సరా రాణి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వెంకటేశ్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సీఎస్ గోపీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	90	72,102
నిఫ్టీ ▲	22	21,839

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,158	▼	8
డోజోన్స్	39,109	▼	2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,737	▼	1
డాక్స్	18,015	▲	28
షాంఘై	3,079	▲	17
నికాయ్	40,004	▲	236

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
65,689	▲	100
బంగారం (99.5 స్వచ్ఛత)		
65,426	▲	100
వెండి (కిలో)		
73,886	▲	42

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఛాయసమక	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	ఛాయసమక	103.88	108.12
€	యూరో	ఛాయసమక	88.12	91.990
¥	జపాన్ ఎన్ (100)	ఛాయసమక	47.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఛాయసమక	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	ఛాయసమక	60.13	64.88
SAR	సౌదీ రియాల్	ఛాయసమక	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయసమక	21.65	23.43
¥	చైనా యువాన్	ఛాయసమక	10.28	12.29

నష్టాల్లోంచి లాభాల్లోకి...

రాణించిన రిలయన్స్, ఐటీసీ, ఎస్‌బీఐ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, అధిక వెయిటేజీ రిలయన్స్(1.25%), ఐటీసీ(1.50%), ఎస్‌బీఐ(2%) షేర్లు రాణించడంతో సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. అయితే రూపాయి క్షీణత, చిన్న కంపెనీల షేర్లలో అమ్మకాలు సూచీల భారీ లాభాలకు అడ్డుకట్టవేశాయి. తొలిసెషన్‌లో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ట్రేడింగ్‌లో 729 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 90 పాయింట్ల లాభంతో 72,102 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 71,674 కనిష్టాన్ని, 72,403 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 221 పాయింట్ల రేంజ్‌లో 21,931 వద్ద గరిష్టాన్ని, 21,710 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 22 పెరిగి 21,839 వద్ద నిలిచింది.

రెండు నెలల కనిష్టానికి రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 16 పైసలు క్షీణించి 83.19 వద్ద నిలిచింది. ఈ ముగింపు స్థాయి రెండు నెలల కనిష్టం.

ట్రస్ట్ ఫిన్‌టెక్ @ రూ.95–101

సాస్ ప్రొడక్ట్ ఆధారిత ఫిన్‌టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లు అందించే ట్రస్ట్ ఫిన్‌టెక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 95–101 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 26న ప్రారంభమై 28న ముగియనుంది.ఆఫర్ ద్వారా కంపెనీ రూ. 63 కోట్లకుపైగా సమీకరించే యోచనలో ఉంది.

రూ.12 వేల స్థాయిని తాకిన మారుతీ



కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ షేరు ట్రేడింగ్‌లో తొలిసారి రూ.12,000 స్థాయిని అందుకుంది. సీఎస్‌జీ వ్యక్తిగత వాహన విభాగంలో ఈ కంపెనీ అగ్రస్థానంలో కొనసాగుతుందని బ్రోకరేజ్ సంస్థ సీఎల్‌ఎస్‌ఏ అవుట్‌లుక్ వ్యాఖ్యలు షేరు ర్యాలీకి కారణమయ్యాయి. ఇంట్రాడేలో మూడున్నర శాతం బలపడి రూ.12,025 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 3% లాభంతో రూ.11,942 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ బీఎస్‌ఈలో రూ.3.75 లక్షల కోట్లుగా నమోదైంది.



ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో నార్త్‌బ్లాక్‌లో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ సమావేశమయ్యారు. ఎకానమీపై చర్చించారు. కాగా సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ కూడా ఆర్థిక మంత్రితో సమావేశమై మార్కెట్ పరిణామాలను వివరించారు. స్విగ్గీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రోహిత్ కపూర్ సీతారామన్‌తో సమావేశమయినట్లు మరో పోస్ట్‌లో ఆర్థికశాఖ పేర్కొంది.

ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథం

5.25–5.5 శాతంగా అమలు



వాషింగ్టన్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ తాజాగా యథాతథ పాలసీ రేట్ల అమలుకే కట్టుబడింది. చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన రెండు రోజులపాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌ఓఎంసీ) యథాతథ వడ్డీ రేట్ల కొనసాగింపునకు ఓటు వేసింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 5.25–5.5 శాతంగానే అమలుకానున్నాయి. ద్రవ్యోల్బణ పరిస్థితులను కట్టడి చేసేటంతవరకూ వడ్డీ రేట్ల తగ్గింపునకు త్వరపడబోమంటూ గత సమావేశంలోనే పావెల్ స్పష్టం చేశారు. ఫెడ్ టార్గెట్ 2 శాతంకాగా.. ఫిబ్రవరిలో సీపీఐ 3.2 శాతంగా నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-3-2024	
విశాఖ	435–00
చిత్తూరు	478–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	72.00
20-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.75

ప్రతి మూడు నెలలకు ఓ కొత్త కారు

- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా లక్ష్యం
- సామర్థ్యాల పెంపుపై రూ. 5 వేల కోట్ల పెట్టుబడి

ముంబై: చైనాకు చెందిన ఎస్‌ఏఐసీతో దేశీ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ 'జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా' భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. సెప్టెంబర్ నుంచి మొదలుపెట్టి ప్రతి 3–4 నెలలకు ఓ కొత్త కారును ఆవిష్కరించాలని భావిస్తోంది. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఎస్‌ఏఐసీతో భాగస్వామ్యం ఖరారు చేసుకోవడాన్ని ప్రకటించిన సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ ఈ విషయాలు తెలిపారు. మరోవైపు, హలోల్‌లో (గుజరాత్) ఇప్పుడు తమకున్న ప్లాంటుకు దగ్గర్లోనే మరో ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు ఎంజీ మోటార్ ఇండియా గౌరవ చైర్మన్ రాజీవ్ చాబా తెలిపారు. దీనితో తమ ఉత్పత్తి సామర్థ్యం ఏటా 1 లక్ష యూనిట్ల నుంచి 3 లక్షలకు పెరుగుతుందన్నారు. సామర్థ్యాల పెంపు, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణపై భాగస్వాములు భారీగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ఎంజీ సైబర్‌స్టర్ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారు ఆవిష్కరణ

మారుతీ తరహా విప్లవం..

కొత్త ఇంధనాలతో నడిచే వాహనాల (ఎన్‌ఈవీ) విభాగంలో ఈ జేవీ 'మారుతీ తరహా విప్లవాన్ని' తేగలదని సజ్జన్ జిందాల్ పేర్కొన్నారు. 'నలభై ఏళ్ల క్రితం మారుతీ మార్కెట్లోకి వచ్చిన తర్వాత ఆటో పరిశ్రమను మార్చేసింది. సమర్థమంతమైన, తేలికైన, అధునాతనమైన కార్లను ప్రవేశపెట్టి ఇప్పుడు మార్కెట్ లీడరుగా ఎదిగింది. అంబాసిడర్లు, ఫియట్లు కనుమరుగయ్యాయి. కొత్త ఇంధనాలతో నడిచే వాహనాల విభాగంలో ఎంజీ కూడా ఆ ఫీట్‌ను పునరావృతం చేయగలదని విశ్వసిస్తున్నాం' అని ఆయన చెప్పారు. 2030 నాటికి ఏటా 10 లక్షల యూనిట్ల విక్రయాలతో ఎన్‌ఈవీ విభాగంలో తమ సంస్థ మార్కెట్ లీడరుగా ఎదగాలని నిర్దేశించుకున్నట్లు జిందాల్ వివరించారు. ఎంజీ మోటార్ మాతృ సంస్థ అయిన ఎస్‌ఏఐసీ మోటార్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ గతేడాది నవంబర్‌లో జేవీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కొత్త స్వరూపం ప్రకారం జేవీలో జేఎస్‌డబ్ల్యూకి 35 శాతం, భారతీయ ఫైనాన్షియల్ సంస్థలకు 8 శాతం, ఎంజీ మోటార్ డీలర్లకు 3 శాతం, ఉద్యోగులకు 5 శాతం, మిగతా 49 శాతం వాటాలు ఎస్‌ఏఐసీకి ఉంటాయి. కాగా, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ – ఎస్‌ఏఐసీ మోటార్ జాయింట్ వెంచర్ క్రింద అభివృద్ధి చేసిన ఎంజీ సైబర్‌స్టర్ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారు ఆవిష్కరణ జరిగింది. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ మేనేజింగ్ డైరెక్టర్ పార్థ్ జిందాల్, ఎంజీ మోటార్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ రాజీవ్ చాబాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్కెట్లోకి లాయిడ్ డిజైనర్ ఏసీలు



హైదరాబాద్: మార్కెట్లో అత్యాధునిక 'లాయిడ్ డిజైనర్ ఏసీలు ఆవిష్కృతమయ్యాయి. తమ ఉత్పత్తులు మరింత నాణ్యతగా అందించడానికి ఏపీలోని శ్రీసిటీలో ఏర్పాటు చేసిన నూతన మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఎంతో ఉపయోగపడుతోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యోగేష్ కుమార్ గుప్తా చెప్పారు. ఈఏడాదిలో మార్కెట్లోకి రానున్న అత్యాధునిక ఫీచర్లు ఉన్న ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, టీవీల లాంచింగ్ కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌లు అలోక్ టికూ, రాజేష్ రతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామ్‌కీ ఇన్‌ఫ్రాకు రూ.216 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగంలోని హైదరాబాద్ కంపెనీ రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తాజాగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నుంచి 2 కాంట్రాక్టులను దక్కించుకుంది. వీటి విలువ రూ.216 కోట్లు. ఇందులో భాగంగా చెన్నైలోని కొడుంగయూర్ డంపింగ్ గ్రౌండ్ పునరుద్ధరణ పనులను బయో మైనింగ్ ద్వారా రామ్‌కీ చేపట్టనుంది. 252 ఎకరాల విస్తీర్ణంలోని ఈ డంపింగ్ గ్రౌండ్‌లో 66 లక్షల టన్నుల వ్యర్థాలు 50 ఏళ్లుగా పేరుకుపోయాయి.

1 శాతం కుబేరుల దగ్గరే 40 శాతం సంపద

భారత్‌లో రెండు దశాబ్దాలుగా పెరిగిన అసమానత



న్యూఢిల్లీ: దాదాపు రెండు దశాబ్దాలుగా (2000 తొలి నాళ్ల నుంచి) భారత్‌లో ఆర్థిక అసమానతలు గణనీయంగా పెరిగాయి. 2022–23 గణాంకాల ప్రకారం మొత్తం ఆదాయాల్లో 22.6 శాతం వాటా, అలాగే సంపదలో 40.1 శాతం వాటా కేవలం ఒక్క శాతం ప్రజలదే ఉంటోంది. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికా వంటి దేశాలతో పోల్చినా ఇది చాలా ఎక్కువ. '1922–2023 మధ్య కాలంలో భారత్‌లో ఆదాయ, సంపద అసమానతలు: పెరిగిన బిలియనీర్ల రాజ్యం' పేరిట రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ముఖ్యంగా 2014–15 నుంచి 2022–23 మధ్య కాలంలో కొందరి వద్దే అత్యధికంగా సంపద కేంద్రీకృతమవ్వడమనేది మరింతగా పెరిగింది. థామస్ పికెటీ (ప్యారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్), లూకాస్ చాన్సెల్ (హార్వర్డ్ కెనెడీ స్కూల్, వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్), నితిన్ కుమార్ భారతి (న్యూయార్క్ యూనివర్సిటీ, వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్) ఈ నివేదికను రూపొందించారు. నికర సంపద దృష్టికోణం నుంచి చూస్తే భారత ఆదాయపు పన్ను వ్యవస్థ తిరోగామి విధానంగా అనిపించవచ్చని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదాయం, సంపదను పరిగణనలోకి తీసుకునేలా పన్ను విధానాన్ని పునర్వ్యవస్థీకరించడం, ఆరోగ్యం.. విద్య..పౌష్టికాహారంపై ప్రభుత్వం మరింతగా పెట్టుబడులు పెట్టడం ద్వారా కేవలం సంపన్న వర్గాలే కాకుండా సగటు భారతీయుడు కూడా గ్లోబలైజేషన్ ప్రయోజనాలను పొందేలా చూడాల్సిన అవసరం ఉందని తెలిపింది. అలాగే అసమానతలపై పోరాడేందుకు 2022–23లో అత్యంత సంపన్నులుగా ఉన్న 167 కుటుంబాలపై 2 శాతం 'సూపర్ ట్యాక్స్'ని విధిస్తే దేశ ఆదాయంలో 0.5 శాతం మేర సమకూరగలదని, సామాన్య ప్రజానీకానికి ఉపయోగకరంగా ఉండే పెట్టుబడులు పెట్టేందుకు ఆర్థికంగా వెసులుబాటు లభించగలదని నివేదిక వివరించింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్(ఆదర్శ పాఠశాలలు)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం బోధన ఉంటుంది.

» **అర్హత:**సంబంధిత జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. **వయసు:** ఓసీ/బీసీ విద్యార్థులు 01.09.2012 నుంచి 31.08.2014మధ్య జన్మించి ఉండాలి.ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 01.09.2010 నుంచి 31.08.2014మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. ఓసీ/బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు పొందితే ప్రవేశాలు పొందుతారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు/ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 31.03.2024.
» **ప్రవేశ పరీక్ష:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** www.cse.ap.gov.in or www.apms.ap.gov.in.

టీజీఆర్‌డీసీ సెట్-2024

తెలంగాణ మహాత్మా జ్యోతిబాపులే బీసీ సంక్షేమ (ఎంజేపీటీబీసీడబ్ల్యూ) కళాశాలలు,ఎస్సీ((టీఎస్‌డబ్ల్యూ), ఎస్టీ(టీటీడబ్ల్యూ) సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష-ఆర్‌డీసీ సెట్-2024 నిర్వహిస్తారు.అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **కోర్సులు:** బీఎస్సీ, బీకాం, బీఏ, బీహెచ్‌ఎంసీటీ, బీబీఏ, బీఎఫ్‌టీ.
» **మొత్తం కళాశాలలు:** 29
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలకు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.04.2024
» **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:**21.04.2024
» **పరీక్ష తేది:** 28.04.2024.
» **వెబ్‌సైట్:** https://tsrdccet.cgg.gov.in

» బీటెక్, అగ్రి, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి ఈఏపీ సెట్
» కాన్సెప్ట్‌లు, అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో విజయం

ఇంజనీరింగ్ @ ఈఏపీ సెట్

బీటెక్.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థుల్లో అధిక శాతం మంది లక్ష్యం! ఇందుకోసం జాతీయ స్థాయి జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లతోపాటు రాష్ట్ర స్థాయిలో ఈఏపీ సెట్‌లకు సన్నద్ధమవుతున్నారు. అదే విధంగా బైపీసీ విద్యార్థులు సైతం ఫార్మసీ, వ్యవసాయ అనుబంధ కోర్సుల్లో ప్రవేశం కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌పై దృష్టిపెడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈఏపీ సెట్‌లకు నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. ఏపీ/టీఎస్ ఈఏపీసెట్-2024ల వివరాలు, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర సమాచారం..

స్వరాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మా, అగ్రి కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఇక తమ కసరత్తును ముమ్మరం చేయాలి. ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులు అందుబాటులో ఉన్న ఈ రెండు నెలల సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే బెస్ట్ ర్యాంక్ సొంతం చేసుకునే వీలుంది.

కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ

- రాష్ట్ర స్థాయిలో ఇంజనీరింగ్; అగ్రికల్చర్; ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈఏపీసెట్ 2024కు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో నోటిఫికేషన్లు వెలువడ్డాయి.
- తెలంగాణలో గత ఏడాది వరకు టీఎస్ ఎంసెట్ పేరుతో పరీక్ష నిర్వహించగా.. ఈ ఏడాది నుంచి టీఎస్ ఈఏపీసెట్‌గా పేరు మార్చారు. అదే విధంగా రెండు రాష్ట్రాల్లోనూ దరఖాస్తు ప్రక్రియ సైతం ప్రారంభమైంది.

కోర్సులు ఇవే

- ఈఏపీ సెట్‌లో స్కోర్ ద్వారా ఇంజనీరింగ్; అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో.. బీటెక్,

ఏపీ/టీఎస్ ఈఏపీసెట్ 2024



బయో టెక్నాలజీ, బీటెక్(డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సులు ఉన్నాయి.

- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో.. బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ, బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్, బ్యాచిలర్ ఫిషరీస్ సైన్సు, బీ ఫార్మసీ, ఫార్మాడీల్లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు.

అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీఎస్సీ(ఫారెస్ట్రీ) కోర్సుకు కూడా టీఎస్ ఈఏపీ సెట్ ర్యాంకునే పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హత

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు.. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులు కూడా అర్హులే.
- అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌కు ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు ఉత్తీర్ణత శాతంలో అయిదు శాతం మినహాయింపు ఉంటుంది.
- ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష

- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మ్యాథమెటిక్స్ నుంచి 80ప్రశ్నలు ;ఫిజిక్స్ నుంచి 40; కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది.

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్

అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో.. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. బయాలజీలో బోటనీ, జువాలజీ నుంచి 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

టీఎస్ ఈఏపీసెట్-2024 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 6
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://eapcet.tsche.ac.in

ఏపీ ఈఏపీసెట్-2024 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 15
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in/EAPCET

బెస్ట్ ర్యాంకు సాధించేలా

మ్యాథమెటిక్స్

ఈఏపీసెట్‌లో 50 శాతం వెయిటేజీ ఉన్న సబ్జెక్ట్.. మ్యాథమెటిక్స్. కాబట్టి విద్యార్థులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ సిలబస్‌ను ఆల్‌జీబ్రా, కాల్కులస్, జామెట్రీ, వెక్టార్ ఆల్‌జీబ్రా,ట్రిగనోమెట్రీగా విభజించొచ్చు. లిమిట్స్ అండ్ కమ్యూనిటీ, డిఫరెన్షియేషన్, అప్లికేషన్స్ ఆఫ్ డెరివేటివ్స్, ఇంటిగ్రేషన్స్, డిఫైనెట్ ఇంటిగ్రల్, డిఫరెన్షియెల్ ఈక్వేషన్స్‌పై దృష్టి పెట్టాలి. జామెట్రీకి వెయిటేజీ కొంత ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో 2డీ, 3డీ జామెట్రీ, లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, స్ట్రెయిట్ లైన్స్, సర్కిల్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, ఎల్లిప్స్, డైరక్షన్ కొసైన్స్, డైరక్షన్ రేషియోస్, ప్లేన్ తదితరాలు కీలక అంశాలుగా ఉంటాయి.

- అదే విధంగా ఆల్‌జీబ్రా విభాగంలో ఫంక్షన్స్ మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిసెస్, కాంప్లెక్స్ నంబర్స్, డిమోయర్స్ థీరమ్, క్వాడ్రాటిక్ ఎక్స్‌ప్రెషన్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్ తదితరాలపై పట్టు సాధించాలి. ట్రిగ్నోమెట్రీలో.. ట్రిగ్నోమెట్రీ రేషియోస్ అప్ టు ట్రాన్స్‌ఫర్మేషన్స్, ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, ఇన్వెర్స్ ట్రిగ్నోమెట్రిక్ ఫంక్షన్స్, హైపర్‌బోలిక్ ఫంక్షన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్ టాపిక్స్‌ను సమగ్రంగా అధ్యయనం చేయాలి. వెక్టర్ ఆల్‌జీబ్రా నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వస్తున్నాయి. అడిషన్ ఆఫ్ వెక్టర్స్, ప్రొడక్ట్ ఆఫ్ వెక్టర్స్, మెజర్స్ ఆఫ్ డిస్పెర్షన్ అండ్ ప్రాబబిలిటీలో మెజర్స్ ఆఫ్ డిప్రెషన్, ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్‌పై పట్టుసాధించాలి.

ఫిజిక్స్

హీట్ అండ్ థర్మోడైనమిక్స్‌కు వెయిటేజీ ఇవ్వాలి. ఈ చాప్టర్ నుంచి దాదాపు పది ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. దీని తర్వాత వర్క్ ఎనర్జీ పవర్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్ అండ్ రొటేషనల్ మోషన్, లాస్ ఆఫ్ మోషన్, మోషన్ ఇన్ ఎ ప్లేన్, మూవింగ్ చార్జెస్ అండ్ మ్యాగ్నటిజం చాప్టర్ల నుంచి అయిదు లేదా ఆరు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆసిలేషన్స్, వేవ్స్, ఎలక్ట్రోస్టాటిక్ పొటెన్షియెల్ అండ్ కెపాసిటెన్స్‌పై చాప్టర్ల నుంచి నాలుగు ప్రశ్నల చొప్పున అడిగే అవకాశం ఉంది. వీటి తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఇండక్షన్, రేఆప్టిక్స్, ఆల్టర్నేటింగ్ కరెంట్, వేవ్ ఆప్టిక్స్, మోషన్ ఇన్ ఎ స్ట్రెయిట్ లైన్, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్, ఎలక్ట్రిక్ చార్జెస్ అండ్ ఫీల్డ్స్, డ్యూయల్ నేచుర్ ఆఫ్ రేడియేషన్ అండ్ మేటర్, న్యూక్లియై, సెమికండక్టర్ ఎలక్ట్రానిక్స్‌పై దృష్టిపెట్టాలి. పరీక్షలో అత్యధిక వెయిటేజీ ఉంటున్న మెకానిక్స్‌పై ప్రిపరేషన్ సమయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి. తర్వాత ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్ పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీ

కెమిస్ట్రీని ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలుగా విభజించుకొని చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇనార్గానిక్ తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలు నిలుస్తాయి. ఫిజికల్ కెమిస్ట్రీలో సొల్యూషన్స్ చాప్టర్ నుంచి ప్రధానంగా ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతున్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీని జనరల్, హైడ్రోకార్బన్లు, హాలో కాంపౌండ్లుగా విభజించుకొని చదవాలి.

బోటనీ

డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్(మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రో బయాలజీ (బ్యాక్టీరియా, వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో టెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జువాలజీ

జువాలజీ నుంచి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటొజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఈఏపీసెట్‌కు ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయా అంశాల అభ్యసనంతోపాటు వాటిపై ఉన్న అవగాహన తెలుసుకునేందుకు సమాధానాలు, సమస్యల



సాధన చేయాలి. అదే విధంగా షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు దానికి సంబంధించిన సూత్రం, సిద్ధాంతంపై అవగాహనతో అడుగులు వేయాలి. ఒక కాన్సెప్ట్‌కు చెందిన ప్రశ్నను భిన్న కోణాల్లో సమస్యను సాధించేందుకు కృషి చేయాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌కు సమయం వెచ్చించేలా సమయ పాలన పాటించాలి. విద్యార్థులు ప్రతి చాప్టర్‌లోని సినాప్సిస్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

పునశ్చరణ

అభ్యర్థులు పరీక్ష తేదీకి కనీసం నెల రోజుల ముందు నుంచి పూర్తిగా పునశ్చరణకే ప్రాధాన్యం ఇచ్చేలా సమయాన్ని కేటాయించుకోవాలి. దీనికి అనుగుణంగా తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకునే చేసుకునే విధంగా వ్యవహరించాలి. రివిజన్ సమయంలో తమకు ఎదురైన సందేహాలను నివృత్తి చేసుకోవాలి. కొత్త అంశాలు, అకడమిక్స్‌లో విస్మరించిన అంశాలుంటే వాటిపై కొత్తగా దృష్టి పెట్టడం సరికాదని గుర్తించాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.


SAMSUNG
Galaxy S24 Ultra
Circle it, find it
12:45
100%
Shorts
Google
Dislike
Add to your search
Sela Pass, Tawang
Tawang: Hidden gem of Arunachal Pradesh
Circle to Search
with Google